- రైతులకు త్వరలో డిజిటల్ ఐడీలు.. కేంద్రం ప్రకటన
- లోయలో పడ్డ బస్సు.. నలుగురు జవాన్ల దుర్మరణం
- ప్రైమరీ టీచర్ పోస్టుకు బీఈడీ అర్హత కాదు: సుప్రీం
- అగ్నివీర్ పథకంలో మార్పులు.. కేంద్రం దిద్దుబాటు
- మర మనుషులూ అబద్ధాలు ఆడతారు!

..లోపలి పేజీల్లో

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

శుక్రవారం FRIDAY 6.9.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 93 ‖ వెల (Price) రూ.6.50 | తదియ

శుక్రవారం, సూర్యోదయం: 6-03, సూర్యాస్తమయం: 6-25. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం శుక్ల పక్షం తిథి: తదియ పగలు 3-01 వరకు. నక్షత్రం: హస్త ఉదయం 9-25 వరకు, తదుపరి చిత్త. వర్జ్యం: సాయంత్రం 6-29 నుంచి రాత్రి 8-17 వరకు. రాహుకాలం: ఉదయం 10-41 నుంచి పగలు 12-14 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-32 నుంచి ఉదయం 9-21 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 12-38 నుంచి పగలు 1-28 వరకు. అమృతకాలం: తెల్లవారుజామున 5-19 నుంచి మర్నాడు ఉదయం 7-08 వరకు. హరితాళిక గౌరీ వ్రతం.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

• గురుకులం ఖాళీ!



నిర్వహణ వైఫల్యంతో గురుకులాలు ఖాళీ అవుతున్నాయి. సమస్యలపై రోజుకోచోట విద్యార్థులు ఆందోళనబాట పడుతున్నారు. అప్పటికీ ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించకపోతే.. ఈ బడి మాకొద్దు అంటూ గుడ్‌బై చెప్తున్నారు. రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌లో ఉన్న కందుకూరు గురుకులంలో ఇలాంటి పరిస్థితే నెలకొన్నది. ఇప్పటికే ఏడుగురు విద్యార్థులు టీసీ తీసుకొని వెళ్లిపోగా.. మిగిలినవారూ ఇంటిదారి పట్టే యోచనలో ఉన్నారు. గురువారం గురుకులానికి వెళ్లిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అక్కడి విద్యార్థుల అవస్థలు చూసి చలించిపోయారు.

› 10

ఆమరణ దీక్షలకు దిగుతాం

- గురుకుల పార్ట్‌టైం, గెస్ట్ ఫ్యాకల్టీల స్పష్టీకరణ
- రెండో రోజూ సొసైటీ కార్యాలయం ఎదుట ధర్నా
- సమాధానం ఇవ్వకుండానే వెళ్లిపోయిన సెక్రటరీ

› 10

మేడం ఎక్కడో.. ఆ మేనేజర్ అక్కడే!

- సోషల్ వెల్ఫేర్‌లో డిప్యుటేషన్‌పై ఎఫ్ఎం కిరణ్మయి
- టెస్కో, ఆయుష్‌లోనూ ఇదే సెక్రటరీ వద్ద విధులు
- అడ్డగోలుగా ఆరోపణలు.. కో ఆపరేటివ్ సొసైటీ విమర్శలు

› 10

• టీచర్ల కోసం లొల్లి!!



టీచర్స్‌డే రోజున టీచర్ల కోసం విద్యార్థులు రోడ్డెక్కారు. హైదరాబాద్ శేరిలింగంపల్లిలోని గౌలిదొడ్డి గురుకుల కాలేజీ విద్యార్థులు గురువారం ఆందోళనకు దిగారు. తాత్కాలిక అధ్యాపకులను తొలగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వివాదాస్పదమవుతున్న వేళ లెక్చరర్లకు మద్దతుగా విద్యార్థులు తరగతులను బహిష్కరించి ధర్నా చేపట్టారు. 'విద్యాసంవత్సరం మధ్యలో సీనియర్ ఫ్యాకల్టీలను మార్చొద్దు.. మా భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయొద్దు' అంటూ వారు నినాదాలు చేశారు.

› 10

పోలీసు పహారాలో జైనూర్

- వెయ్యి మందితో పటిష్ట బందోబస్తు
- 48 గంటల పాటు144 సెక్షన్ విధింపు
- మరో 4 ఏజెన్సీ మండలాల్లోనూ అమలు
- జిల్లాలో 30 యాక్ట్.. ఇంటర్నెట్ బంద్



కుమ్రం భీం జిల్లా కెరమెరి ఘాట్ వద్ద ఎమ్మెల్యే కోవ లక్ష్మిని అడ్డుకున్న పోలీసులు

- జైనూర్‌లోనే డీజీ, ఐజీ, ముగ్గురు ఎస్పీల మకాం
- అక్కడికి వెళ్లకుండా ఎమ్మెల్యే కోవలక్ష్మి అడ్డగింత
- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ హౌస్ అరెస్ట్
- రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దు : తెలంగాణ పోలీస్
- ఘటనపై వివరాలివ్వాలని ఎస్టీ కమిషన్ ఆదేశం
- గాంధీ దవాఖానలో మంత్రి సీతక్క నిలదీత

› 2



మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సీతారాంతండాలో వర్షపు నీటిలో మునిగి జాలు పట్టిన వరి పంట

33% పంట దెబ్బతింటేనే నష్ట పరిహారం

సర్కారు విధివిధానాలు జారీ

12 లోగా వివరాలివ్వాలని ఏఈవోలకు ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఇటీవల కురిసిన భారీ వర్షాలు, పోటెత్తిన వరదల కారణంగా పంటకు 33% నష్టం జరిగితేనే పరిహారం ఇవ్వాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు విధివిధానాలు ఖరారు చేస్తూ వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి గురువారం మార్గదర్శకాలు జారీచేశారు. అన్ని జిల్లాల వ్యవసాయాధికారులు దెబ్బతిన్న పంటల సమగ్ర గణన చేపట్టాలని ఆదేశించారు. వారం రోజుల్లోగా నివేదిక అందజేయాలని సూచించారు. మార్గదర్శకాలు ఇలా ఉన్నాయి..

పంట నష్టం జరిగిన ప్రతి వ్యవసాయ భూమిని ఏఈవోలు సందర్శించాలి. 33%, అంతకంటే ఎక్కువ నష్టం జరిగిన వాటి జాబితా తయారు చేయాలి. ఉద్యాన పంటల పంట నష్టాన్ని కూడా మండల వ్యవసాయాధికారే అంచనా వేయాలి. నష్టం అంచనాలను డీఏవోలు నిర్ధారించాలి. ఏడీఏలు తమ పరిధిలోని ప్రతి మండలంలో 25% క్షేత్రస్థాయిలో సందర్శించి ఏఈవోలు చేసిన పంట నష్టం అంచనాను ధ్రువీకరించాలి. జిల్లా వ్యవసాయాధికారులు ప్రతి మండలంలో 5% పంట నష్టం జరిగిన › 2వ పేజీలో

పంటల బీమాపై సర్కారు ధోకా!

- వానకాలం నుంచి అమలు చేస్తామన్న ప్రభుత్వం
- ఇప్పటివరకు టెండర్లు కూడా పిలవని వైనం
- సీజన్ ముగియడంతో యాసంగికి వాయిదా
- కుంభవృష్టితో కొట్టుకుపోయిన పంటలు
- పంట బీమా ఉంటే రైతుకు ఆర్థిక భరోసా
- ఎకరాకు రూ.10 వేల సర్కారు సాయం
- ఏప్రిల్ పంట నష్టమే ఎగ్గొట్టిందని ఆరోపణ
- ఈ పంటనష్టం ఎప్పుడిస్తదోనని రైతుల ఆవేదన

› 2

సర్కారు వెనుకడుగు

కొణతం విడుదల

- డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఉదయం ఇంటి నుంచి సీసీఎస్‌కు తరలింపు.. 8 గంటల పాటు విచారణ
- తెలంగాణ వాదుల నుంచి వ్యతిరేకత.. తరలివచ్చిన బీఆర్ఎస్ నాయకులు
- ఏ ఆధారాలతో పట్టుకెళ్లారంటూ నిలదీత.. సమాధానం చెప్పని పోలీసులు
- అక్రమ కేసులో దిలీప్‌ను అరెస్ట్ చేశారంటూ ప్రచారం.. రోజంతా హైడ్రామా
- వ్యతిరేకతతో దిగివచ్చిన సర్కార్..చివరికి 41 సీఆర్‌పీసీ నోటీసులిచ్చి విడుదల



హైదరాబాద్/సిటీబ్యూరో సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్, తెలంగాణవాది కొణతం దిలీప్‌ను గురువారం ఉదయం నిర్బంధంలోకి తీసుకున్న పోలీసులు రాత్రి పొద్దుపోయాక 41 సీఆర్‌పీసీ కింద నోటీసులు ఇచ్చి విడిచిపెట్టారు. అంతకుముందు పెద్ద హైడ్రామా నడిచింది. దిలీప్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ భవన్‌లో నిర్బంధించారు. ఆయన కుటుంబ సభ్యుల ద్వారా విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నేతలు జగదీశ్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, దాసోజు శ్రవణ్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్, పీ కార్తీక్‌రెడ్డి, క్రిశాంక్ సహా పలువురు పార్టీ సీనియర్ నేతలు సీసీఎస్‌కు చేరుకున్నారు. దిలీప్‌ను ఎందుకు నిర్బంధించారని ప్రశ్నించారు. పోలీసుల నుంచి సరైన సమాధానం రాకపోగా దురుసుగా ప్రవర్తించారు. దీంతో పోలీసులు, బీఆర్ఎస్ నేతలకు మధ్య వాగ్వాదం జరిగింది. దిలీప్‌ను విడుదల చేసేంత వరకు అక్కడే ఉంటామంటూ నిరసనకు దిగారు. దీంతో సీసీఎస్ వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు, దిలీప్‌ను ప్రశ్నించిన పోలీసులు అనంతరం మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరుస్తారని అందరూ భావించారు. అయితే, దిలీప్ నిర్బంధంపై సర్వత్ర విమర్శలు వ్యక్తం కావడంతో వెనక్కి తగ్గిన పోలీసులు అనూహ్యంగా 41 సీఆర్‌పీసీ కింద › 3వ పేజీలో



ఆరుగురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎదురుకాల్పులు
- మృతుల్లో అగ్రనేత లచ్చన్న దంపతులు
- జనజీవనంలోకి రావాలని డీజీపీ పిలుపు
- ముగ్గురు మంత్రులదే బాధ్యత: ఆజాద్

› 10




స్థానికతను తేల్చండి



- మార్గదర్శకాలు రూపొందించి ప్రవేశాలు చేపట్టాలి
- తెలంగాణ వారంతా స్థానిక కోటా కింద అర్హులే
- నిబంధన 3(ఎ)ను రద్దు చేస్తే వారికి అన్యాయం
- మెడికల్ అడ్మిషన్లపై హైకోర్టు కీలక తీర్పు

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో ప్రవేశాలు పొందేందుకు స్థానికులకు అవకాశం కల్పించాల్సిందేనని హైకోర్టు తేల్చి చెప్పింది. రాష్ట్రంలో శాశ్వత నివాసం ఉంటున్న స్థానికులకు మెడికల్, డెంటల్ కాలేజీల ప్రవేశాల్లో అవకాశం కల్పించాలని గురువారం తీర్పు చెప్పింది. మెడికల్ › 2వ పేజీలో

నిఘా నీడలో మంత్రులు!



- నేతలు, అధికారుల కదలికలపైనా కన్ను
- ప్రత్యేక విభాగంతో నిరంతర నిఘా
- ఢిల్లీలో నేతల కదలికలపైనా సర్వెలెన్స్
- తనపై ఎవరైనా ఫిర్యాదు చేసినట్టు తెలిస్తే.. ఆస్థాన మీడియాలో వ్యతిరేక కథనాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇప్పుడంతా నిఘా రాజ్యం నడుస్తున్నది. మంత్రులు, కీలక నేతలపై నిరంతర నిఘా కొనసాగుతున్నట్టు సమాచారం. ముఖ్యంగా కొందరు మంత్రుల కదలికలను తెలుసుకునేందుకు పోలీసు శాఖలోని నిఘా విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక దళాన్ని నియమించినట్టు కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతున్నది. కీలక పోస్టుల్లో ఉన్న అధికారుల కదలికలనూ నిరంతరం గమనిస్తున్నారని తెలుస్తున్నది. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో తమ ప్రభుత్వంలో మంత్రులపై, అధికారపార్టీ ఎమ్మెల్యేలపై నిఘానే ఉండదని, ఎల్లడలా స్వేచ్ఛ ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పిన విషయం తెలిసిందే. అయితే, ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యిందని పలువురు కాంగ్రెస్ నేతలు సన్నిహితుల వద్ద వాపోతున్నారు. గడిచిన › 6వ పేజీలో

42% కోటా ఉత్తమాటే?

- బీసీ రిజర్వేషన్ పెంచకుండానే స్థానిక ఎన్నికలు?
- పార్టీల వారీగా సీట్లిద్దామనే ప్రతిపాదన తెరపైకి
- కోర్టుకెళ్లి అనుమతి తీసుకునే యోచనలో సర్కార్
- కొత్త బీసీ కమిషన్ ఏర్పాటు చేస్తే మరింత జాప్యం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైఖరితో గందరగోళం
- బీసీల పోరాటంపై పట్టింపేది?: ప్రజాసంఘాలు

› 6

అలీ చెరువు విలవిల్లా!



- నిక్షేపమైన నీటి వనరును చెరపట్టిన రియల్ఎస్టేట్ సంస్థ
- ఎఫ్‌టీఎల్‌తో పాటు బఫర్‌లోనూ యథేచ్ఛగా విల్లాల నిర్మాణం
- ఇష్టానుసారంగా క్లబ్ హౌస్‌లు, స్విమ్మింగ్‌పూల్ ఏర్పాటు
- గతంలో ఇక్కడే బీహార్ ఎమ్మెల్యేలతో క్యాంపు పెట్టిన కాంగ్రెస్
- ఆ సందర్భంగా సీఎం రేవంత్ రాకతో సర్కారు నిధులతో రోడ్డు
- నోటీసులు అంటూ కాలయాపన చేస్తున్న నీటిపారుదలశాఖ
- హైడ్రా పరిధికి రాకున్నా లేఖ రాశామంటూ చేతులెత్తేసే యత్నం

› 2

కౌన్ బనేగా సీఎం?

- కర్ణాటక కాంగ్రెస్‌లో తీవ్రమవుతున్న కుర్చీలాట
- పదవి కోసం డీకే శివకుమార్ తీవ్ర ప్రయత్నాలు
- రేసులోకి సతీశ్ జార్కిహోళి.. ఢిల్లీలో చర్చలు
- సీఎం మార్పుపై సమీకరణాల బేరీజులో కాంగ్రెస్
- హైకమాండ్ పరిశీలనలో ఖర్గే, పరమేశ్వర పేర్లు
- మంత్రులకు విందు ఇచ్చిన సీఎం సిద్ధరామయ్య
- కుర్చీ కాపాడుకునేందుకు చివరి ప్రయత్నాలు?

› 7

విత్తన గణపతుల పంపిణీ

- ప్రారంభించిన మాజీ ఎంపీ సంతోష్



హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌కుమార్ నేతృత్వంలో గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా గురువారం హైదరాబాద్‌లో విత్తన గణేశ్ విగ్రహాల పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విత్తన గణపతులను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. విత్తన విగ్రహాలను స్వచ్ఛమైన మట్టి, కోకోపీట్ లేదా కోకో పౌడర్‌తో వివిధ రకాల విత్తనాలతో తయారుచేసినట్టు చెప్పారు. పూజ అనంతరం ఈ విగ్రహాలను మట్టిలో లేదా పెద్ద కుండలో ఉంచితే, కొన్ని రోజుల తర్వాత విత్తనాలు మొలకెత్తుతాయని వివరించారు. నిర్దిష్ట పరిమాణంలోకి వచ్చిన తర్వాత వాటిని తిరిగి అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లు లేదా పార్కుల్లో మట్టిలో నాటవచ్చని తెలిపారు. పర్యావరణ, ఆరోగ్య ప్రయోజనాల కోసం చింతపండు, వేప వంటి చెట్లను ఎక్కువగా పెంచాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన సలహా మేరకు విత్తన గణపతి విగ్రహాలను ప్రతి ఏటా పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. విత్తన గణపతి కార్యక్రమంలో భాగంగా ఔషధ విలువలు కలిగిన మొక్కలను నాటేలా ప్రణాళిక చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, గ్రీన్ ఇండియా చాలెంజ్ ప్రతినిధులు కరుణాకర్‌రెడ్డి, రాఘవ, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

2018లో గ్రీన్ చాలెంజ్ ప్రారంభం

తెలంగాణలో గ్రీన్ కవర్‌ను మెరుగుపరచడానికి 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమం స్ఫూర్తితో 2018లో గ్రీన్ ఇండియా చాలెంజ్‌ను సంతోష్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు అమితాబ్‌బచ్చన్, సంజయ్ దత్, అజయ్‌దేవగన్, కృష్ణ, చిరంజీవి, పవన్‌కల్యాణ్, సచిన్ టెండూల్కర్, పుల్లెల గోపీచంద్, సానియా గోపీచంద్, పీవీ సింధు, నాగార్జున, ప్రభాస్, మహేశ్ బాబు, రాజమౌళి, సమంత, శృతిహాసన్, శ్రద్ధాకపూర్ వంటి ప్రముఖులు పాల్గొని మొక్కలు నాటారు. కొంతమంది ప్రముఖులు అడవులను దత్తత సైతం తీసుకున్నారు. ఆ తర్వాత ఈ కార్యక్రమాన్ని మరింతగా విస్తరించి ప్రముఖుల పుట్టిన రోజులు, బీఆర్‌ఎస్ నేతల బర్త్ డే, వివాహ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు.

• ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల స్వీకరణ



రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకుంటున్న తాడూరి సంపత్‌కుమార్, పెసర ప్రభాకర్‌రెడ్డి

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు స్వీకరిస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు తాడూరి సంపత్‌కుమార్, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు పెసర ప్రభాకర్‌రెడ్డి.

- గంభీరావుపేట/ఖమ్మం ఎడ్యుకేషన్

సుభాన్ హీరో.. సర్కార్ జీరో

- తొమ్మిది మందిని కాపాడి జేసీబీ డ్రైవర్ హీరో అయిండు
- ఖమ్మంలో ముగ్గురు మంత్రులు జీరో అయిండ్రు
- కేసీఆర్ ఒక వ్యవస్థ
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి, బీఆర్‌ఎస్వీ నేత తుంగ బాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : పక్కరాష్ట్రం నుంచి వచ్చిన రోజువారీ కూలీ, జేసీబీ డ్రైవర్ సుభాన్‌ఖాన్ తొమ్మిది మందిని కాపాడి హీరో అయితే, ఒక్కరినీ కాపాడలేక ఖమ్మంలో ప్రభుత్వం, ముగ్గురు మంత్రులు జీరో అయ్యారని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. 'క్యాబినెట్‌లో మిగిలిన ఆరు మంత్రి పదవులు భర్తీ చేసినప్పుడు సుభాన్ లాంటి దృఢమైన వ్యక్తిని మంత్రిగా పెట్టుకోండి.. ప్రజలకు ధైర్యాన్నిస్తారు' అని చురకలంటించారు. రాష్ట్రంలో 18 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, బాధిత రైతులందరికీ నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి నాలుగైదు హెలికాప్టర్లు వాడిన కాంగ్రెస్ పార్టీ, వరదలో కొట్టుకుపోతున్న ప్రజలను రక్షించేందుకు ఒక్క హెలికాప్టర్‌ను కూడా ఎందుకు సమకూర్చుకోలేకపోయిందని నిలదీశారు. దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి, బీఆర్‌ఎస్వీ నేత తుంగ బాలుతో కలిసి హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మొదటి రెండు రోజుల పాటు వరదలను ప్రభుత్వం అస్సలు పట్టించుకోలేదని, మూడో రోజు తీరిగ్గా సీఎం బయలుదేరినా, ప్రతిపక్ష నేతను విమర్శించేందుకే వెళ్లినట్టున్నదని ఎద్దేవాచేశారు. వరద బాధితులకు సాయం గురించి అధికారులతో సమావేశం పెట్టి ప్రతిపక్షాన్ని నిందించడం ఏమిటని ప్రశ్నించారు. కేసీఆర్ కనిపించడం లేదనడం ఆశ్చర్యంగా ఉన్నదని, కేసీఆర్ అంటే వ్యక్తి కాదు.. వ్యవస్థ అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రతి అభివృద్ధిలో, నీటిలో, పంటల్లో కేసీఆర్ ఉంటారని చెప్పారు. ఖమ్మంలో క్షేత్రస్థాయిలో బీఆర్‌ఎస్ శ్రేణులు, నేతలు ప్రజలకు సాయం చేయడంలో ముందున్నారని తెలిపారు. విపత్కర పరిస్థితులు, ప్రజలు అపత్కాలంలో ఉన్నప్పుడు ప్రభుత్వాలు మానవీయ కోణంలో పనిచేయాలని నిరంజన్‌రెడ్డి సూచించారు. దురదృష్టవశాత్తు ఈ ప్రభుత్వానికి ఆ కోణం లేదని మండిపడ్డారు. వరద బాధితులు హాహాకారాలు చేస్తుంటే మంత్రులు, సీఎం తలోరకంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇక్కడ సరిగా పని చేయకుండా ప్రధాని రాక కోసం ఎదురు చూస్తున్నారని ఎద్దేవాచేశారు. హైదరాబాద్ నుంచి కదలకుండానే వరద ప్రాంతాలను పీఎం సందర్శించాలని సీఎం చెప్పడం ఆశ్చర్యంగా ఉన్నదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్‌లో రాష్ట్రానికి రాసిన లేఖలో ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధులు రూ.1,300 కోట్లు అందుబాటులో ఉన్నట్టు తెలిపిందని గుర్తుచేశారు. క్షేత్రస్థాయిలో నష్టం వివరాలను రాష్ట్రం పంపలేదని చెప్పిందని మండిపడ్డారు.

తిట్టడానికో మంత్రిని పెట్టుకోండి

చేరికలకు ప్రత్యేకంగా రెవెన్యూ మంత్రిని పెట్టిన కాంగ్రెస్, ప్రతిపక్షాలను తిట్టేందుకూ ఓ మంత్రిని పెట్టుకోవాలని నిరంజన్‌రెడ్డి చురకలంటించారు. పరామర్శకు సీఎం.. జీపులో నిలబడి చేతులు ఊపుతూవెళ్తారా అని విమర్శించారు. పాలమూరు బిడ్డ సీఎం అయి 9 నెలలైనా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలను చూడలేదని, నీటిపారుదలశాఖ మంత్రి కన్నెత్తి చూడలేదని మండిపడ్డారు. 40 రోజులు కష్టపడితే నాలుగు రిజర్వాయర్లు నింపే అవకాశం ఉండేదని, అందులోనూ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

ప్రైవేట్ టీచర్ల సంక్షేమ చట్టం తేవాలి

- మాజీ ఎంపీ వినోద్‌కుమార్



హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ టీచర్ల కోసం సంక్షేమ చట్టం తేవాల్సిన అవసరం ఉన్నదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. 52 శాతం మంది విద్యార్థులు ప్రైవేట్ విద్యాసంస్థల్లోనే చదువుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయని గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల ఉపాధ్యాయులు తమ పరిధిలో ఉన్న సౌకర్యాలను ఉపయోగించుకొని భావిభారత పౌరులను తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలు లేని సమయంలో ఉన్న వసతులతోనే సేవలందించిన ప్రభుత్వ ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని కొనియాడారు. ప్రైవేట్ టీచర్లకు చట్టం తేవాలని తాను ఎంపీగా ఉన్న సమయంలో ప్రైవేట్ బిల్లును పార్లమెంటులో పెట్టానని గుర్తుచేశారు. న్యాయవాదులు, భవన నిర్మాణ రంగ కార్మికుల కోసం దేశంలో మొట్టమొదటి సారిగా సంక్షేమ చట్టం తెచ్చినట్టు తెలిపారు.

పార్లమెంట్‌లో ప్రైవేట్ టీచర్ల బిల్లు పెట్టాలి

- ట్రస్మా మాజీ అధ్యక్షుడు శేఖర్



హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ప్రైవేట్ టీచర్ల సంక్షేమ బిల్లు ప్రవేశపెట్టాలని ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు శేఖర్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 60శాతం మంది విద్యార్థులకు తక్కువ ఫీజుతో ప్రైవేట్ స్కూళ్లలో నాణ్యమైన విద్య అందిస్తున్నట్టు తెలిపారు. ప్రైవేట్ స్కూళ్లల్లో పనిచేస్తున్న టీచర్లు అరకొర వేతనాలతో బతుకులు వెళ్లదీసున్నట్టు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి రూ.10లక్షల ఆరోగ్య, జీవిత బీమా కల్పించాలని, తగిన వేతనం ఇవ్వాలని కోరారు.

ప్రజల దృష్టి మరల్చేందుకే 'హైడ్రా' మాలు

- ఎస్‌ఎన్‌డీపీ చర్యలతోనే హైదరాబాద్ సురక్షితం
- బీఆర్‌ఎస్ నేత పుట్ట విష్ణువర్ధన్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : హైడ్రా చర్యల వల్ల ముంపు తగ్గిందని సీఎం రేవంత్‌రెడ్డి అవగాహన రాహిత్యంగా మాట్లాడారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన ఎస్‌ఎన్‌డీపీ (వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం)తోనే హైదరాబాద్ సురక్షితంగా ఉన్నదని బీఆర్‌ఎస్ నేత పుట్ట విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా తీసుకున్న చర్యలతోనే హైదరాబాద్‌లో ముంపు తగ్గిందని గుర్తుచేశారు. గురువారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ హైదరాబాద్‌లో రెండు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విమానాలు అందుబాటులో ఉన్నట్టు కేంద్ర హోంశాఖ లేఖ ద్వారా తెలిసిందని, అయినా వాటిని ఖమ్మం వరదల సందర్భంగా వాడుకోని దద్దమ్మ ప్రభుత్వం రేవంత్‌దని దుయ్యబట్టారు. జేసీబీ డ్రైవర్ సుభాన్‌ఖాన్ సాహసం వల్ల బాధితుల ప్రాణాలు నిలబడ్డాయి తప్ప రేవంత్ సర్కార్ వల్ల కాదనే విషయాన్ని గుర్తించాలని చెప్పారు. ప్రజల దృష్టి మళ్లించేందుకే హైడ్రాతో డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. 2020లో హైదరాబాద్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేసినప్పుడే కేటీఆర్‌కు నాలాల విస్తరణ ఆలోచన రాగా నవంబర్‌లోనే ఎస్‌ఎన్‌డీపీ జీవో తెచ్చి మొదటి విడతలో రూ.980 కోట్లు విడుదల చేశారని గుర్తుచేశారు. ఆ పనులతోనే హైదరాబాద్ ముంపు బారినుంచి బయటపడిందని చెప్పారు.రాష్ట్ర నిధులతోనే కేసీఆర్ ప్రభుత్వం ఎస్‌ఎన్‌డీపీ పనులు చేపట్టి ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం చూపిందని తెలిపారు. 14 ప్రాంతాలు,175 కాలనీల్లోని నాలుగు లక్షల కుటుంబాలకు వరద ముంపు తప్పిందని చెప్పారు. సీఎం రేవంత్‌కు ఎస్‌ఎన్‌డీపీ అంటే తెలుసా? అని ప్రశ్నించారు. రేవంత్ పాలనలో మళ్లీ కరెంటు, నీటి కష్టాలు తప్పడం లేదని, 9 నెలల పాలనలో హైదరాబాద్‌కు కొత్తగా దక్కిందేమీ లేదని ఎద్దేవాచేశారు.

ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్న ప్రభుత్వం!

- ఓడినవారితో సీఎంఆర్‌ఎఫ్, కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ సిగ్గుచేటు
- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



జమ్మికుంటలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట, సెప్టెంబర్ 5: కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు సహా పోలీసు ఉన్నతాధికారుల ఫోన్లను ట్యాపింగ్ చేస్తున్నట్టు అనుమానాలున్నాయని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. ఈ విషయమై జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించి సీబీఐ విచారణకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. మానకొండూర్ సీఐతో కరీంనగర్ సీపీ టెలికాన్ఫరెన్స్ మాట్లాడటం లేదని ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే మంత్రి ఇంట్లోనే వెల్లడించడం ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారనడానికి బలమైన ఉదాహరణగా పేర్కొన్నారు. పోలీసుల ఇంటర్నల్ విషయాలు ఎమ్మెల్యేకు ఎలా తెలిశాయో చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు ఏం చేస్తున్నారు? ఏం మాట్లాడుతున్నారు? అనే విషయాలను ట్యాపింగ్ ద్వారా తెలుసుకుంటున్నదని ఆరోపించారు. బుధవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు నివాసంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మానకొండూర్ ఎమ్మెల్యే పోస్టింగులు ఇప్పించుకుంటే.. తనకూ ఇప్పించుకునేందుకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రుణ మాఫీ అర్హులందరికీ ఎందుకు చేయడంలేదని నిలదీశారు. సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యేలుగా ఓడిపోయిన నాయకులతో పంపిణీ చేయడం సిగ్గుచేటని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేని చోట ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. నిధుల మంజూరు కోసం అవసరమైతే కోర్టు మెట్లెక్కుతానని స్పష్టంచేశారు.

కొణతం దిలీప్ విడుదల



కొణతం దిలీప్ అరెస్టును నిరసిస్తూ బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయానికి చేరుకున్న పార్టీ సీనియర్ నేతలు జగదీశ్‌రెడ్డి, బాల్క సుమన్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, దాసోజు శ్రవణ్, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, కార్తీక్‌రెడ్డి తదితరులు

› మొదటిపేజీ తరువాయి...

నోటీసులు ఇచ్చి వదిలిపెట్టారు. కాగా, సీసీఎస్ వద్ద బీఆర్‌ఎస్ నేతలను పోలీసులు అడ్డుకోవడం సహా అక్కడి తతంగాన్ని తన చిత్రీకరిస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్త నుంచి పోలీసులు సెల్‌ఫోన్ లాక్కున్నారు.

పోలీసులు ఏమంటున్నారంటే?

ఆసిఫాబాద్‌లో జరిగిన అల్లర్లకు సంబంధించిన వీడియోలు, ఫొటోలను తెలుగు స్క్రైబ్ ట్విట్టర్ హ్యాండిల్‌లో పోస్టు చేశారని, అవి మత కలహాలను రెచ్చగొట్టేలా ఉండడంతో సుమోటోగా తీసుకుని దిలీప్‌ను అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. తెలుగు స్క్రైబ్ ట్విట్టర్ హ్యాండిల్‌ను ఆయన నిర్వహిస్తున్నట్టు తెలిసి నిర్బంధంలోకి తీసుకున్నట్టు చెప్పారు.

ఫిర్యాదు ఎవరు చేశారు?

దిలీప్‌ను పోలీసులు నిర్బంధంలోకి తీసుకోవడంపై అంతకుముందు మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఎవరి ఫిర్యాదు ఆధారంగా ఆయనను అదుపులోకి తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసుల సమాధానాలు పొంతన లేకుండా ఉన్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపితే పోలీసులతో దౌర్జన్యానికి దిగుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరదలపై సీఎం, మంత్రులు నిద్రావస్థలో ఉన్నారని సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయని, అలాంటి వాటిని కట్టడి చేసేందుకే ఈ తరహా నిర్బంధాలకు దిగుతున్నారని ఆరోపించారు. పోలీసులపై ఆధారపడి బతకాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. మాట్లాడితే ప్రజా ప్రభుత్వమంటున్నారని, కానీ ఇది పోలీసు రాజ్యమని విమర్శించారు. ఏ కారణం లేకుండా దిలీప్‌ను నిర్బంధించినందుకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆధారాలుంటే చూపించండి

దిలీప్‌ను ఏ ఆధారంతో నిర్బంధంలోకి తీసుకున్నారని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. ఆధారాలు ఉంటే చూపించాలని కోరారు. కుటుంబ సభ్యులతోనూ మాట్లాడనివ్వకుండా గంటలపాటు నిర్బంధంలో పెట్టడం ఏంటని నిలదీశారు. తెలుగు స్క్రైబ్ ట్విట్టర్ హ్యాండిల్‌కు, దిలీప్‌కు ఎలాంటి సంబంధమూ లేదని స్పష్టం చేశారు. మతకల్లోలాలను బీఆర్‌ఎస్ ఎన్నడూ ప్రమోట్ చేయలేదని పేర్కొన్నారు. బీజేపీ మాత్రం బహిరంగంగానే ఆ పని చేస్తున్నదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీ ఐటీ సెల్‌కు దిలీప్ అపాయింట్ అయినట్టు లెటర్ ఏమైనా ఉన్నదా? అని ప్రశ్నించారు. సీఎం ఆదేశాలతోనే ఆయనను అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. మతం పేరుతో చిచ్చు పెడుతున్న వారిని మాత్రం ముట్టుకోవడం కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

• హైకోర్టు చీవాట్లు పెట్టినా బుద్ధి రాలే

ప్రభుత్వ చేతకానితనాన్ని దిలీప్ కొంతకాలంగా ప్రశ్నిస్తుండడంతోనే ఆయనను నిర్బంధంలోకి తీసుకున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దుయ్యబట్టారు. తప్పుడు కేసులో ఇబ్బంది పెట్టాలని చూసినందుకు కొన్ని రోజుల క్రితం హైకోర్టు చీవాట్లు పెట్టినా ప్రభుత్వానికి బుద్ధి రాలేదని మండిపడ్డారు. ఏ కేసులో అదుపులోకి తీసుకుంటున్నారో కూడా చెప్పలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నించే గొంతు నొక్కడమేనా ప్రజాపాలన? అని ప్రశ్నించారు. అక్రమ నిర్బంధాలతో పాలన కొనసాగించాలనుకోవడం భ్రమేనని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని అక్రమ నిర్బంధాలు చేసిన ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారు పుట్టుకొస్తూనే ఉంటారని చెప్పారు. 9 నెలలుగా రాష్ట్రంలో వాక్ స్వాతంత్ర్యం లేదని విమర్శించారు.

• నిరంకుశత్వానికి నిదర్శనం




కొణతం దిలీప్ అక్రమ నిర్బంధాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. తెలంగాణలో కొనసాగుతున్న నిరంకుశత్వానికి ఇది నిదర్శనం. సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తే నిర్బంధిస్తారా? కక్షపూరిత, ప్రతీకార చర్యలకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలి. ప్రభుత్వ బెదిరింపులకు భయపడేది లేదు. ప్రజాసమస్యలపై పోరాటాన్ని ఆపేది లేదు. **- హరీశ్‌రావు**

• కాంగ్రెస్‌తో తెలంగాణ ఆగం

పాలన చేతగాక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను నొక్కుతున్నది. 9 నెలల పాలనతో తెలంగాణను కాంగ్రెస్ ఆగం చేసింది. రాష్ట్రంలో అప్రకటిత నిర్బంధం కొనసాగుతున్నది. **- నిరంజన్ రెడ్డి**

• ఎమర్జెన్సీ రోజులు గుర్తొస్తున్నయ్



దిలీప్‌ను అరెస్ట్ చేయవద్దని హైకోర్టు స్పష్టంగా ఆదేశాలు ఇచ్చినప్పటికీ నిర్బంధంలోకి తీసుకోవడం అమానుషం. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులు ఎమర్జెన్సీని గుర్తుకు తెస్తున్నయ్. ఎన్ని అక్రమ నిర్బంధాలు చేసినా ప్రజల తరపున ప్రశ్నిస్తూనే ఉంటం.

- దేవీ ప్రసాద్, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్

• దిలీప్ అరెస్ట్ అక్రమం



ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగడుతున్న దిలీప్‌ను నిర్బంధించడం అక్రమం. కేసు వివరాలు కూడా చెప్పకుండా అదుపులోకి తీసుకున్నారు. ప్రశ్నించే గొంతును ప్రభుత్వం నొక్కుతున్నది. ఇది ప్రజాపాలన కాదు.. నిరంకుశ పాలన.

-పల్లె రవికుమార్, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్

• నిర్బంధాలతో ఆపలేరు



ప్రభుత్వ వైఫల్యాలను సోషల్ మీడియా వేదికగా ఎత్తిచూపితే నిర్బంధించేస్తారా? ఇలాంటి వాటితో ప్రశ్నించే గొంతులు నొక్కలేరు.

-దూదిమెట్ల బాలరాజు, బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి

• ప్రభుత్వం వేధిస్తున్నది



దిలీప్ చేసిన నేరం ఏమిటో ప్రభుత్వం చెప్పాలి. ప్రజల పక్షాన ప్రశ్నించిన వారిని ప్రభుత్వం వేధిస్తున్నది. దిలీప్ కుటుంబానికి అండగా ఉంటాం.

- అనిల్, ఎన్నారై బీఆర్‌ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు

• సీఎం ఆఫీసులో ఎఫ్ఐఆర్



కాంగ్రెస్ తప్పులను ఎత్తిచూపుతున్న దిలీప్‌పై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కక్ష కట్టింది. ఎలాంటి కారణం లేకుండా అయనను నిర్బంధించింది.రేవంత్ పాలనలో ఎఫ్ఐఆర్‌లు పోలీస్ స్టేషన్‌లో కాకుండా రేవంత్ కార్యాలయంలో తయారవుతున్నాయి.

-పడాల సతీశ్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు





గాంధీ దవాఖాన వద్ద మంత్రి సీతక్కను అడ్డుకుంటున్న బీజేపీ మహిళా కార్యకర్తలు

సీతక్కకు నిరసన సెగ

- గాంధీలో అడ్డుకున్న మహిళలు
- గేటు వద్ద మంత్రితో వాగ్వాదం
- ఆదివాసీ మహిళకు న్యాయం చేయాలని డిమాండ్

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 5 : ఆటోడ్రైవర్ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆదివాసి మహిళను గాంధీ దవాఖానలో గురువారం పరామర్శించేందుకు వచ్చిన మంత్రి సీతక్కకు మహిళల నుంచి నిరసన సెగ తగిలింది. బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, కార్యకర్తలు, మహిళలు గాంధీ ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలిపారు.ఆదివాసీ మహిళకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు జోక్యంతో మంత్రి బాధితురాలిని పరామర్శించారు.

మతం రంగు పులుమొద్దు : సీతక్క

జైనూరు ఘటనకు మతం రంగు పులుమొద్దని మంత్రి సీతక్క హితవు పలికారు. నిందితుడిని ఉరితీయాలని బీజేపీ నేతలు డిమాండ్ చేయడాన్ని ఆమె తప్పుపట్టారు. లైంగిక దాడి నిందితులను ఉరి తీసేలా కేంద్రం చట్టం చేస్తే అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని స్పష్టం చేశారు. అలాంటి చట్టాన్ని బీజేపీ నేతలు తీసుకురాగలరా? అని మంత్రి సవాల్ చేశారు. నిందితుడికి కఠిన శిక్షణ పడేవరకు ప్రభుత్వం వదిలిపెట్టదని చెప్పారు. బాధితురాలి కుటుంబ సభ్యులకు గిరిజన సంక్షేమ శాఖ తరపున రూ.లక్ష చెక్కు అందచేశారు.

మానవత్వంతో చూడాలి: కేంద్రమంత్రి బండి

జైనూర్‌లో ఓ వర్గం యథేచ్ఛగా దాడులు చేస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోని అసమర్థ సర్కారు ఇది అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. గురువారం రాత్రి గాంధీ దవాఖానలో బాధితురాలిని పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆదివాసీమహిళపై జరిగిన దాడిని చూస్తే మానవత్వం ఉన్నవారెవరూ తట్టుకోలేరని చెప్పారు. ప్రభుత్వం లక్ష ఇచ్చి చేతులు దులుపుకోవడం ఏం బాగోలేదని విమర్శించారు. మతపరమైన ఘటనగా చూడకుండా మానవత్వంతో మహిళకు జరిగిన అన్యాయంగా చూడాలని చెప్పారు.

ఇంత నిర్లక్ష్యం ఎందుకు : మహేశ్వర్ రెడ్డి

జైనూర్‌లో గిరిజనులపై దాడులు పెరిగినా ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని బీజేపీ శాసన సభ పక్షనేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ఘటనపై ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని నిలదీశారు. గాంధీలో బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఘటన జరిగి ఇప్పటికే ఐదు రోజులైందని, ఆమెపై లైంగికదాడి జరిగినట్టు వైద్యులు నిర్ధారణ చేయకపోవడం అనేక అనుమానాలకు దారి తీస్తున్నదని చెప్పారు.

మహిళల రక్షణలో ప్రభుత్వం విఫలం: ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్/ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 5 : మహిళల రక్షణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మండిపడ్డారు. జైనూర్ వెళ్తుండగా కెరమెరి ఘాట్ వద్ద ఆమెను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులపై ఆమె తీవ్ర ఆగ్రహం చేసి ఆసిఫాబాద్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీ మహిళపై జరిగిన అఘాయిత్యయత్నానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, నిందితుడికి యావజ్జీవ శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళను పరామర్శించి, ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరినట్టు తెలిపారు.

పోలీస్ పహారాలో జైనూర్

- వెయ్యి మందితో పటిష్ట బందోబస్తు
- 48 గంటల 144 సెక్షన్
- ఆసిఫాబాద్ జిల్లాలో ఇంటర్నెట్ బంద్
- ఎమ్మెల్యే కోవ లక్ష్మి అడ్డగింత
- ఎమ్మెల్యే పాయల్ శంకర్ హౌస్ అరెస్ట్

మంచిర్యాల, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఆదివాసీ మహిళపై ఓ వర్గం వ్యక్తి దాడి ఘటనతో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. దాదాపు 1000 మంది పోలీసులు జైనూర్‌లో పహారా కాస్తున్నారు. రెండు ఫైర్ ఇంజిన్లను రప్పించి గురువారం మధ్యాహ్నం వరకు షాపుల్లోని మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. పడిపోయేలా ఉన్న మూడు బిల్డింగ్‌లను జేసీబీతో కూల్చివేశారు. రోడ్లపైకి ఎవరూ రాకుండా గస్తీ కాస్తున్నారు. జైనూర్‌లో గురువారం ఉదయం నుంచి 48 గంటల పాటు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ప్రకటించారు. జైనూర్‌తోపాటు ఏజెన్సీ మండలాలైన ఇంద్రవెల్లి, నార్నూర్, ఉట్నూర్, గాదిగూడ మండలాల్లోనూ 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఇల్లు విడిచి ఎవరూ బయటికి రావొద్దని, ఇద్దరికి మించి రోడ్ల మీద గుంపులుగా కనిపించొవద్దని ఆదేశాలు జారీచేశారు. మండలం కేంద్రంలోని ప్రతి గల్లీలోనూ పోలీసులు కాపలా ఉన్నారు.

ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, అడిషనల్ డీజీ (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్, నార్త్ జోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్, ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం, బాలానగర్ డీసీపీ (ఆసిఫాబాద్ పాత ఎస్పీ) సురేశ్ కుమార్ జైనూర్‌లోనే ఉంటూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. జైనూర్‌లోని ఓ వర్గానికి చెందిన పెద్దలతో పాటు, ఉట్నూర్‌లోని కుమ్రం భీం భవన్‌లో ఆదివాసీ నాయకులతో పోలీసులు సమావేశం నిర్వహించారు. సంయమనం పాటించాలని, శాంతియుతంగా ఉండాలని సూచించారు. జైనూర్‌కు వెళ్లే ఆరు మార్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఇతరులెవరినీ లోపలికి అనుమతించడం లేదు. మీడియానూ బయటే ఆపేసి, తిరిగి పంపించేస్తున్నారు. ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. జిల్లా వ్యాప్తంగా 30 యాక్ట్ అమలు చేస్తున్నారు. అనుమతులు లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, మీటింగ్‌ల నిర్వహణపై నిషేధం విధించారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఘటనా స్థలికి వెళ్తుండగా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని అడ్డుకొని వెనక్కి పంపించారు.



ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో పరిస్థితిని సమీక్షిస్తున్న అధికారులు

జైనూర్‌లో శాంతి నెలకొనాలి : కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో తక్షణం శాంతినెలకొనాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆకాంక్షించారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని, నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూడాలని, అల్లర్లలో ఇండ్లు, షాపులు కోల్పోయినవారికి సాయమందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం కేవలం రూ.లక్ష ఇచ్చి చేతులు దులుపుకోవాలని చూడటం దుర్మార్గమని మండిపడ్డారు. ఉద్రిక్తతలు పెచ్చరిల్లుతున్నాయన్న ముందస్తు సమాచారం ఉన్నా వాటిని నివారించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పూర్తి స్థాయిలో హోం మంత్రి లేకుండానే రాష్ట్రాన్ని నడపటం వల్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు.

నిరంకుశత్వంతో భయపెట్టలేరు

తెలంగాణ బిడ్డలను చట్టవిరుద్ధంగా, అక్రమంగా, నిరంకుశంగా అరెస్ట్ చేసి భయపెట్టలేరనే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలని కేటీఆర్ స్పష్టం చేశారు. అలా చేయాలనుకుంటే అంతకన్నా మూర్ఖత్వం మరోటి ఉండదని చెప్పారు. వరద సాయం విషయంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకే కొణతం దిలీప్‌ను అరెస్ట్ చేశారని దుయ్యబట్టారు. రైతు రుణమాఫీ విషయంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి, ఆరు గ్యారెంటీల డొల్లతనాన్ని బయటపెట్టి, ప్రజల ముందు సర్కారు సిగ్గుపడేలా చేశాడనే అక్కసుతోనే ఆయనను అరెస్ట్ చేశారని ఎక్స్ వేదికగా కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ చేతగాని పాలన, అవినీతి, అక్రమాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి బుద్ధిచెప్తారని స్పష్టంచేశారు.

రెచ్చగొట్టే ప్రయత్నాలు చెయ్యొద్దు : పోలీస్‌శాఖ సూచన

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): జైనూర్‌లో ప్రశాంత వాతావరణం నెలకొన్నదని, స్థానికుల్లో మనోధైర్యం కలిగించేందుకు చర్యలు చేపట్టామని తెలంగాణ పోలీస్ శాఖ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఇరువర్గాలకు అవగాహన కలిగించి సాధారణ పరిస్థితి నెలకొనేలా కృషి చేస్తున్నట్టు తెలిపింది.అత్యంత సున్నితమైన ఈ అంశంపై వివిధ సామాజికవర్గాలను రెచ్చగొట్టేవిధంగా ఎలాంటి సామాజిక, రాజకీయ ప్రకటనలు చేయొద్దని కోరింది. ఎవరైనా ప్రేరేపించే, ఉసిగొలిపే ప్రకటనలు చేస్తే వారిపై చట్టరీత్యా కఠినమైన చర్యలు తీసుకుంటామని, రెచ్చగొట్టే వార్తలు, అసత్య ప్రచారాలు వ్యాప్తి చేస్తే సంబంధిత వ్యక్తులు, సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.ఈ విషయంలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు శాంతిభద్రతలు కాపాడేలా సహకరించాలని కోరింది.

ఘటనపై వివరాలివ్వండి : జాతీయ ఎస్టీ కమిషన్

జైనూర్‌లో ఆదివాసీ మహిళపై దాడికి సంబంధించిన వివరాలు అందించాలని, నిష్పక్షపాతంగా విచారణ జరిపి పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని డీజీపీ జితేందర్‌ను జాతీయ ఎస్టీ కమిషన్ గురువారం ఆదేశించింది. ఘటన గురించి తెలుసుకున్న కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ గాంధీ దవాఖానకు వెళ్లి బాధిత మహిళను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. బాధితురాలికి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. బాధితురాలిని తెలంగాణ మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద సైతం పరామర్శించారు.

లోకం పోకడ



హైడ్రాపేరుతో మీరు సంపాయించిన ఈ డబ్బుల్తో బఫర్‌జోన్, ఎఫ్.టీ.ఎల్ పరిధిలోలేని ప్లేసులో ఓ బంగళా కట్టుకుందామండీ!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	33.2°c	24.6°c
కరీంనగర్	31.0°c	26.0°c
ఖమ్మం	31.0°c	24.0°c
రంగారెడ్డి	30.9°c	21.8°c
నల్లగొండ	30.0°c	22.4°c
హైదరాబాద్	30.8°c	22.7°c
మహబూబ్‌నగర్	29.1°c	21.4°c
వరంగల్	29.0°c	25.0°c
నిజామాబాద్	29.0°c	23.4°c
మెదక్	22 .2°c	30.3°c

మరో ఐదు రోజులు భారీ వర్షాలు

వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం

రాష్ట్రానికి ఎల్లో హెచ్చరికలు జారీ

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో గురువారం నుంచి ఈ నెల 9 వరకు భారీ వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. గురువారం వాయవ్య బంగాళాఖాతం, ఉత్తరాంధ్ర- దక్షిణ ఒడిశా తీర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడిందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొన్నది. ఏపీలో రాగల 24 గంటల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు.

గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం వివరాలు

జిల్లా	మండలం	వర్షపాతం(సెం.మీ)
భద్రాద్రి కొత్తగూడెం	పినపాక	11.16
ములుగు	వెంకటాపురం	10.62
భద్రాద్రి కొత్తగూడెం	అశ్వపురం	9.07
భద్రాద్రి కొత్తగూడెం	మణుగూరు	9.04
భద్రాద్రి కొత్తగూడెం	చెర్ల	8.94
ములుగు	మంగపేట	8.34
ఖమ్మం	ఎర్రుపాలెం	7.28
భద్రాద్రి కొత్తగూడెం	గుండాల	6.50
భద్రాద్రి కొత్తగూడెం	అల్లపల్లి	6.29
కుమురంభీం ఆసిఫాబాద్	పెంచికల్‌పేట	5.93

హైదరాబాద్‌లో ఖరీదైపోతున్న రియల్టీ

పెరిగిన వడ్డీ రేట్లు.. తగ్గిన కొనుగోలు స్థోమత

మ్యాజిక్‌బ్రిక్స్ అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): దేశంలో రియల్టీ రంగం దూసుకుపోతుంటే.. ప్రజల్లో కొత్త ఇల్లు కొనుగోలు చేసే స్థోమత తగ్గిపోతున్నదని మ్యాజిక్‌బ్రిక్స్ చేసిన అధ్యయనంలో వెల్లడైంది. ఆదాయం, ఖర్చుల మధ్య అంతరాల కారణంగా ఈఎంఐలూ భారంగా మారుతున్నాయని పేర్కొన్నది. ఈఎంఐల భారం గత ఏడాదితో పోలిస్తే 7.5 శాతం పెరిగినట్టు తెలిపింది. మ్యాజిక్‌బ్రిక్స్ దేశంలోని పది మెట్రో నగరాల్లో కొనుగోలు స్థోమతను అంచనా వేసింది. కొనుగోలు స్థోమత అత్యధికంగా ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (14.3%), ఢిల్లీ (10.1%)లో ఉన్నట్టు పేర్కొన్నది. 2021-2022 నాటికి దేశంలో రెసిడెన్షియల్ రంగంలో పెట్టుబడులు భారీగా ఉండేవని మ్యాజిక్ బ్రిక్స్ సీఈవో సుధీర్ పాయ్ తెలిపారు. పెరిగిన వడ్డీ రేట్లు, ఖర్చు భారంతో రెసిడెన్షియల్ ప్రాజెక్టులు సామాన్యుడికి దూరమైతున్నాయని వివరించారు.

హైడ్రా ఫిర్యాదుపై కేసులో ఎమ్మార్వోకు ఊరట

హైకోర్టు ముందస్తు బెయిలు మంజూరు

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): చెరువుల ఆక్రమణలకు సహకారం అందించారని ఆరోపిస్తూ హైడ్రా కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసులో బాచుపల్లి ఎమ్మార్వో పూల్‌సింగ్‌కు హైకోర్టులో ఊరట లభించింది.ఆయనకు గురువారం ముందస్తు బెయిలు మంజూరు చేసింది. నిజాంపేట మున్సిపాలిటీ, ప్రగతినగర్‌లో మూడు ఎకరాల్లోని ఎర్రకుంట ఆక్రమణలకు సహకరించారనే కేసులో పిటిషనర్ రెండో నిందితుడిగా ఉన్నారు. నిజాంపేట మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు, బాచుపల్లి ఎమ్మార్వో పూల్‌సింగ్, సర్వే శాఖ సహాయ డైరెక్టర్ కే శ్రీనివాసులు, సహాయ ప్లానింగ్ అధికారి సుధీర్‌కుమార్‌పై ఆగస్టు 30న కేసు నమోదైంది. పూల్‌సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి జస్టిస్ కే సుజన ముందస్తు బెయిల్ మంజూరు చేశారు. పూల్‌సింగ్ 2023 ఆగస్టులో ఎమ్మార్వోగా బాధ్యతలు చేపట్టారని, అప్పటికే అనుమతులు జారీ అయ్యాయని పిటిషనర్ తరపు న్యాయవాది చెప్పారు.

స్థానికతను తేల్చండి

మొదటిపేజీ తరువాయి...

అడ్మిషన్ల నిబంధనలు- 2017కు సవరణగా 3(ఎ) నిబంధన చేర్చుతూ ప్రభుత్వం ఈ ఏడాది జూలై 9న జారీచేసిన జీవో 33ను రద్దు చేయాలంటూ దాఖలైన సుమారు 53 వ్యాజ్యాలపై హైకోర్టు విచారణ జరిపింది. సుదీర్ఘ వాదనల తర్వాత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం 71 పేజీల తీర్పును వెలువరించింది.

జీవో 33 రద్దుకు నిరాకరణ

మెడికల్ అడ్మిషన్ల నిబంధనలను సవరించి నిబంధన 3(ఎ)ను చేరుస్తూ జారీచేసిన జీవో 33ను రద్దు చేస్తే తెలంగాణవాసులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉంటుందని, దేశవ్యాప్తంగా ఉన్నవారందరూ 85 శాతం స్థానిక కోటా కింద అడ్మిషన్లు పొందేందుకు వీలు ఏర్పడుతుందని ధర్మాసనం పేర్కొన్నది. కాబట్టి సవరణ నిబంధనను రద్దు చేయడం లేదని పేర్కొంది. ఈ నిబంధన కింద తెలంగాణలో శాశ్వత నివాసం ఉన్నవారు స్థానిక కోటా కింద మెడికల్ అడ్మిషన్లు పొందడానికి అర్హులేనని తేల్చింది. విద్యార్థి స్థానికత నిర్ధారణకు సంబంధించిన మార్గదర్శకాలు లేనందున వాటిని రూపొందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించాక వాటిని పరిశీలించి ప్రతి విద్యార్థిని స్థానిక కోటా కింద అన్వయించి కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయం సీట్లను కేటాయించాలని ఉత్తర్వులు జారీచేసింది. నిబంధన ప్రకారం నాలుగేండ్లు వరుసగా తెలంగాణలో చదివి ఉండాలని, శాశ్వత నివాసం ఉండాలని పేర్కొన్నది. అర్హత పరీక్షలో తెలంగాణ నుంచి ఉత్తీర్ణత సాధించి ఉండాలని చెప్పింది. తెలంగాణలో శాశ్వత నివాసం ఉన్నవారికి మెడికల్, డెంటల్ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పించడమే ప్రభుత్వం తీసుకువచ్చిన సవరణ నిబంధన 3(ఎ) లక్ష్యమని తెలిపింది. తెలంగాణకు చెందిన వ్యక్తి అర్హత పరీక్షలో ఇక్కడ ఉత్తీర్ణత సాధించలేదన్న కారణంగా అడ్మిషన్ నిరాకరిస్తే ఆ నిబంధన ఉద్దేశం నెరవేరనట్లేనని స్పష్టం చేసింది. ప్రభుత్వ తీసుకువచ్చిన ఈ నిబంధన తెలంగాణలో శాశ్వత నివాసం ఉన్న వారికి వర్తించదని పేర్కొంది.

తెలంగాణ విద్యార్థి వేరే రాష్ట్రం నుంచి అర్హత పరీక్ష రాయవచ్చు

ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల్లో తెలంగాణలో నివాసం లేదా శాశ్వత నివాసితులైన వారు 85 శాతం స్థానిక కోటా కింద అర్హులేనని హైకోర్టు పేర్కొంది. తెలంగాణ విద్యార్థి ఇతర రాష్ట్రం నుంచి అర్హత పరీక్ష రాశారని స్థానికత నిరాకరించడం సరి కాదని హైకోర్టు తీర్పులో పేర్కొన్నది.

ఐఎంజీబీ భూములపై తీర్పు వాయిదా

క్రీడల అభివృద్ధి పేరుతో ఐఎంజీ భారత్ అకాడమీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఉమ్మడి ఏపీలో 2003లో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు భూములు, పలు స్టేడియాలను ఇవ్వడం మీద దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో గురువారం వాదనలు ముగిశాయి. భూకేటాయింపుల వ్యవహారంపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలంటూ జర్నలిస్ట్ ఏబీకే ప్రసాద్, ఎంపీ విజయసాయిరెడ్డి, న్యాయవాది శ్రీరంగారావు వేర్వేరుగా వ్యాజ్యాలు దాఖలు చేశారు.ఈ కేసులో తీర్పును వాయిదా వేస్తున్నట్టు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం గురువారం ప్రకటించింది.

ఇంజినీరింగ్ కాలేజీలకు చుక్కెదురు

మధ్యంతర ఉత్తర్వులకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్ కాలేజీల్లో కొత్త కోర్సులకు అనుమతివ్వాలని దాఖలైన పిటిషన్లపై మధ్యంతర ఉత్తర్వుల జారీకి హైకోర్టు నిరాకరించింది. జేఎన్‌టీయూ, ఏఐసీటీఈలు అనుమతించిన సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించేందుకు వీలుగా మధ్యంతర ఉత్తర్వుల జారీకి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి నిరాకరించారు. మర్రి ఎడ్యుకేషనల్ సొసైటీ, ఎంజీఆర్, విద్యాజ్యోతి ఎడ్యుకేషనల్ సొసైటీ, మల్లారెడ్డి కాలేజీ, అనురాగ్ ఇంజినీరింగ్ కాలేజీ, సీఎంఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ తదితర కాలేజీలు వేర్వేరుగా దాఖలు 11 వ్యాజ్యాల తరపున సీనియర్ న్యాయవాదులు డీ ప్రకాశ్‌రెడ్డి, ఎస్ నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ, 2024- 25 విద్యాసంవత్సరం ఆగస్టు 19 నుంచే మొదలైందని, మధ్యంతర ఉత్తర్వులు ఇస్తే కౌన్సెలింగ్ ప్రక్రియపై ప్రభావం పడుతుందని చెప్పారు. ఈ వాదనలను ఆమోదించిన న్యాయమూర్తి కాలేజీల పిటిషన్లను కొట్టివేశారు.

సివిల్ సప్లయిస్ స్కాంపై నేడు హైకోర్టు విచారణ

తెలంగాణ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో అక్రమాలు జరిగాయని హైకోర్టులో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే, ఆ సంస్థ మాజీ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి దాఖలుచేసిన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు శుక్రవారం విచారణ జరుపనుంది. ప్రభుత్వ ఖజానాకు రూ.1100 కోట్ల నష్టం కలిగించేలా అక్రమాలు జరిగాయని పిటిషనర్ ఆరోపించారు. బిడ్డర్లకు తక్కువ ధరకు వడ్లను విక్రయించి అత్యధిక ధరకు బియ్యం కొనుగోలు చేయడం ద్వారా పెద్ద మొత్తంలో అవినీతి జరిగిందని పేర్కొన్నారు.



కాగజ్‌ఘట్‌లోని రిసార్ట్‌లోని వెళ్లడానికి అసైన్డ్‌భూమిలో నుంచి వేసిన ప్రధాన రహదారి

అలీ చెరువు ఆగమాగం!

- నీటి వనరుకు రియల్ చెర
- ఎఫ్‌టీఎల్, బఫర్‌లోనూ యథేచ్ఛగా విల్లాల నిర్మాణం
- ఇష్టానుసారంగా క్లబ్ హౌజ్‌లు, సిమ్మింగ్‌పూల్ ఏర్పాటు

ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, హైదరాబాద్ సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): అదో రిసార్ట్.. క్లబ్‌హౌజ్‌లు.. స్విమ్మింగ్ పూల్.. ఖరీదైన విల్లాలు.. ఈ నిర్మాణాలన్నీ ఉన్నవి ఒక చెరువులో. ఆ దృశ్యాలను చూడాలంటే హైదరాబాద్ శివారులోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండలంలోని కాగజ్‌ఘట్‌కు వెళ్లాల్సిందే. లేక్‌వ్యూను తలదన్నే రీతిలో ఓ రియల్ సంస్థ యథేచ్ఛగా ఒక నీటి వనరుకు నిలువునా ఉరివేసింది. అంతేకాదు ఎగువ నుంచి వచ్చే వరద మార్గాన్ని మూసేసి మరో రెండు చెరువులకు మరణ శాసనాన్ని లిఖించింది. ఇంత జరుగుతున్నా నీటిపారుదల శాఖ అధికారులు ఏం చేస్తున్నారు అనుకుంటున్నారా? వారికి నోటీసులు ఇచ్చి చెరువు దీనస్థితిపై హైడ్రాకు లేఖ రాశారు. ఓఆర్‌ఆర్ పరిధి వరకు మాత్రమే ఉండే హైడ్రాకు లేఖ రాయడమంటేనే అందులో మతలబు ఉన్నదని అర్థం అవుతుంది. నీటిపారుదల శాఖ చర్యలు తీసుకోదు. హైడ్రా పరిధిదాటి రాదు. అంతే సంగతులు!!

అధికార యంత్రాంగం ఈ స్థాయిలో ఎందుకు వత్తాసు పలుకుతున్నదంటే.. కొంతకాలం కిందట బీహార్ అసెంబ్లీలో నితీశ్‌కుమార్ బలపరీక్ష సందర్భంగా ఆ రాష్ట్ర కాంగ్రెస్ ఎమ్మెల్యేల క్యాంపు రాజకీయం ఈ రిసార్ట్‌లోనే కొలువుదీరింది. సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి క్యాంపును పరిశీలించేందుకు వచ్చినపుడు అధికారులు సర్కారు సొమ్ముతో అక్కడికి బీటీ రోడ్డును నిర్మించారు.

రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆగపల్లి రెవెన్యూ పరిధిలోని కాగజ్‌ఘట్ గ్రామంలో 25 ఎకరాల విస్తీర్ణంలో అలీ (ఆల్ల చెరువు) చెరువు విస్తరించి ఉన్నది. కాగజ్‌ఘట్ గ్రామం ఎగువభాగంలోని జాపాల అటవీప్రాంతంతో పాటు గున్‌గల్, గడ్డమల్లాయిగూడ గుట్టల ప్రాంతం నుండి వచ్చే వరద నీటిని నిల్వ చేసేందుకు నిజాం నాటి కాలంలో ఈ చెరువును నిర్మించారు. ఈ చెరువు అలుగుపారి దిగువన ఉన్న నోముల గ్రామపరిధిలోని ఊశమ్మ చెరువు, రెడ్డి చెరువు, ఊర చెరువులకు వరద నీరు అందిస్తుంది. అంటే అలీచెరువు పారితేనే దిగువన ఉన్న మూడు చెరువులకు జీవం వస్తుంది. కానీ ఓ రియల్ సంస్థ ఈ చెరువు గొంతునులిమింది. ఏకంగా ఎఫ్‌టీఎల్‌తో పాటు బఫర్‌జోన్‌లో యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టింది. చెరువు పైభాగంలో వెంచర్ ఏర్పాటు చేసి, రోడ్లు వేసి అందులో విల్లాల నిర్మాణం చేపట్టింది. అలాగే చెరువులోకి నీరు వచ్చే ప్రధాన కాలువలోని కొంత భాగంలో సిమ్మింగ్‌పూల్ ఇతర ఆట వస్తువులతో పాటు పెద్దపెద్ద గెస్ట్‌హౌస్‌లను నిర్మించింది. ఇందులో భాగంగా భారీఎత్తున మట్టి తెచ్చి చెరువు ఎఫ్‌టీఎల్‌ను పూడ్చారు. దీంతో ప్రస్తుతం అలీ చెరువు సగం కంటే ఎక్కువగానే కనుమరుగైంది.

నోటీసులు ఇస్తే కోర్టుకు వెళ్లరా?

హైదరాబాద్‌లో హైడ్రా కూల్చివేతల దరిమిలా నోటీసులు ఇస్తే కోర్టుకు వెళతారనే ఉద్దేశంతో అసలు నోటీసులు ఇవ్వకుండానే బుల్డోజర్లతో నిర్మాణాలను నేలమట్టం చేస్తున్నారు. కానీ అలీ చెరువు విషయంలో మాత్రం కండ్ల ముందు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ స్పష్టంగా కనిపిస్తున్నా నీటిపారుదల శాఖ అధికారులు ఎంచక్కా నోటీసులు ఇచ్చారు. ఇంకేముంది.. సదరు సంస్థ అసలు ఎఫ్‌టీఎల్ నిర్ధారణనే తప్పు అంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించిందని అధికారులే చెప్తున్నారు. అయితే సర్వే చేసి, హద్దులు నిర్ధారించి చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో అధికారులు సర్వే చేసి, అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి. కానీ ఇక్కడ బుల్డోజర్ న్యాయం ఎందుకు ముందుకు సాగటం లేదు. ఇదే విషయంపై 'నమస్తే తెలంగాణ' నీటిపారుదలశాఖ డీఈఈ సురేఖను సంప్రదించగా.. అలీ చెరువు ఆక్రమణలపై ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చామని తెలిపారు. సదరు ఉన్నతాధికారులు హైడ్రాకు కూడా లేఖ రాశారని చెప్పారు. కానీ మంచాల మండలం ఔటర్ రింగ్ రోడ్డు అవతల ఉంటుంది. అంటే హైడ్రా పరిధిలోకి రాదు. అయినా ఇక్కడి అధికారులు ఇతర చోట్ల రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారుల్లా అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించకోవడం అనుమానాలకు బలాన్ని చేకూరుస్తున్నది.

అసైన్డ్ భూమి నుంచి రహదారి

చెరువులో నిర్మాణాలు చేపట్టిన రిసార్ట్ సంస్థ ఏకంగా అసైన్డ్ భూమి నుంచి రహదారి నిర్మాణాన్ని చేపట్టింది. కాగజ్‌ఘట్ గ్రామంలోని సర్వే నంబర్ 22 నుండి రోడ్డు వేయగా, తన తండ్రికి ప్రభుత్వం ఇచ్చిన భూమిలోంచి ఈ రోడ్డు వేశారని, తనకు సంబంధం లేకుండా తన బంధువులతో కాగితం రాయించుకొని ఈ భూమిని కాజేశారని గ్రామానికి చెందిన వాజీద్ అనే వ్యక్తి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేసినా అధికారులు పట్టించుకోకపోవటం కొసమెరుపు.



33% పంట దెబ్బతింటేనే నష్ట పరిహారం

మొదటిపేజీ తరువాయి...

భూములను సందర్శించాలి. ప్రాధాన్యంగా మొదటి 5 ప్రభావిత మండలాల్లో పర్యటించాలి. మండలాలవారీగా నష్టం జాబితాలు సిద్ధం చేసి వ్యవసాయాధికారులు, కలెక్టర్ల సంతకంతో జాబితా తయారుచేయాలి.జాబితాలను గ్రామ పంచాయితీ భవనంలో రైతుల కోసం ప్రదర్శించాలి. కలెక్టర్ ఆమోదంతో అర్హులైన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ప్రతిపాదనలను పంపించాలి. ఈ నెల 12 నాటికి జాబితాను హైదరాబాద్ వ్యవసాయ కమిషనరేట్ కార్యాలయానికి పంపించాలి.

పంటల బీమాపై సర్కారు ధోకా!

వానకాలం నుంచి అమలు చేస్తామన్న ప్రభుత్వం • ఇప్పటివరకు టెండర్లు కూడా పిలవని వైనం

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): 'అధికారంలోకి రాగానే పంటల బీమా అమలు చేస్తాం' అని ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేతలు ఊదరగొట్టారు. ప్రభుత్వ ఏర్పాటు తర్వాత 'ఈ వానకాలం నుంచే రైతులకు ఉచిత పంటల బీమా అమలు చేయబోతున్నాం' అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. కానీ మంత్రి మాటలు నీటిమీద రాతలుగానే మిగిలిపోయాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు సీజన్లు పూర్తవుతున్నా బీమా అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫసల్ పంటల బీమా అమలుపై ప్రభుత్వం నాలుగు నెలల నుంచి చర్చిస్తూనే ఉన్నది. అధికారులు విధి విధానాలు సిద్ధం చేసి సీఎం రేవంత్‌రెడ్డికి ఫైలు పంపించినట్టుగా తెలిసింది. నెల రోజులుగా ఆ ఫైలు సీఎం వద్దే పెండింగ్‌లో ఉందని తెలిసింది. వారం క్రితం సీఎం ఫైలుపై సంతకం చేయగా వ్యవసాయ అధికారులు, మంత్రి అందుబాటులో లేకపోవడంతో ఆ ప్రక్రియ అక్కడే నిలిచిపోయింది. ఇప్పుడేమో సీజన్ ముగింది కాబట్టి వచ్చే సీజన్ నుంచి అమలుకు ప్రయత్నిస్తామని ఓ వ్యవసాయ అధికారి తెలిపారు.

ఫసల్ బీమా లేదు... పరిహారం రాదు

భారీ వర్షాలతో సుమారు 10-15 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టుగా వ్యవసాయ శాఖ అంచనా వేస్తున్నది. ఫసల్ బీమా ఉంటే రైతులకు ఆర్థిక భరోసా దక్కేదని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. కానీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రైతులే నష్టాలను భరించాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శిస్తున్నారు.

యాసంగి పరిహారమేది?

ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో అకాల వర్షాలతో పంటలు భారీగా దెబ్బతిన్నాయి. మార్చిలో కురిసిన వర్షాలతో 15,814 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు ప్రభుత్వం గుర్తించి ఎకరాకు రూ. 10వేల చొప్పున పరిహారం చెల్లించింది. ఏప్రిల్‌లోనూ సుమారు 3120 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఈ రైతులకూ ఎకరాకు రూ. 10వేల పరిహారం ప్రకటించి ఇప్పటికీ చెల్లించలేదు. ఏప్రిల్ పరిహారం ఎగ్గొట్టి.. ప్రస్తుత పంటనష్టానికి పరిహారం చెల్లిస్తుందా? లేదా? అనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.

06092024-MAI-04_Layout 1 9/6/2024 3:06 AM Page 1

‘వేదిక’ పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

కాంగ్రెస్ ఫిరాయింపులు

పార్టీలు మారే ఎమ్మెల్యేలకు పింఛన్ రద్దు చేస్తూ హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రెస్ సర్కార్ అసాధారణమైన చట్టం తెచ్చింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద సభ్యత్వం కోల్పోయినవారికే ఇది వర్తిస్తుంది. అయితే ఏదో సదాశయంతో తెచ్చిన చట్టం కాదిది. కేవలం పార్టీని కాపాడుకునేందుకు దీన్ని తెచ్చారని చెప్పవచ్చు. గత ఫిబ్రవరిలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో పార్టీ విప్‌ను ధిక్కరించినందుకు ఆరుగురు ఎమ్మెల్యేలు సభ్యత్వం కోల్పోయారు. అదే నెలలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఈ ఆరుగురు ఎమ్మెల్యేలు బీజేపీ అభ్యర్థికి ఓటు వేశారు. దీంతో ఫిరాయింపుల భయం పట్టుకున్న కాంగ్రెస్ సర్కార్ పైన తెలిపిన చట్టాన్ని ప్రవేశపెట్టింది. పింఛన్ పోతుందన్న భయంతోనైనా ఫిరాయింపులు ఆగుతాయనేది వారి ఆశ కావచ్చు. అయితే, పార్టీలు మారడంపై కాంగ్రెస్‌లో ఏకరూప విధానమేదీ లేదు. ఫిరాయింపుల చట్టానికి మరింత పదును పెడతామని ‘కాంగ్రెస్ పాంచ్ న్యాయ్’ పేరిట విడుదల చేసిన మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చింది. పార్టీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ గోవాలో తమ శాసనసభ్యులతో పార్టీ మారబోమని ప్రమాణం చేయించి టాంటాం వేసుకున్నారు.

తెలంగాణలో ఆ పార్టీ అనుసరిస్తున్న విధానం మరోలా ఉన్నది. ‘విపక్ష శాసనసభ్యుల కొనుగోలు’కు వారి ఇండ్ల చుట్టూ కాంగ్రెస్ పెద్దలు చక్కర్లు కొట్టడం తెలిసిందే. కొందరిని చేర్చుకున్నారు కూడా. అయితే, వ్యవహారం స్పీకర్ ముందుకు, ఆ తర్వాత కోర్టుకు వెళ్లింది. అక్కడ ఏం నిర్ణయం జరుగుతుందనేది వేరే విషయం. కానీ, కాంగ్రెస్ పార్టీ నైతికత ఏమిటో ప్రజలకు బట్టబయలై పోయింది. ఫిరాయింపుదార్లను రాళ్లతో కొట్టి చంపాలన్న సీఎం రేవంత్‌రెడ్డి అరకొరగా ఉన్న బలాన్ని పెంచుకునేందుకు ఆ ఫిరాయింపులనే ఆశ్రయించడం కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలకు చక్కని ఉదాహరణగా నిలుస్తుంది. కర్ణాటకలో బీజేపీ తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు కోట్ల రూపాయలు ఆశ చూపుతున్నదని సీఎం సిద్ధరామయ్య గగ్గోలు పెడుతున్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ ఫిరాయింపు ఎత్తుగడలను ప్రతిఘటిస్తున్నట్టుగా ఫోజు పెట్టే కాంగ్రెస్ తెలంగాణ విషయానికి వచ్చేసరికి పూర్తి భిన్నమైన వైఖరిని అవలంబిస్తున్నది.

అడ్డగోలుగా ఫిరాయింపులు ప్రోత్సహించి ఆయారామ్ గయారామ్ సంస్కృతిని పెంచి పోషించిన కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఫిరాయింపుల నిరోధక చట్టం రావడం, నీరుగారిపోవడం చారిత్రిక వైచిత్రి. *1957-67* మధ్యకాలంలో ఫిరాయింపుల వల్ల అత్యధికంగా లబ్ధి పొందింది కాంగ్రెస్సే. ఆ కాలవ్యవధిలో *98* మంది కాంగ్రెస్‌ను వీడితే, *419* మంది వచ్చిచేరడం గమనార్హం. *1967*లో బీహార్‌లో గయాలాల్ అనే శాసనసభ్యుడు ఒకేరోజు మూడు పార్టీలు మారడం ఫిరాయింపుల సంస్కృతికి పరాకాష్ఠగా చెప్తారు. *1967, 1971* సార్వత్రిక ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర చట్టసభలకు ఎన్నికైన ప్రతినిధుల్లో *50* శాతం మంది పార్టీ మారారు. తదనంతర కాలంలో ఫిరాయింపులపై కాంగ్రెస్ వైఖరి మారింది. *1984*లో ఇందిర మరణానంతరం ప్రధాని పదవి చేపట్టిన రాజీవ్‌గాంధీ ఆ ఏడాది చివరలో జరిగిన ఎన్నికల్లో *400* పైచిలుకు స్థానాలు సంపాదించి రికార్డు నెలకొల్పారు. అయితే ఆ విజయం ఫిరాయింపుల వల్ల ఎక్కడ వీగిపోతుందోననే భయం వల్లనో లేక ఫిరాయింపుల మీద ప్రజల్లో వ్యక్తమవుతున్న ఏవగింపు వల్లనో గానీ ఆయన *1985*లో ఫిరాయింపుల నిరోధక చట్టం తెచ్చారు. కానీ అది ఎన్నడూ చిత్తశుద్ధితో అమలుకు నోచుకోలేదు. ఇప్పుడు అదే కాంగ్రెస్ తన సొంత అవసరాల కోసం చట్టానికి తూట్లు పొడుస్తుండటం పార్టీ రెండు నాల్కల ధోరణిని ఎత్తిచూపుతున్నది. పైగా, రాష్ట్రానికో విధానం అనుసరిస్తూ అవకాశవాద రాజకీయాలు చేయడం మరీ విడ్డూరం.

ఓపీఎస్ పునరుద్ధరించాల్సిందే!

గత కొన్నేండ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికవర్గాలు ఎన్పీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. అటు కేంద్ర, ఇటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈ ఉద్యమాన్ని ఉధృతం చేసిన నేపథ్యంలో దేశంలోని పలు రాష్ట్రాల్లో కొన్ని రాజకీయ పార్టీలు దీన్ని ఒక అవకాశంగా వాడుకున్నాయి. ఆయా పార్టీలు ‘ఎన్పీఎస్‌ను రద్దు చేస్తాం’ అని ఎన్నికల మ్యానిఫెస్టోల్లో ప్రకటించి అధికారంలోకి కూడా వచ్చాయి. అయితే, కేంద్ర ప్రభుత్వం కూడా ఎన్పీఎస్‌పై కేంద్ర ఆర్థిక కార్యదర్శి టీవీ సోమనాథన్ నేతృత్వంలో ఓ కమిటీ వేసి, దాని సిఫారసుల మేరకు ఎన్పీఎస్ స్థానంలో యూపీఎస్ (యూనిఫైడ్ పెన్షన్ సిస్టం)ను అమలుచేయాలనే నిర్ణయం తీసుకున్నది.





జుర్రు నారాయణ యాదవ్
94940 19270

ఎన్పీఎస్ స్థానంలో కేంద్రప్రభుత్వం తీసుకురానున్న యూపీఎస్ 2025, ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నది. 25 ఏండ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న ఉద్యోగులకు వేతనంలో 50 శాతం పింఛన్ గ్యారెంటీగా చెల్లించనున్నది. మిగిలినవారికి వారి సర్వీస్‌ను బట్టి దామాషా పద్ధతిలో పింఛన్ చెల్లించనున్నది. కనీస పింఛన్ రావాలంటే పదేండ్ల సర్వీస్ పూర్తిచేసి ఉండాలి. ఇది రూ.10 వేలు ఉండనున్నది. ఉద్యోగి మరణిస్తే ఫ్యామిలీ పింఛన్ వర్తిస్తుంది. పింఛన్‌దారుడు మరణిస్తే భాగస్వామికి 60 శాతం పింఛన్ లభిస్తుంది. ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పింఛన్‌లో మార్పులుంటాయి. నెల వేతనం మొత్తంలో 10వ వంతున లెక్క గట్టి, ఆరు నెలల సర్వీస్ మొత్తాన్ని ఒక యూనిట్‌గా భావిస్తూ, సర్వీస్ మొత్తం పరిగణనలోకి తీసుకొని పదవీ విరమణ చేసిన రోజున గ్రాట్యుటీకి అదనంగా ఏకమొత్తంగా సొమ్మును ఉద్యోగులకు చెల్లిస్తారు. ప్రస్తుత ఉద్యోగుల చందా 10 శాతం కొనసాగిస్తూనే, ప్రభుత్వ వాటా 14.5 శాతం నుంచి 18 శాతానికి పెరుగనున్నది. ఇప్పటికే పదవీ విరమణ చేసిన వారికి కూడా ఈ యూపీఎస్ వర్తిస్తుంది. ఉద్యోగులు యూపీఎస్ కావాలో, ఎన్పీఎస్ కావాలో ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఈ యూపీఎస్ విధానం 23 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరిస్తే మొత్తం 90 లక్షల ఉద్యోగులకు వర్తించనున్నది.

ఎన్పీఎస్‌లో గ్రాట్యుటీ లేదు. యూపీఎస్‌లో గ్రాట్యుటీతో పాటు ఏకమొత్తం అమౌంట్ పొందవచ్చు. ఎన్పీఎస్‌కి ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు అర్హులు. యూపీఎస్‌కు ప్రభుత్వ ఉద్యోగులే అర్హులు. ఓపీఎస్‌లో ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పింఛన్ పెరుగుతుంది. యూపీఎస్‌లో కూడా ఆ అవకాశం ఉన్నది. ఎన్పీఎస్‌లో ఆ అవకాశం లేదు. ఓపీఎస్‌లో పీఆర్సీని పరిగణనలోకి తీసుకొని పింఛన్‌లో మార్పులుంటాయి. యూపీఎస్, ఎన్పీఎస్‌లో ఆ అవకాశం లేదు. ఓపీఎస్‌లో అదనపు పింఛన్‌కు అవకాశం ఉన్నది. యూపీఎస్‌లో ఈ విషయంపై స్పష్టత లేదు. ఓపీఎస్‌లో పింఛన్‌దారుని మరణానంతరం భాగస్వామికి పింఛన్ ఉన్నది. యూపీఎస్‌లో పింఛన్‌దారుని మరణానంతరం జీవిత భాగస్వామికి 60 శాతం పింఛన్‌కు అవకాశం ఉన్నది. ఎన్పీఎస్‌లో ఆ అవకాశం లేదు. ఓపీఎస్‌లో హెల్త్ కార్డులున్నాయి. యూపీఎస్‌లో స్పష్టత లేదు. ఓపీఎస్‌లో (జీ)పీఎఫ్ 100 శాతం తిరిగి పొందవచ్చు. యూపీఎస్‌లో స్పష్టత రావాలి. కారుణ్య నియామకాలకు, కుటుంబ పింఛన్‌కు అన్నిట్లో అవకాశం ఉన్నది.

మొత్తంగా యూపీఏస్ వల్ల ఉద్యోగులకు తీరని నష్టం వాటిల్లనున్నది. ఓపీఎస్‌కు షేర్ మార్కెట్‌తో సంబంధం లేదు. ఎన్పీఎస్ వలె యూపీఎస్‌లో కూడా ఉద్యోగి, ప్రభుత్వాల వాటా సొమ్మును ప్రభుత్వమే షేర్‌మార్కెట్లో పెట్టి బడా పారిశ్రామిక వేతల ప్రయోజనాల కోసం కాంట్రిబ్యూషన్ విధానం కొనసాగించనున్నది. పింఛన్ లెక్కింపులో చివరి బేసిక్ పేలో 50 శాతం కాకుండా 12 నెలల సగటు వేతనం పరిగణనలోకి తీసుకోవడం వల్ల ఆ మేరకు ఉద్యోగులు పింఛన్ నష్టపోతారు. యూపీఎస్‌లో పీఆర్సీని పరిగణనలోకి తీసుకోకపోవడం వల్ల ఉద్యోగులకు నష్టం వాటిల్లుతుంది. 25 ఏండ్లు పూర్తిచేస్తేనే పూర్తి పింఛన్ వర్తించడం ఈ విధానంలో ప్రధాన సమస్య. ఈ నిబంధన వల్ల పింఛన్ నుంచి కొన్ని వర్గాలను దూరం చేయడమే అవుతుంది. హెల్త్ కార్డులు, అదనపు పింఛన్‌పై స్పష్టత లేకపోవడం, ఉద్యోగి కాంట్రిబ్యూషన్ తిరిగి తీసుకోవడంపై స్పష్టత లేకపోవడం వల్ల ఉద్యోగులకు నష్టం జరగవచ్చు.

> **ఉద్యోగి నుంచి కాంట్రిబ్యూషన్ 10 శాతం కొనసాగించడం ఈ విధానంలో ప్రధాన లోపంగా కనపడుతున్నది. ఉద్యోగులు కోరుకున్నది కాంట్రిబ్యూషన్ లేని పాత పింఛన్. కానీ, కేంద్ర ప్రభుత్వం యూపీఎస్‌లో కూడా కాంట్రిబ్యూషన్ విధానం కొనసాగించడమంటే పింఛన్ బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నమే అవుతుంది. పీఆర్సీ సమయంలో యూపీఎస్‌ను పరిగణనలోకి తీసుకోకపోవడం అంటే భవిష్యత్తులో ఉద్యోగికి పింఛన్ నిరాకరించడమే అవుతుంది.**

సీనియర్ సిటిజన్‌కు అదనపు పింఛన్ ప్రస్తావన లేదంటే వారి సేవలు విస్మరించడమే అవుతుంది. మొత్తంగా రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వపు హక్కును నిరాకరించడమే. అంతేకాదు ఓపీఎస్‌తో పోల్చుకుంటే ఎన్పీఎస్, యూపీఎస్‌లలో అనేక లొసుగులున్నాయి. ఎన్పీఎస్ అని, జీపీఎస్ అని, యూపీఎస్ అని రోజుకో పింఛన్ సిస్టం తీసుకురాకుండా ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికవర్గాలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు తీసుకుంటాయని ఆశిద్దాం.

(వ్యాసకర్త: రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ టీచర్స్ యూనియన్)

> **ఓపీఎస్‌తో పోల్చుకుంటే ఎన్పీఎస్, యూపీఎస్‌లలో అనేక లొసుగులున్నాయి. ఎన్పీఎస్ అని, జీపీఎస్ అని, యూపీఎస్ అని రోజుకో పింఛన్ సిస్టం తీసుకురాకుండా ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికవర్గాలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు తీసుకుంటాయని ఆశిద్దాం.**



‘హైడ్రా’తో లక్ష్యం నెరవేరేనా?

> **రెండు నెలలు తిరగకుండానే 18 చోట్ల అక్రమ నిర్మాణాలను తొలగించి ‘హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ’ (హైడ్రా) సంచలనం సృష్టించింది. అయితే, ఈ హడావుడిలో ప్రజలు వేస్తున్న కొన్ని ప్రశ్నలకు ‘హైడ్రా’కు సమాధానాలు దొరకడం లేదు. ఇప్పుడు కూల్చుతున్న ఆక్రమణలకు గతంలో అనుమతులు జారీ చేసింది అధికారులే కదా? కబ్జాకు గురవుతున్నప్పుడు ఈ రెవెన్యూ అధికారులు ఏం చేసినట్టు?**

గత జూలైలో హెచ్ఎండీఏ పరిధిలోని చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ వివరాలు నోటిఫై చేయనందుకు హెచ్ఎండీఏను హైకోర్టు మందలించింది. అయినా, హైడ్రా ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్), బఫర్‌జోన్ పరిధిలో ఉన్న భవనాలను, బస్తీలను కూలగొట్టడం మొదలుపెట్టింది. హైకోర్టు పేర్కొన్నట్టు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ వివరాల్లేకుండా ‘హైడ్రా’ కూలగొట్టడం ఎలా మొదలుపెట్టిందన్నది అంతుచిక్కని ఒక ప్రశ్న. ‘ఎవరైనా ప్రభుత్వ భూములు, చెరువులను కబ్జా చేస్తే ఫోన్ చేసి చెప్పండి’ అని జూలై నెలాఖరులో హైడ్రా పకటన ఇవ్వడం ఆశ్చర్యం. అసలు ప్రభుత్వ భూములు ఏమేం ఉన్నాయో, ఎక్కడెక్కడ ఉన్నాయో అన్న వివరాలు రెవెన్యూ విభాగం నుంచి హైడ్రా అధికారులు తీసుకున్నారా? ఆ ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు మార్కింగ్ చేశారా? హెచ్ఎండీఏ ఏర్పాటుచేసిన లేక్ ప్రొటెక్షన్ కమిటీ సంగతి ఏమిటి? ఇలా చాలా ప్రశ్నలున్నాయి.

‘హైడ్రా’ అధికారులు కూల్చబోతున్న భవనం లేదా బస్తీ, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందా లేదా అని సర్వే చేయనక్కర్లేదా, చెరువు దగ్గరకి వెళ్లి, దాని చుట్టుపక్కన ఉన్న ఇండ్లలో ఏది కూల్చాలని నాణెంతో చిత్తు బొత్తు వేసుకుని నిర్మాణాలను తొలగిస్తారా? THE TELANGANA PUBLIC PREMISES (EVICTION OF UNAUTHORISED OCCUPANTS) ACT, 1968 ప్రకారం.. ఆక్రమణదారులకు ముందు షోకాజ్ నోటీసు ఇవ్వాలి. దానికి వారు సమాధానం ఇస్తారు. వారు చూపించిన పత్రాలన్నీ పరిశీలించి, వారి వాదనలు విని, వారు చట్టానికి వ్యతిరేకంగా అక్కడున్నారంటే, అప్పుడు ఎవిక్షన్ ఆర్డర్ జారీచేయాలి. ఈ ఆర్డర్ ఇచ్చిన 30 రోజుల్లోగా కబ్జాదారులు అక్కడినుంచి కదలకపోతే అప్పుడు బలవంతంగా తొలగించేయవచ్చు.

హీరో అక్కినేని నాగార్జునకు చెందిన ‘ఎన్’ కన్వెన్షన్ హాల్, గండిపేటలోని భవంతులు హైడ్రా కూల్చుతున్నప్పుడు సంపన్నులకు గుణపాఠం జరుగుతున్నదని కొందరు చంకలు గుద్దుకోవచ్చు. కానీ, మరి పేద ప్రజల సంగతేమిటి. ఉపాధి కోసం పల్లెల నుంచి పట్టణానికి వచ్చే పేద ప్రజలకు ప్రభుత్వ భూములే కాస్త ఆసరా. అక్కడ ఓ గుడిసె వేసుకొని, దగ్గరలో ఏదో పని చేసుకుంటుంటారు. వారి ఆదాయానికి అద్దె కట్టడం కూడా కష్టమే. అలా గుడిసె వేసుకోవాలనుకునే వాళ్లకు హైదరాబాద్‌లోని పలు చెరువుల పక్కన ఉన్న భూమి మాత్రమే అనుకూలంగా ఉంటుంది. సరే, వారిని అక్కడినుంచి వెళ్లండని నోటీసులిచ్చి, వారికి ప్రత్యామ్నాయాలు చూపించి అక్కడికి పంపించడం ఒక పద్ధతి. బుల్డోజర్లతో మీద పడిపోవడం మరో పద్ధతి. ‘హైడ్రా’ విధానాలను కొందరు విమర్శిస్తున్నారంటే , వారంతా చెరువుల పరిరక్షణకు వ్యతిరేకం అని కాదు.

> **గూడు చెదిరిన పక్షుల వలె తలోదిక్కు అవుతున్న పేద బతుకుల సానుభూతిగానే చూడాలి. చెరువులు కబ్జా అవుతుంటే అది చెరువులకే కాదు, నగరానికి, ప్రజలకే నష్టం జరుగుతుందనేది నిజం. అయితే, చెరువుల పరిరక్షణలో భాగంగా ఒకవేళ పేదల గుడిసెలను తొలగించాల్సి వస్తే వారికి ముందస్తు నోటీసులిచ్చి, ఆ సమీపంలోనే వారికి ప్రత్యామ్నాయాలని చూపడం ప్రభుత్వ యంత్రాంగం కనీస చర్యలు అని నొక్కి చెప్పక తప్పదు.**

చెరువులు, నదుల బఫర్‌జోన్‌లను కాపాడటం చాలా ముఖ్య విషయం. అవి ప్రకృతిలో భాగం. అయితే, ప్రస్తుతం ఉన్న భవంతులను కూలగొడితేనే చెరువులను కాపాడినట్టు కాదు. వాటిని కాపాడాలంటే, వాటి బఫర్‌జోన్ మార్కింగ్ సజావుగా జరగాలి. దాని చుట్టూరా ప్రహరీనో, సరిహద్దు రాళ్లో పెట్టాలి. ఇప్పటికే అక్కడ నివసిస్తున్న ప్రజలకు పర్యవసానాలను వివరించాలి. చెరువు భూములు కబ్జాకు గురికాకుండా రెవెన్యూ చట్టంలోని లోటుపాట్లను సవరించాలి. చట్టాలు అనుసరించకపోతే ప్రజలకు శిక్ష పడుతుంది. మరి, చట్టాలు అనుసరించని ప్రభుత్వ విభాగాల సంగతి ఏమిటి? అందుకే, భూమి రిజిస్ట్రేషన్ అయ్యే విషయం దగ్గరినుంచి, రెవెన్యూ శాఖ ప్రభుత్వ భూముల వివరాలు బయటపెట్టడం దగ్గరి నుంచి మార్పు మొదలవ్వాలి. ఇవన్నీ జరగకుండా ‘హైడ్రా’ అక్రమ నిర్మాణాలను యథేచ్ఛగా కూలగొడుతూ పోవడం అర్థరహితం.



సంజీవ్
99855 88384
(వ్యాసకర్త: మానవ హక్కుల వేదిక)

పాపం పండితే కాపాడేదెవరు?

‘ఖర్మ ఎవ్వరినీ, ఎన్నటికీ వదిలిపెట్టదు. చేసిన పాపం ఊరికే పోదు. వడ్డీతో సహా కాలమే సమాధానం చెబుతుంది...’ అంటూ ఈ మధ్య సోషల్ మీడియాలో ఓ సిద్ధాంతి వచనాలకు సంబంధించిన వీడియో తెగ వైరల్ అవుతున్నది. వాట్సప్ స్టేటస్‌లో నిత్యం ఆ వీడియో కండ్లకు కనిపిస్తూనే ఉన్నది. అది ఎంతకూ ఆగడం లేదు. ఎందుకు ఈ వీడియోను జనాలు వ్యాప్తి చేస్తున్నారు? మనసుకు నచ్చిన వారంతా స్టేటస్ ఎందుకు పెడుతున్నారో? లోతుగా పరిశీలన చేస్తే దానికో అర్థం, పరమార్థం తప్పక కనిపిస్తున్నది.



జూపల్లి రమేష్


ఆధునిక సమాజంలో మంచి కంటే చెడుకే ఆకర్షింపబడుతున్న వారు ఎక్కువగా కనిపిస్తారు. బుద్ధిగా జీవించడమన్నది అంత సులభంగా అలవాటు కాదు. ఎడా పెడా ఇష్టమొచ్చినట్లుగా తింటూ, తాగుతూ బతుకడం అంటే ఎవ్వరికైనా సులువైన పని. అలాంటి మర్మమే కర్మ సిద్ధాంతం వెనుక దాగి ఉన్నది. తెలంగాణ రాష్ట్రంలో పాలకుల తీరులో, ప్రజల సమూహంలో వివిధ వ్యక్తుల నడవడికలో ఈ తతంగం లోతుగా దాచిపెట్టబడింది. తమ తప్పు బయటి ప్రపంచానికి తెలిస్తే ఎక్కడ దోషులమవుతామేమోనన్న భయంతో తప్పుడు పనులు చేసినోడు ఎన్నటికీ తన తప్పులను సరి చేసుకోకుండా తప్పుల మీద తప్పులు చేస్తూనే కాలం గడుపుతుంటాడు. నిజాన్ని తొక్కిపెట్టి తప్పుకు అధికారాన్ని ఆపాదించి దండిస్తాడు. ఇదీ ఎక్కువకాలం మనుగడలో ఉండదు. ఎందుకంటే నిజం నిప్పు లాంటిది. ముడితే కాలుతుంది, అవసరమైతే దహిస్తుంది. ఏనాటికైనా తప్పుడు పనులు చేసినోడు కాలం ముంగిట దోషిగా నిలబడాల్సిందే. తప్పుడు వ్యక్తుల తప్పుడు పనులు బట్టబయలు కావాల్సిందే. అందుకు ఎవ్వరూ అతీతులు కారు. ప్రస్తుతం చేతిలో ఉన్న దండనాధికారాన్ని, పెత్తనాన్ని ఉపయోగించి నోరు లేని జీవాలకు, కష్టజీవులకు, శ్రమకారులకు ఇబ్బందులు సృష్టించొచ్చు గాక... ఎండ్ ఆఫ్ ది డే నిజం నిలబడి గెలుస్తుంది. గెలిచినప్పుడు తప్పుడు వ్యక్తుల తీరు తేటతెల్లమవుతుంది.



ఈ తప్పుడు సిద్ధాంతం ఇప్పుడే ఎందుకు గుర్తుకువచ్చిందంటే ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్న కొన్ని ఘటనలు అందుకు కారణంగా నిలుస్తున్నాయి. గత ప్రభుత్వాన్ని జనాలు గద్దె దించారు. 2014లో కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో పదేండ్లు ప్రభుత్వాన్ని సగర్వంగా నడిపి, రాష్ట్రాన్ని దేశంలో మేటిగా నిలబెట్టినప్పటికీ ఫలితం మాత్రం వేరే మాదిరిగా వచ్చింది. అదంతా ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పు. దానిని ఎవ్వరైనా శిరసావహించాల్సిందే. అయితే, గతంలో పరిపాలన కోసం తహతహలాడుతూ నోటికొచ్చిన వాగ్దానాలు చేసినవారు, కల్పిత హామీలతో ప్రజలను మభ్యపెట్టినవారు, అసత్య ప్రచారాలతో జనాలను గందరగోళంలో ముంచినవారంతా ఇప్పుడు అదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈసారి బయటి వ్యక్తుల ప్రమేయం లేకుండానే పాలకులు చిక్కుల్లో చిక్కుకుంటున్నారు. ఉదాహరణకు 2023లో గ్రూప్-2 పరీక్షల రద్దుకై భారీగా పోరాటాలు జరిగాయి. ఆనాడు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకు ప్లాన్ వేసినవారికే అలాంటి ఘటనే చుట్టుముట్టి ఊపిరి తీసుకోకుండా చేసింది. చివరికి యువ పోరుకు తలొగ్గాల్సి వచ్చింది. డిసెంబర్ 7న సీఎంగా వచ్చి రుణాలు మాఫీ చేస్తా... టక్కున వెళ్లి రూ.2 లక్షలు పంట రుణాలు తీసుకోవాలంటూ ఏడాది కింద ప్రగల్భాలు పలికినవారంతా రైతులతో పాటే రుణపాశంలో ఇరుక్కోవాల్సి వచ్చింది. సోషల్ మీడియాను విచ్చలవిడిగా వాడుకొని నోటికొచ్చింది రాసుకొని ప్రచారం చేసి నాటి పాలకులను ఇబ్బందిపెట్టిన వారికి ప్రస్తుతం అదే గతి పట్టుకున్నది. సోషల్ మీడియాలో ప్రస్తుత పాలకులకు ఎదురవుతున్న ముప్పు అంతా ఇంతా కాదు. కేవలం స్వల్ప కాలంలోనే తెలంగాణ సమాజం తిరగబడి ఎదిరిస్తున్నది. ప్రశ్నలను సంధిస్తున్నది. సమాధానాలు చెప్పలేక ప్రశ్నించిన గొంతుకలను పోలీసు కేసులతో పాలకులు నొక్కేస్తున్నరు. వ్యవసాయ క్షేత్రాలకు ‘ఫార్మ్‌హౌజ్’ అనే ఆంగ్ల పదజాలాన్ని వాడి ఒకరిద్దర్ని ఇబ్బందులకు గురిచేసినవారికి అచ్చంగా ఫార్మ్‌హౌజ్‌ల రూపేణా ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఫార్మ్‌హౌజ్‌లు లేని వారెవరు? అన్న విషయం ఇప్పుడు బయటపడింది. చక్కగా వ్యవసాయం చేసుకునే క్షేత్రానికి, జల్సాలు చేసుకునే ఫార్మ్‌హౌజ్‌లకు లింకులు పెట్టి విషాన్ని చిమ్మిన వారికి అబద్ధమే అడ్డం తిరిగి వారి నిజ స్వరూపాన్ని బట్టబయలు చేస్తుండటం మనమంతా చూస్తున్నాం. ఇలాంటిదే ఇంకో వాస్తవాన్ని మనం గుర్తించాల్సి ఉన్నది.

> **ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ పేరు చెప్తే కొన్ని వర్గాలకు గిట్టదు. కానీ, తెర వెనుక ఒవైసీ విద్యా దానం ఎంతటి గొప్పదో ఎవ్వరికీ తెలియకపోవడమే విచిత్రం. నిజానికి, అబద్ధానికి మధ్య వాస్తవం బతికే ఉంటుంది. ‘హైడ్రా’ పేరుతో కూల్చివేతల పర్వం కొనసాగుతున్న ఈ సమయంలో ఆ విద్యాసంస్థలు వెలుగుచూడటం విశేషం.**

చెరువు ఆక్రమణ అన్నది పక్కనపెడితే విద్యావ్యాప్తికై జరుగుతున్న సామాజిక సేవను కూకటివేళ్లతో తీసి పారెయ్యలేని నిజమే. దేవుడున్నాడో లేడో దేవుడికే ఎరుక. కాకపోతే కాలమనేది చాలా పవర్‌ఫుల్. మనల్ని నిశితంగా గమనించే కాలచక్రంలో తప్పు చేసినోడు ఎన్నటికీ తప్పించుకుపోలేడు. తప్పొప్పులను గుర్తించి సరిచేసే తెలివితేటలు లేకపోతే వ్యవస్థకు తద్వారా సమాజానికి ఇబ్బంది దాపురిస్తుంది. అల్టిమేట్‌గా సామాన్యులు ఇబ్బంది పడతారు. వినకుండా, చూడకుండానే ప్రతీది నిజమని నమ్మేవారు ఉన్నంత కాలం... వినిపించినా, కనిపించినా అబద్ధాలనే నిజాలుగా నమ్మినవారు ఉంటే కలిగే నష్టం మాటల్లో చెప్పలేనిది. దాని మూల్యం వెలకట్టలేనిది. వ్యవస్థ కుప్పకూలేదాకా బయట పడనిది.



ఆమె మౌనంగా ఉంటే మంచిది



షేక్ హసీనా భారత్‌లో కూర్చొని వ్యాఖ్యలు చేస్తున్నారు. అక్కడినుంచే ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఆమె అలా చేస్తుండటం బంగ్లాదేశీయులకు నచ్చడం లేదు. ఆమె మాట్లాడకుండా ఉంటే ఇరుదేశాలకూ మంచిది.

- మహమ్మద్ యూనుస్
బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత

గురుపూజోత్సవానికి వచ్చే తీరిక లేదా?

- విద్యాశాఖపై మీ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం
- సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు ఫైర్



హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన గురుపూజోత్సవానికి గైర్హాజరుకావడంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన గురుపూజోత్సవానికి హాజరయ్యే తీరిక మీకు లేదా ?' అంటూ నిలదీశారు. 'విద్యాశాఖపై మీకున్న చిత్తశుద్ధికి, ఆ శాఖకు మీరు ఇస్తున్న ప్రాధాన్యతకు ఇదే నిదర్శనం' అని గురువారం 'ఎక్స్' వేదికగా విమర్శలు సంధించారు. తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ పూర్తిగా ధ్వంసమైందని పేర్కొన్నారు. 'ఓవైపు టీచర్లు లేక స్కూళ్లను మూసేస్తున్నరు.. మరో వైపు పురుగుల అన్నం.. గొడ్డుకారం తినలేక పిల్లలు ఏడుస్తున్నరు. ఫుడ్ పాయిజన్లు, పాముకాట్లు, కుక్కకాట్లు, ఎలుకకాట్లతో విద్యార్థులు రోదిస్తున్నరు' అని ఆవేదన వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి సర్కారు గురుకులాల ఖ్యాతిని రోజురోజుకూ దిగజార్చుతున్నదని విమర్శించారు. పాఠాలు చెప్పే టీచర్లను నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారని, తరగతి గదుల్లో ఉండాల్సిన విద్యార్థులు రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. పిల్లల భవిష్యత్తు గురించి తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని తెలిపారు. ఉన్న విద్యావ్యవస్థను సక్రమంగా నిర్వహించడం ప్రభుత్వానికి చేతగావడంలేదని, పైగా సమీకృత గురుకులాలు, విద్యా కమిషన్ అంటూ భ్రమలు కల్పిస్తున్నదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలనలో పతనమవుతున్న విద్యావ్యవస్థ గురించి టీచర్లు, విద్యార్థులకు ఏం సమాధానం చెబుతారని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు.



గాంధీ దవాఖానలో ఆమరణ నిరాహార దీక్ష విరమించిన సిద్దేశ్వర్‌కు నిమ్మరసం తాగిస్తున్న బీసీ అఖిలపక్ష నాయకులు

బీసీ నేత సిద్ధేశ్వర్ ఆమరణ దీక్ష విరమణ

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 5: కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని 12 రోజుల పాటు హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్ పటేల్ చేసిన ఆమరణ నిరాహార దీక్షను గురువారం విరమించారు. రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీస్పీకర్ మధుసూదనాచారి, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీ మల్లన్న, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం, కల్లుగీత కార్మికుల సమాఖ్య మాజీ చైర్మన్ రవికుమార్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ, మాజీ ఐఏఎస్ చిరంజీవులు, బీఎస్పీ ఏపీ కోఆర్డినేటర్ పూర్ణచందర్‌రావు, సోషల్ జస్టిస్ పార్టీ ఇన్‌చార్జి కేవీగౌడ్, అంబేద్కర్ ఆజాదీ అధ్యక్షుడు నరహరి తదితరులు సిద్ధేశ్వర్‌కు నిమ్మరసం అందజేసి దీక్ష విరమింపజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ముగ్గురు బీసీ నాయకులు 12 రోజులుగా ఆమరణ నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. బీసీ డిక్లరేషన్ అమలు కోసం ఐక్య న్యాయపోరాటానికి సిద్ధమయ్యామని తెలిపారు.

42% రిజర్వేషన్లు ఉత్తమాటేనా?

- బీసీ రిజర్వేషన్ పెంచకుండానే స్థానిక ఎన్నికలు?
- పార్టీలవారీగా సీట్లిద్దామనే ప్రతిపాదన తెరపైకి
- కోర్టుకెళ్లి అనుమతి తీసుకునే యోచనలో సర్కారు
- బీసీల పోరాటంపై పట్టింపేలేదు: ప్రజా సంఘాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్న కాంగ్రెస్ ఎన్నికల హామీ ఉత్తమాటేనా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. బీసీ రిజర్వేషన్ పెంపు లేకుండా ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నదనే సంకేతాలే కనిపిస్తున్నాయి. గత ఫిబ్రవరిలో గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. జూలైలో మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీకాల పరిమితి ముగిసింది. సకాలంలో ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదు. ఈ కారణంగా కేంద్రం ఆర్థిక సంఘం నిధులను నిలుపుదల చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో, ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు బీసీ కులగణన, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పనపై హామీలు గుప్పించారు. అసలు రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టకపోవడంతో స్థానిక ఎన్నికల్లో అసలు రిజర్వేషన్లను పెంచుతారా, లేదా? అన్న అనుమానం బీసీ వర్గాలను వెన్నాడుతున్నది. ప్రభుత్వం తగిన కార్యాచరణ చేపట్టకపోవడంతో అనుమానం కలిగిన బీసీ సంఘాల నేతలు వివిధ రూపాల్లో రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు నిర్వహిస్తున్నారు. 42% రిజర్వేషన్ల సాధనే ప్రధాన డిమాండ్‌గా ఆమరణదీక్షలూ కొనసాగుతున్నాయి. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీ ఏమైందని ప్రజా ప్రతినిధులను, మంత్రులను బీసీ సంఘాలు ఎక్కడికక్కడ ప్రశ్నిస్తున్నాయి. కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ మేరకు స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు 42% కోటాను ప్రభుత్వపరంగా అమలు చేయకపోతే పార్టీపరంగా 42% స్థానాలు బీసీలకు ఇస్తామని ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడైన రేవంత్‌రెడ్డి తాజాగా సెలవిచ్చారు. దీనిపై బీసీ సంఘాల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

కొత్త కమిషన్‌తో మరింత జాప్యం

బీసీ నేత డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు సారథ్యంలో బీసీ కమిషన్‌ను గత ప్రభుత్వం నియమించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల నిర్ణయించడానికి, సుప్రీంకోర్టు ఈ కమిషన్‌కే బాధ్యతలను అప్పగించింది. రేవంత్ ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా పలు సిఫారసులను, అధ్యయన పత్రాలను ఈ కమిషన్ అందజేసింది. వకుళాభరణం కమిషన్ సిఫారసులతోనే, రేవంత్ ప్రభుత్వం రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, కులగణన సర్వే చేపట్టడానికి చర్యలు చేపట్టింది. స్థానిక సంస్థల ఎన్నికలపై రెండుసార్లు ముఖ్యమంత్రి సమావేశాలు నిర్వహించినా రిజర్వేషన్ పెంపుపై స్పష్టమైన విధాన నిర్ణయాన్ని తెలుపలేదు. ఇంతలో ఆగస్టు 31న కమిషన్ మూడేండ్ల పదవీకాలం ముగిసింది. కాంగ్రెస్ సీనియర్లు, మంత్రులు కూడా కమిషన్‌ను కొనసాగించాలని కోరినట్టు విశ్వసనీయ సమాచారం. కానీ కాంగ్రెస్ కొత్త పాలకమండలి నియామకం వైపే మొగ్గుచూపుతున్నట్టు తెలిసింది. దీంతో సమస్య మళ్లీ మొదటికొచ్చే అవకాశం ఉన్నది.

సీఎం రేవంత్‌రెడ్డి వైఖరితో గందరగోళం

సాధారణంగా ఒక నిర్దిష్టమైన అంశంపై కమిషన్‌ను నియమించినప్పుడు ఆ పని పూర్తయ్యేంత వరకు గడువు పెంచుతూ నివేదికలు స్వీకరించే ఆనవాయితీ దేశవ్యాప్తంగా కొనసాగుతున్న సంప్రదాయం. తాజాగా కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చైర్మన్‌గా జయప్రకాశ్ హెగ్డేతో బీసీ కమిషన్ పాలకమండలి ఏర్పడింది. సిద్ధరామయ్య సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటికీ హెగ్డే కమిషన్ గడువును పెంచి కులగణనకు సంబంధించిన పూర్తి నివేదికను ఇటీవలే స్వీకరించింది. ఇదే కోవలో రేవంత్ ప్రభుత్వం కూడా వకుళాభరణం కమిషన్‌ను కొనసాగించి ఉండాల్సిందని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. బీసీ కమిషన్‌కు కొత్త పాలకమండలి నియామకం ఎప్పుడు అవుతుందో, ఈ పాలకమండలి అనుభవం గడించడానికి ఎన్ని నెలలు పడుతుందో, నివేదిక ఎప్పుడు ఇస్తుందో, రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో.. మొత్తానికి అంతా గందరగోళ వాతావరణం నెలకొందన్నదన్న అభిప్రాయాన్ని రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు.

ఓటర్ల జాబితాకు వానల ఎఫెక్ట్

13న ముసాయిదా, 28న తుది ఓటరు జాబితా

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీ, వార్డుల వారీగా ఎన్నికల ఓటర్ల జాబితా రూపకల్పనపై భారీ వర్షాల ప్రభావం పడింది. గతంలో ప్రకటించిన ఓటరు జాబితా షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ సవరించింది. అనేక జిల్లాల్లో భారీ వర్షాలు కురవడంతో జిల్లా యంత్రాంగం, క్షేత్ర స్థాయి సిబ్బంది.. సహాయక చర్యలు, పునరావాసం, పునరుద్ధరణ తదితర పనుల్లో పూర్తి స్థాయిలో నిమగ్నమయ్యారు. దీంతో ఓటర్ల జాబితా గడువును మార్చినట్టుగా ఎన్నికల కమిషనర్ పార్థసారథి ఒక ప్రకటనలో తెలిపారు. వార్డులు, పంచాయతీల ముసాయిదా ఓటరు జాబితాను ఈనెల 13న ప్రదర్శిస్తామని, తుది ఓటరు జాబితాను ఈ నెల 28న ప్రకటిస్తామని తెలిపారు. ఆయా వివరాలు కిందివిధంగా ఉన్నాయి.

ఓటరు జాబితా దశలు తేదీలు (సెప్టెంబర్)

పంచాయతీల ముసాయిదా ఓటరు జాబితా	13
జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో భేటీ	18
మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో భేటీ	19
ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ	14 నుంచి 21 వరకు
అభ్యంతరాల పరిష్కారం	26
తుది ఓటరు జాబితా ప్రకటన	28

ఎన్‌వోపీఆర్‌యూఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా 'మాచన'

హైదరాబాద్, సెప్టెంబర్ 5(నమస్తే తెలంగాణ): నేషనల్ ఓల్డ్ పెన్షన్ రీస్టోరేషన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా మాచన రఘునందన్ నియామకం కానున్నారు. ఓల్డ్ పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ కోసం ఎన్‌వోపీఆర్‌యూఎఫ్ దేశవ్యాప్తంగా పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. 16న న్యూఢిల్లీలో నిర్వహించే సమావేశంలో ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు బీపీ రావత్ అధికారికంగా ప్రకటించనున్నట్టు రఘునందన్ తెలిపారు.

పకడ్బందీగా ఓటరు జాబితా ప్రక్షాళన

- జనవరి 6న తుది ఓటరు జాబితా
- సీఈవో సుదర్శన్‌రెడ్డి



బీఆర్‌కేఆర్ భవన్‌లో ఓటరు జాబితా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఈవో సుదర్శన్‌రెడ్డి

హైరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : బీఎల్‌వోలు ఇంటింటికీ తిరుగుతూ ఓటరు జాబితాను పకడ్బందీగా ప్రక్షాళన చేస్తున్నట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో)సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఓటరు ముసాయిదా జాబితాను అక్టోబరు 29న, తుది జాబితాను జనవరి 6న ప్రచురిస్తామని వెల్లడించారు. గురువారం బీఆర్‌కేఆర్ భవన్‌లో ఓటరు జాబితా ప్రక్షాళనపై రూపొందించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 2025 జనవరి 1నాటికి 18 ఏండ్లు నిండిన వారు తమ ఓటు హక్కుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఓటర్లు బీఎల్‌వోలకు సరియైన సమాచారం ఇవ్వాలని సూచించారు. బీఎల్‌వోలు ఇంటికి వచ్చినప్పుడు పేరు, చిరునామా, ఫొటోపై అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు ఉన్నట్లయితే వారికి చెప్పాలని సూచించారు. ప్రజలకు చేరువగా ఉండేందుకు బీఎల్‌వోల ఫోన్ నంబర్లు సైతం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 3.33కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, 35,356 పోలింగ్ బూతులు ఉన్నాయని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఒక పోలింగ్ బూత్‌లో 1500 మంది కంటే ఎక్కువగా ఓటర్లు ఉంటే, మరో కొత్తపోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని ఆదేశాలు ఇచ్చినట్టు వెల్లడించారు. ఇప్పటికే 70 లక్షల ఓటర్ల జాబితా పేర్లను పరిశీలించినట్టు చెప్పారు. కలెక్టర్లు, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు స్వయంగా క్షేత్రస్థాయిలో జాబితా ప్రక్షాళనను పరిశీలిస్తారని స్పష్టంచేశారు. రాష్ట్రస్థాయిలో ఏడుగురుని అధికారులను ప్రత్యేక పరిశీలకులుగా నియమించనున్నట్టు చెప్పారు.

రాష్ట్రంలో 35 శాతం చెరువులు ఖాళీ

- నిండినవి 65 శాతమే
- 50 % నిండినవి ఆరువేలు
- 2,200 చెరువుల్లో 25 శాతం నీళ్లే

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): భారీ వర్షాలు, వరదలతో రాష్ట్రం ఓ వైపు అతలాకుతలం అవుతుండగా, మరోవైపు అనేక చెరువులు నీళ్లలేక వెలవెలబోతున్నాయి. రాష్ట్రంలో 35 శాతం చెరువులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. రాష్ట్రంలో 34,716 నీటిపారుదల చెరువులున్నాయి. వాటిలో నిండినవి దాదాపు 65 శాతమే. ఇందులో 6,000 చెరువులు కనీసం 50 శాతం కూడా నిండలేదు. వీటిలో 2,200 చెరువుల్లోకి 25 శాతం మించి నీళ్లు రాలేదు. హైదరాబాద్ నీటిపారుదల సర్కిల్‌లో (రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి) 2,599 చెరువులు ఉన్నాయి. వీటిలో 40 శాతం చెరువులు నిండనేలేదు. హైదరాబాద్‌లో శేరిలింగంపల్లి, కొండాపూర్, మాదాపూర్, గచ్చిబౌలిలో జోరుగా వర్షాలు కురిసినా ఎల్బీ నగర్, మేడ్చల్ ప్రాంతాల్లో వర్షాలు ఆశించిన మేర లేవు. జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. వాతావరణ లెక్కల ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైంది. కానీ జిల్లా వార్షిక వర్షపాతం కేవలం 374 మి.మీ మాత్రమే. జిల్లాలో కురిసింది మాత్రం 734 మి.మీ. మహబూబ్‌నగర్ జిల్లాల్లో 400 చెరువులున్నాయి. వీటిలోకి 50 శాతం కూడా నీళ్లు రాలేదని అధికారులు చెప్పన్నారు. నల్లగొండ జిల్లాలో 1,628 చెరువులు ఉన్నాయి. ఇందులో కనీసం వేయి చెరువుల్లో 50 శాతం నీళ్లు కూడా లేవు. 124 చెరువులు నిండాయి. 144 చెరువులు పొంగి పొర్లుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వరదలొచ్చాయి. ఈ జిల్లాలో 2140 ట్యాంకులున్నాయి. ఇందు లో నిండి పొర్లుతున్నవి 1800. 340 చెరువులు ఇంకా నిండాల్సి ఉంది. వాతావరణ శాఖ వివరాల ప్రకారం.. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు తెలంగాణలో 597 మి.మీ వర్షపాతం రావాలి. ఇది సాధారణ వర్షపాతం. అయితే, రాష్ట్రంలో 836 మి.మీ వాన కురిసింది. అంటే 40% ఎక్కువగా వానలొచ్చాయి. ఈ కాలంలో 90 రోజులు వానలుకురవాలి. కానీ ఈ సారి కురిసింది 73 రోజులే.

సర్కారు విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్తు

- గురుపూజోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి
- విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరగాలి: పొన్నం
- కార్యక్రమానికి సీఎం గైర్హాజరు



ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న మంత్రి పొన్నం, మాజీ ఎంపీ కేకే

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అన్ని సర్కారు విద్యాసంస్థలకు ఈ నెల నుంచి ఉచిత విద్యుత్తును సరఫరా చేయనున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్కమార్క వెల్లడించారు. దీంతో రాష్ట్రంలోని 27,862 విద్యాసంస్థలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. గురువారం రవీంద్రభారతిలో జరిగిన గురుపూజోత్సవంలో ఆయన మాట్లాడారు. విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్తు సరఫరా కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో 20 కాపీని ఆయన అధికారులకు అందజేశారు. ఇదే కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కావాల్సి ఉండగా, రాష్ట్రంలో వరద పరిస్థితి నేపథ్యంలో హాజరుకాలేకపోయారని భట్టి తెలిపారు. ఇప్పటికే 11 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేశామని, మరో 6 వేలకు పైగా పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయనున్నట్టు తెలిపారు. స్కూళ్లల్లో శానిటైజేషన్ కోసం రూ.136 కోట్ల నిధులను విడుదల చేసినట్టు తెలిపారు. రాష్ట్రంలోని సర్కారు బడుల్లో ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఉపాధ్యాయులకు సూచించారు. రాష్ట్రంలో త్వరలోనే ఇంటిగ్రేటెడ్ గురుకులాలను ప్రారంభించనున్నామని తెలిపారు. అనంతరం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ, అధ్యాపక అవార్డులకు ఎంపికైన 150 మందిని ప్రభుత్వం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, ఎమ్మెల్సీలు కోదండరాం, ఏవీఎన్‌రెడ్డి, కూర రఘోత్తంరెడ్డి, నర్సిరెడ్డి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి, ఇంటర్‌విద్యా డైరెక్టర్ శృతి ఓజా,ఉపాధ్యాయ సంఘాల నేతలు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, లక్ష్మణ్, సదానంద్‌గౌడ్, పర్వత్‌రెడ్డి, జంగయ్య, చావ రవి, కటకం రమేశ్, మారెడ్డి అంజిరెడ్డి, హనుమంతరావు, నవాత్ సురేష్, అబ్దుల్లా, సీ జగదీశ్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు ఇవ్వండి సారూ..

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. గురువారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఉచిత విద్యుత్తు కొన్ని విద్యాసంస్థలకేనా?

- 27 వేల విద్యాసంస్థలకే ఉచితమని ప్రకటన
- వివిధ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల మాటేమిటి?

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ విద్యాసంస్థలకు సర్కారు ఇస్తామన్న ఉచిత విద్యుత్తు కొన్నింటికేనా? అన్నింటికి కాదా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్తు సదుపాయం కల్పిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గురువారం ప్రకటించారు. 27,862 విద్యాసంస్థలకు ఈ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలను కలుపుకుంటే 30 వేలకు పైగా ఉన్నాయి. వీటికి హాస్టళ్లు అదనం. దీన్నిబట్టి అన్నింటికీ ఈ సదుపాయం వర్తించనట్టే.

రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థలు

సర్కారు స్కూళ్లు	26,826
ప్రభుత్వ జూనియర్ కాలేజీలు	428
ఎయిడెడ్ స్కూళ్లు	634
గురుకులాలు	1,237
కేజీబీవీలు	478
మాడల్ స్కూళ్లు	194
ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు	150
క్యాంపస్ కాలేజీలు	20
కాన్‌స్టియంట్ కాలేజీలు	8
పీజీ సెంటర్లు	11
పీజీకాలేజీలు	32

'సోలార్' అటకెక్కినట్టేనా?

ఉచిత విద్యుత్తు ప్రకటనతో విద్యాసంస్థల్లో సోలార్ ప్లాంట్ల అంశం అటకెక్కినట్టేనన్న వాదన తెరపైకి వచ్చింది. రాష్ట్రంలో ఇప్పటికే 11 జిల్లాల్లోని 1,521 సర్కారు బడుల్లో సోలార్ ప్లాంట్లను నెలకొల్పారు. మరో 6,490 స్కూళ్లల్లో సోలార్ ప్లాంట్లను ఏర్పా టు చేయాలని గతంలోనే విద్యాశాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని ఉన్నత పాఠశాలలతోపాటు, తెలంగాణ మాడల్ స్కూల్స్, కేజీబీవీలోను కొత్తగా సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీటికోసం రూ.289 కోట్లు వెచ్చించనుండగా, టీజీ రెడ్‌కోకు సంస్థలను ఎంపిక చేసే బాధ్యతలను అప్పగించారు. ఇప్పుడు సర్కారు ఉచిత విద్యుత్తును ప్రకటించడంతో ఈ సోలార్ ప్లాంట్ల కథ కంచికి చేరినట్టేనని భావిస్తున్నారు.

'ఆర్‌అండ్‌బీ' లో వేతనాలు బంద్

హైదరాబాద్, సెప్టెంబర్ 5(నమస్తే తెలంగాణ): ఆర్‌అండ్‌బీ శాఖలో కొంతకాలంగా క్లర్క్ ఉద్యోగాలతో పాటు డేటా ఎంట్రీ, సబార్డినేట్, డ్రైవర్ తదితర ఉద్యోగాల భర్తీ లేకపోవడంతో అవసరాలకు అనుగుణంగా సుమారు 100 మందికిపైగా సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించారు. అయితే, మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఆఫీసుకు వచ్చేందుకు బస్‌పాస్‌లకు కూడా డబ్బులు లేని పరిస్థితి నెలకొందని ఉద్యోగులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు తమ గోడును పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. లీజు కార్లకు సంబంధించి ప్రతి నెలా ఒక్కో కారుకు రూ. 35వేల వరకు అద్దె చెల్లిస్తారు. ఇందులోనే డీజిల్ ఖర్చుతోపాటు డ్రైవర్ వేతనం కూడా ఉంటుంది. మూడు నెలలుగా లీజు తాలూకు బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులుచేసి డీజిల్ కొంటున్నట్టు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే వేతనాలు విడుదల చేయాలని వేడుకుంటున్నారు.

ప్రాజెక్టుల్లో ప్రమాదాలకు సీఈలదే బాధ్యత..

- వట్టెం ఘటనపై నివేదిక ఇవ్వండి : ఉత్తమ్

హైదరాబాద్, సెప్టెంబర్5 (నమస్తే తెలంగాణ): ప్రాజెక్టుల్లో జరిగే తప్పులకు సంబంధిత చీఫ్ ఇంజినీర్లదే పూర్తి బాధ్యతని సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. రాష్ట్రంలో వరద నష్టంపై నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలోని సీఈలతో జలసౌధ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరద నష్టం, ప్రమాదాలను నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఈఎన్సీలు అనిల్‌కుమార్, నాగేందర్‌రావు, హరిరాం, శంకర్, సీఈలు మంత్రికి వివరించారు. వట్టెం, భక్తరామదాసు పంప్‌హౌజ్‌ల మునక, మున్నేరు వరద, సాగర్ ఎడమకాలువకు గండికి గల కారణాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ నిధుల విడుదలలో తీవ్ర జాప్యమవుతున్నదని, ఫలితంగా క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. వరద ఉధృతిలోనూ విధుల్లో నిమగ్నమైన నీటిపారుదలశాఖ సిబ్బందిని అభినందించారు. వరదలతో 223 చెరువులకు గండ్లు పడ్డాయని, 159 చోట్ల నష్టం వాటిల్లిందని, 112 కాలువలు తెగిపోయాయని, మొత్తంగా 544 చోట్ల డ్యామేజీలు ఏర్పడగా తక్షణ మరమ్మతులకు రూ.113 కోట్లు అవసరమవుతాయని, శాశ్వత మరమ్మతులకు 900 కోట్లకు పైగా నిధులు అవసరమవుతాయని తెలిపారు. తెగిపోయిన చెరువు కట్టలు, కెనాల్స్ పునరుద్ధరణకు వారం రోజుల్లో టెండర్లు పిలిచి అనుమతులు మంజూరు చేయాలని అధికారులను సూచించారు. వట్టెం పంప్‌హౌజ్ మునకపై పూర్తివివరాలతో నివేదికను అందించాలని సీఈ విజయ్‌భాస్కర్‌ను ఆదేశించారు. కాలువలు, చెరువుల పర్యవేక్షణకు 1800 మంది లష్కర్లను నియమించాల్సి ఉంటుందని, ఆ మేరకు ప్రతిపాదనలను పంపించాలని సిబ్బందికి సూచించారు.

ఎడమకాల్వకు 2.10 కోట్లు

ఇటీవల గండిపడిన నాగార్జున సాగర్ ఎడమకాల్వకు తక్షణ మరమ్మతులను చేపట్టేందుకు ప్రభుత్వం రూ.2.10కోట్లతో పరిపాలన అనుమతులను బుధవారం మంజూరు చేసింది.

నిఘా నీడలో మంత్రులు!

› మొదటిపేజీ తరువాయి...

రెండు నెలలుగా తెరపైకి వచ్చిన వివిధ అంశాల నేపథ్యంలో మంత్రులపై నిఘా మరింత పెరిగిందని చెప్తున్నారు. ఆ మంత్రులు హైదరాబాద్‌లోనో.. వారికి సంబంధించిన నియోజకవర్గంలోనో ఉన్నపుడే కాదు, వాళ్లు ఢిల్లీ వెళ్లినప్పుడు కూడా ఈ నిఘా కొనసాగుతున్నదని సమాచారం. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత కొన్ని రోజులు ఎలాంటి నిఘా లేకుండా చూశారు. కానీ, తర్వాత క్రమంగా నిఘా పెరుగుతూ వచ్చింది. మొదట్లో ఒకరిద్దరు మంత్రులపైనే కొన్ని అంశాలను కేంద్రీకరించి నిఘా వర్గాల ద్వారా సమాచారం సేకరించేవారు. ఆ తర్వాత దాన్ని విస్తృతపరిచారు. ఒకరి నుంచి ఇప్పుడు సుమారు ఆరుగురు మంత్రులపై నిఘా గట్టిగానే పెట్టినట్టు తెల్సింది. మంత్రులే కాదు.. పాత ప్రభుత్వంలో కీలకంగా పనిచేసిన మాజీ మంత్రులు, బీఆర్‌ఎస్ పార్టీకి సన్నిహితంగా ఉండే అధికారులపై కూడా సర్వేలైన్స్ కొనసాగుతున్నదని సమాచారం.

'ఫేస్ టైంలో మాట్లాడుకుందాం'

కొంతమంది మంత్రులు, ఎమ్మెల్యేలు ఇప్పుడు ఏమైనా మాట్లాడాలంటే 'ఐఫోన్ ఉందా' అని అడుగుతున్నారు. 'ఏం చెప్తామన్నా.. మాపైన కూడా నిఘా మొదలైంది. ఇదేం పద్ధతి?' అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'ఎవరితోనైనా మాట్లాడాలంటే ఐఫోన్‌లోని ఫేస్‌టైమ్ యాప్ ద్వారా మాట్లాడాల్సి వస్తున్నది. అది కూడా 'నిఘా' వర్గాలు తెలుసుకోవచ్చుగానీ, కొంతలో కొంత సేఫ్‌గా ఉంటదని వాడుతున్నం. ఏదో మాట్లాడిండ్రని అంటున్నరు.. ఏం మాట్లాడినమో తెలుస్తలేదని అంటున్నరు. ఇదేదో మంచిగనే ఉన్నదని ఫేస్‌టైమ్‌లోనే మాట్లాడుకుంటున్నం' అని వారు చెప్తున్నారు. సిగ్నల్, వాట్సాప్ యాప్‌లపైనా నిఘా పెట్టి మనం ఎవరెవరితో మాట్లాడుతున్నామో ఆరా తీస్తున్నారని వాపోతున్నారు. 'అన్నా.. మొన్న నువ్వు ఫలానా ఆయనతో ఇట్ల అన్నవంట.. అది అట్ల కాదు' అని ఒక నేతను ఉద్దేశించి ముఖ్యనేత ఒకరు వ్యాఖ్యానించినట్టు తెలిసింది. తాను మాట్లాడిన విషయం తనకు, ఎదుటివ్యక్తికి తప్ప మరొకరికి తెలియదని, అలాంటిది ఇట్లా అనడం దేనికి సంకేతమని ఆ నేత వాపోతున్నాడు. ఇదే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వంలో చక్రం తిప్పుతున్న ఓ నిఘా అధికారి దృష్టికి కూడా తీసుకెళ్లగా.. ఆయన ఒక నవ్వు నవ్వి.. 'అది నా డ్యూటీయే కదన్నా. మీకు తెలియనది కాదుకదా' అని అన్నట్టు తెలిసింది.

ఢిల్లీలో ప్రత్యేక వ్యవస్థ

రాష్ట్ర నిఘా అధికారులకు ఇప్పుడు ఢిల్లీలో చేతినిండా పని దొరికింది. పార్టీ అధిష్ఠానం వద్దకు ఎవరెవరు వెళ్తున్నారు.. ఎవరెవరు ఎవరిని కలుస్తున్నారనే దానిపై ఎక్కువ దృష్టి పెడుతున్నట్టు తెలిసింది. ఇటీవల ఒక కీలక మంత్రి ఢిల్లీకి వెళ్లారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిస్థితులపై ఆయన అధిష్ఠానానికి నివేదిక ఇచ్చారు. ఆ నివేదిక ఆధారంగా అధిష్ఠానం పోచారం శ్రీనివాస్‌రెడ్డి, గుత్తా అమిత్ రెడ్డిలకు సంబంధించిన నామినేటెడ్ పదవులను ఆపేసింది. ఈ విషయం నిఘా వర్గాల ద్వారా ముందే పసిగట్టిన ముఖ్యనేత హడావుడిగా ఢిల్లీకి వెళ్లి తన వాదన వినిపించే ప్రయత్నం చేశారు. అధిష్ఠానం తనకు ఇలాంటి విషయంలో సహకరించాలని, అయితేనే పార్టీని బలోపేతం చేయగలనని ఆయన చెప్పినట్టు తెలిసింది. ఢిల్లీ పెద్దల్లో కీలకమైన కేసీ వేణుగోపాల్‌ను కలిసి తన పరువుపోతున్నదని కూడా అన్నట్టు సమాచారం. అయితే, అధిష్ఠానం ఆ ముఖ్యనేతను పట్టించుకోలేదు.

నేతలకు కౌంటర్‌గా కథనాలు

ఫలానా నాయకుడు.. ఫలానా అంశంపై పార్టీ అధిష్ఠానం వద్దకు వెళ్తున్నాడంటూ నిఘా వర్గాల నుంచి సమాచారం అందగానే.. తనకు వ్యతిరేకంగా పనిచేస్తున్న వారిపై మీడియా, సోషల్ మీడియాలో సదరు ముఖ్యనేత కథనాలను రాయిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ విషయంలో పార్టీ నేతలు ఆయనపై గుర్రుగా ఉన్నారు. కొంతమంది పార్టీ నేతలకు వ్యతిరేకంగా గతంలోనూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టించిన చరిత్ర ఆ ముఖ్యనేతకు ఉన్నది. తనను కాదని ఎవరైనా ఢిల్లీ పెద్దలను కలిసేందుకు ప్రయత్నిస్తే.. రెండు కండ్ల సిద్ధాంతంతో పనిచేసే ఓ మీడియా సంస్థకు చెందిన పత్రిక, టీవీ చానల్‌లో ఆ మంత్రి లేదా ఆ నేతకు వ్యతిరేకంగా కథనాలు వచ్చేస్తాయి. సోషల్ మీడియాలో ట్రోలింగ్ మొదలవుతుంది. విషయం ఆ మంత్రి లేదా ఆ నేతకు అర్థమయ్యేలా చేస్తారు. ఒకరిద్దరు కీలక మంత్రులు ఈ విషయాన్ని కూడా పార్టీ అధిష్ఠానం వద్దకు తీసుకెళ్లారని, తమపై వస్తున్న పత్రికల కథనాలు, సోషల్ మీడియా ట్రోలింగ్‌పై వారు తమ నిరసన తెలిపారని గాంధీభవన్ వర్గాల సమాచారం.

రాష్ట్ర వాటా నిధులివ్వాలని కేఆర్‌ఎంబీ వినతి

హైదరాబాద్, సెప్టెంబర్5 (నమస్తే తెలంగాణ): బోర్డు నిర్వహణకు వెంటనే నిధులను విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు చైర్మన్ అతుల్ జైన్, మెంబర్ సెక్రటరీ డీఎం రాయపురే విజ్ఞప్తి చేశారు. జలసౌధకు విచ్చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని ఆయన చాంబర్‌లో గురువారం ప్రత్యేకంగా కలిశారు. బోర్డుకు తెలంగాణ సర్కారు చెల్లించాల్సిన బడ్జెట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. అందుకు మంత్రి ఉత్తమ్ సానుకూలంగా స్పందించారు.

వరద బాధితులకు ఇదిగో సిద్దిపేట సాయం



ఖమ్మం వరద బాధితులకు అందజేయడానికి సిద్దిపేట నుంచి నిత్యావసర సరుకుల వాహనాలను పంపుతున్న మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు



సిద్దిపేట నుంచి మాజీ మంత్రి హరీశ్‌రావు పంపిన సరుకుల లారీలతో ఖమ్మంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, పగడాల తదితరులు

ఊరుకో చెల్లి


మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం సీతారాంతండాలో వరద ప్రభావిత బాధిత మహిళలను ఓదారుస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

- ఇంతటి ఘోరమా?


మహబూబాబాద్ జిల్లా అయోధ్యలో కొట్టుకుపోయిన చెరువుకట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

- అన్నీ తడిసి ముద్దయినయ్


ఖమ్మం నగరం బొక్కలగడ్డలో తడిసిన సామాన్లను బ్యాగులో సర్దుతున్న బాధితుడు

- ఇల్లంతా ఇదే రీతి


ఖమ్మం నగరంలోని మోతీనగర్‌లో ఇంటిలో తడిసిన సామాన్లు, దుస్తులను శుభ్రం చేసుకుంటున్న మహిళ


మహబూబాబాద్ జిల్లా దుబ్బతండాలో ఆకేరువాగు వరద ప్రభావంతో పొలాల్లో వేసిన ఇసుక మేటలు

- బువ్వకెట్ల?


మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం దుబ్బతండాలో ఇంట్లో దాచుకున్న వడ్లు మొలకెత్తాయని చూపుతున్న మహిళ


ఖమ్మంలో బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్ మాటేటి నాగేశ్వరరావును విడుదల చేయాలని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న స్థానికులు

తండాలో మిగిలింది 'దుబ్బే'

- ఆకేరు వాగు వరద తాకిడితో కొట్టుకుపోయిన పంటచేలు
- పొలాల్లో వేసిన ఇసుక మేట.. లక్షలాది రూపాయల నష్టం
- భరోసా ఇవ్వని అధికారులు
- దుబ్బ తండావాసుల ఆవేదన

మహబూబాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : తిందామంటే తిండి లేదు.. కట్టుకుందామంటే బట్టలేదు.. ఇంట్లో ఉందామంటే మొత్తం బురదే.. ఇది దుబ్బతండా వాసుల దుస్థితి. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఆకేరు వాగు వరద ముంచెత్తడంతో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం దుబ్బతండా తీవ్రంగా నష్టపోయింది. పంటలతోపాటు గొడ్డుగోదా కొట్టుకుపోగా, ఇంట్లో ఉన్న బియ్యం, ఉప్పు, పప్పు, ఇతర నిత్యావసరాలు, దుస్తులు తడిసి ముద్దయ్యాయి. సర్వస్వం కోల్పోయిన ఆ తండావాసులకు చివరికి మిగిలింది దుబ్బే. దుబ్బతండాలో 50 ఇండ్లు ఉండగా, సుమారు 200 మంది నివసిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి సృష్టించిన వరద బీభత్సంతో తండా రూపురేఖలు లేకుండా పోయింది. తెల్లవారుజామున 4 గంటలకు ఇళ్లల్లోకి వరద వస్తుండటంతో గమనించిన ప్రజలు ఉత్త చేతులతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పక్కనే ఉన్న చిలుక్కోయపాడు గ్రామానికి వెళ్లి తలదాచుకున్నారు. మూడు రోజుల తర్వాత తండాకు వచ్చిన ప్రజలు ఇప్పుడిప్పుడే తమ ఇళ్లను శుభ్రపరచుకుంటున్నారు. ఓ రైతుకు చెందిన 30 బస్తాల జొన్నలు వరదలో కొట్టుకుపోగా, కొందరు రైతుల వరి, మిర్చి, పత్తి నీట మునిగింది. మరి కొంతమంది పంటలతోపాటు మోటర్లు, మీటర్లు వరదలో కొట్టుకుపోయాయి. రెండు ఇండ్లు పూర్తిగా కూలిపోగా, మరి కొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. తండా అంతా బురదతో నిండిపోయి దుర్వాసన వస్తుండటంతో అక్కడ ఉండలేని పరిస్థితి నెలకొన్నది.

సీఎం చెప్పినా దక్కని భరోసా..

సీఎం రేవంత్ రెడ్డి జిల్లాకు వచ్చి వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారే తప్ప ఇప్పటివరకు దుబ్బ తండా వాసులను పలుకరించినవారే లేకుండా పోయారు. తాము పంటల కోసం పెట్టిన పెట్టుబడిని ప్రభుత్వం నష్ట పరిహారంగా రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఇదే తండాకు చెందిన ధరావత్ రాజమ్మ మనుమరాలికి పెండ్లి కుదరగా అకస్మాత్తుగా వచ్చిన వరద ఆమె ఇల్లును గుల్ల చేసింది. పెండ్లి కోసం రూ.లక్ష వెచ్చించి కొనుగోలు చేసిన 5 క్వింటాళ్ల బియ్యం, ఇతర సామగ్రి కొట్టుకుపోవడంతో రాజమ్మ లబోదిబోమంటున్నది. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రావిరాల, మరిపెడ మండలం సీతారాం తండా, డోర్నకల్ మండలం దుబ్బతండాల్లో పరిస్థితి ఇంకా అలానే ఉన్నది. ఆయా తండాల్లోని ప్రజలు తడిసిన నిత్యావసరాలను ఇంటి ముందు ఆరబెట్టుకుంటున్నారు. ఇంట్లో చేరిన బురదను శుభ్రం చేసుకుంటున్నారు. తమ కుటుంబాలను ఆదుకునే ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు.

ధైర్యం నింపిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు

రావిరాల గ్రామంలో గురువారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ పర్యటించి 110 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం వరద బాధితుల కోసం నిధులు ఇచ్చిన తర్వాత కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇవ్వకపోవడం బాధాకరమని ఆరోపించారు. సీతారాం తండాలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ పర్యటించి 56 కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. అధికారులు అరకొరగా పారిశుద్ధ్య పనులు చేస్తుండటంతో దుర్వాసన పోవడం లేదని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహబూబాబాద్ మండలం అయోధ్య తదితర గ్రామాల్లో తెగిన చెరువులను బీఆర్‌ఎస్ నేత, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు పరిశీలించారు. రైతులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం మెడలు వంచైనా రైతులందరికీ నష్టపరిహారం ఇప్పించే వరకు తమ పోరాటం ఆగదని భరోసా కల్పించారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

- వరదలకు ఖమ్మం, మహబూబాబాద్‌లో తీవ్ర నష్టం
- సహాయం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం
- మేము వెళ్తే మామీదే ఉల్టా కేసులు
- మాజీ మంత్రి హరీశ్‌రావు
- ఖమ్మం, మహబూబాబాద్ వరద బాధితులకు సిద్దిపేట సాయం

సిద్దిపేట, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): వరద సహాయం చేయటానికి ఖమ్మానికి వెళ్తే దాడి చేయటమే కాకుండా.. సీఎం రేవంత్ తమ మీద ఉల్టా కేసులు పెట్టిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఇది ప్రజాపాలన కాదని, రాక్షస పాలన అని ధ్వజమెత్తారు. సహాయం చేసేవారిపై ఎవరైనా కేసులు పెడతారా? అని నిలదీశారు. కేసులకు భయపడే ప్రసక్తే లేదని, అంతిమంగా న్యాయం, ధర్మం గెలుస్తుందని స్పష్టంచేశారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఖమ్మం, మహబూబాబాద్ వరద బాధితులకు సరుకులు తీసుకెళ్లే మూడు వాహనాలను హరీశ్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. సహాయం చేయటానికి వెళ్తే దాడిచేయటం అత్యంత హేయమైన చర్య అని కాంగ్రెస్‌పై దుయ్యబట్టారు. 'మీరే దాడి చేసి మీరే ఉల్టా కేసులు పెడుతున్నారు. అధికారం ఉన్నదని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నావు. ఇది మంచిది కాదు. సహాయం చేసేందుకు వచ్చిన వారిని ఎందుకు ఇబ్బందులు పెడుతున్నారని ఖమ్మంలో వరద బాధిత మహిళలు దుమ్మెత్తిపోశారు. నీతి, నిజాయతీ ఉంటే నిజంగా మీది ప్రజాపాలన అయితే ఒకసారి సమీక్ష చేసి కేసులు ఉపసంహరించుకోవాలి. పైనుంచి మీరే ప్రేరేపించి మాపై దాడి చేయించారు. మీ తాటాకు చప్పుళ్లకు భయపడేదేలేదు' అని సీఎం రేవంత్‌ను ఉద్దేశించి మండిపడ్డారు.

రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం

అధికారంలో ఉండి కనీసం మంచినీళ్లు, అన్నం పెట్టలేకపోయారని.. ఒక హెలికాప్టర్ కూడా పంపించలేకపోయారని.. బాధితులకు రూ.10 వేలు ఏమూలకూ సరిపోవని కాంగ్రెస్ సర్కారుపై హరీశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇండ్లు పూర్తిగా నీట మునిగిన కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దళితులు, గిరిజనులు, బలహీన, మైనారిటీ వర్గాల ప్రజలకు చేయూతనివ్వాలని చెప్పారు. ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణ, ఆస్తి నష్టం నివారించే అవకాశం ఉండేదని అన్నారు. సామాజిక బాధ్యతగా బీఆర్‌ఎస్ తరపున ఖమ్మంకు సరుకులు పంపిస్తున్నామని, మరో రెండు రోజుల్లో మహబూబ్‌బాద్‌కు కూడా సరుకులు పంపిస్తామని తెలిపారు. ఇప్పటికే కేసీఆర్ పిలుపు మేరకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల ఒక నెల జీతాన్ని సీఎం సహాయనిధికి ఇవ్వాలని నిర్ణయించినట్టు వెల్లడించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల కోసం కోర్టు మెట్లెక్కినం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులతో తొలిసారి కల్యాణలక్ష్మి చెక్కుల కోసం హైకోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చిందని హరీశ్‌రావు అన్నారు. గురువారం 500 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం కూడా ఇస్తామని.. నేటికీ ఇవ్వడం లేదని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలో క్షేమంగా ఉన్న హాస్టళ్లు నేడు సంక్షోభంలో పడ్డాయని విమర్శించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 7 నెలలుగా జీతాలు రావడం లేదని చెప్పారు. కార్యక్రమంలో సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ కడవేర్గు మంజుల రాజనర్సు, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

వరద బాధితులకు సిద్దిపేట సాయం

ఖమ్మం, మహబూబాబాద్ వరద బాధితులను ఆదుకొనేందుకు సిద్దిపేట నియోజకవర్గం నుంచి వ్యాపారవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, బీఆర్‌ఎస్ నాయకులు స్వచ్ఛందంగా కొన్ని వాహనాల్లో సరుకులు పంపిస్తున్నట్టు హరీశ్‌రావు తెలిపారు. గురువారం 200 క్వింటాళ్ల సన్న బియ్యం, 2 వేల నిత్యావసర సరుకుల కిట్లు, 500 బ్లాంకెట్లు, 2 వేల బ్రెడ్ ప్యాకెట్లు, కూరగాయలు తదితర సామగ్రిని ఖమ్మంకు పంపించామని, గురువారం, శుక్రవారం కొన్ని వాహనాలను సమకూర్చి మహబూబ్‌బాద్‌కు పంపిస్తామని తెలిపారు. ఎవరికి వారు వరద బాధితులను ఆదుకోవాలని బీఆర్‌ఎస్ తరపున కోరుతున్నట్టు పేర్కొన్నారు.

ఖమ్మానికి చేరిన సిద్దిపేట నిత్యావసరాలు

ఖమ్మం, సెప్టెంబర్ 5 : ఖమ్మం వరద బాధితుల సహాయార్థం సిద్దిపేట నుంచి మాజీ మంత్రి హరీశ్‌రావు పంపించిన నిత్యావసర సరుకులు గురువారం రాత్రి ఖమ్మానికి చేరాయి. సిద్దిపేట నియోజకవర్గ హరీశ్‌రావు టీం సభ్యులు.. ఖమ్మం బీఆర్‌ఎస్ కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సమక్షంలో అందజేశారు. వాటిని ఎంపీ రవిచంద్రతో కలిసి ఖమ్మం నగర బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సీనియర్ నాయకుడు ఆర్జేసీ కృష్ణ, రూరల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బెల్లం, తెలంగాణ ఉద్యమకారులు రామ్మూర్తి, సుబ్బారావు పరిశీలించి.. డివిజన్, రూరల్ గ్రామాల వారీగా కేటాయించారు.

ఎట్టకేలకు రైల్వే ట్రాక్ పునరుద్ధరణ

అప్, డౌన్ ట్రాక్‌లపై కొనసాగుతున్న రాకపోకలు


కేసముద్రం-ఇంటికన్నె మధ్య పూర్తయిన రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు

కేసముద్రం, సెప్టెంబర్ 5 : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం-ఇంటికన్నె రైల్వే స్టేషన్ల మధ్య ఎట్టకేలకు రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 418వ కిలోమీటర్ రాయి వద్ద ట్రాక్ ధ్వంసమైన విషయం తెలిసిందే. ఈ నెల ఒకటిన సాయంత్రం నుంచి రైల్వే అధికారులు వందల మంది కూలీలు, భారీ యంత్రాల సాయంతో ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. కాగా, బుధవారం అప్ లైన్ ట్రాక్ పనులు పూర్తిచేసి రైళ్ల రాకపోకలు ప్రారంభించారు. కాగా, గురువారం ఉదయం డౌన్ లైన్ ట్రాక్ పనులను సైతం పూర్తి చేసి మొదట గూడ్స్ ద్వారా ట్రయల్ రన్ నిర్వహించారు. అనంతరం గోల్కొండ, కృష్ణ, హౌరా ఎక్స్‌ప్రెస్ రైళ్లను పంపించారు. దీంతో పూర్తిస్థాయిలో రైళ్ల రాకపోకలు ప్రారంభమయ్యాయి. అయినప్పటికీ కొన్ని రోజులపాటు ఈ ప్రాంతంలో రైళ్ల వేగాన్ని తగ్గించి నడపనున్నట్టు రైల్వే అధికారులు పేర్కొన్నారు.

- చిట్యాల పంట పొలాల్లో ఆర్మీ హెలికాప్టర్ ల్యాండ్



***సాంకేతిక** లోపం తలెత్తి ఓ ఆర్మీ హెలికాప్టర్ గురువారం నల్లగొండ జిల్లా చిట్యాల సమీపంలోని పంట పొలంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. విజయవాడలో వరద సహాయక చర్యల్లో పాల్గొని హైదరాబాద్‌లోని హకీంపేటకు వెళ్తుండగా సాంకేతిక లోపం తలెత్తింది. దీనిని గుర్తించిన పైలట్ ఉదయం 11 గంటల ప్రాంతంలో చిట్యాల శివారులోని పంట పొలాల్లో విశాలమైన ప్రాంతంలో ల్యాండ్ చేశాడు. విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు హైదరాబాద్ నుంచి వచ్చి సాంకేతిక లోపాన్ని సరిచేసి సాయంత్రం 5 గంటల ప్రాంతంలో హెలికాప్టర్‌ను హైదరాబాద్‌కు పంపించారు.* **-చిట్యాల**

వరద సాయం చేయమన్నందుకే అరెస్ట్

మాజీ కార్పొరేటర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

విడుదల చేయాలని ధర్నా

నేతల జోక్యంతో విడుదల

ఖమ్మం, సెప్టెంబర్ 5: ఖమ్మం నగరం బొక్కలగడ్డ వద్ద అద్దెకున్న వారికీ సాయం అందించాలని కోరిన బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్ మాటేటి నాగేశ్వరరావును పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానికులకే ఇస్తుండటంతో సిబ్బందికి, నాగేశ్వరరావుకు మాటామాటా పెరిగింది. కాంగ్రెస్ రావడంతో ఉద్రిక్తత నెలకొన్నది. త్రీటౌన్ పోలీసులు వచ్చి నాగేశ్వరరావును తీసుకెళ్లారు. నిరసనగా వందలాది మంది మాటేటి కిరణ్ ఆధ్వర్యంలో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. పోలీసులతో వాగ్వాదం చోటుచేసుకున్నది. బీఆర్‌ఎస్ నేతలు పగడాల నాగరాజు, తోట వీరభద్రం సీఐతో మాట్లాడటంతో నాగేశ్వరరావును విడిచిపెట్టడంతో స్థానికులు ఆందోళనను విరమించారు.

వెల్లువెత్తుతున్న సాయం

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): వరద బాధితులను ఆదుకునేందుకు దాతల నుంచి సహాయం వెల్లువెత్తుతున్నది. గురువారం పలువురు దాతలు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి చెక్కులను అందజేశారు. ఎస్బీఐ ఉద్యోగులు తమ ఒకరోజు వేతనం రూ.5 కోట్లను విరాళంగా ప్రకటించారు. అరబిందో ఫార్మా రూ.5 కోట్లు అందజేసింది. విద్యుత్ ఉద్యోగులు ఒక రోజు వేతనం రూ. 15 కోట్లు విరాళంగా అందజేశారు. ఎంపీ బండి పార్థసారథి రెడ్డి కోటి రూపాయలు విరాళంగా అందజేశారు.

దాత	మొత్తం(రూ.)
విద్యుత్ శాఖ	15 కోట్లు
ఎస్బీఐ	5 కోట్లు
అరబిందో ఫార్మా	5 కోట్లు
ఏఐజీ హాస్పిటల్స్	కోటి
ఎంపీ పార్థసారథిరెడ్డి	కోటి
అంబికా గ్రూప్	5 లక్షలు
మల్లు రవి	1.90 లక్షలు



సిక్కింలో వెర్టికల్ వీర్ ప్రాంతంలో ప్రమాదానికి గురైన సైనికుల వాహనం

800 అడుగుల లోయలో పడ్డ వాహనం.. నలుగురు జవాన్ల దుర్మరణం

న్యూఢిల్లీ : సిక్కింలోని పాక్యోంగ్ జిల్లాలో గురువారం జరిగిన ప్రమాదంలో నలుగురు భారత సైనికులు మరణించారు. పశ్చిమ బెంగాల్‌లోని పెడోంగ్ నుంచి సిక్కింలోని జులూక్‌కు సిల్క్ రూట్ గుండా వెళ్తుండగా వీరు ప్రయాణిస్తున్న వాహనం దాదాపు 800 అడుగుల లోతుగల లోయలో పడిపోయింది. ఈ వాహనం డ్రైవర్ ప్రదీప్ పటేల్, క్రాఫ్ట్స్‌మన్ డబ్ల్యూ పీటర్, నాయక్ గురుసేవ్ సింగ్, సుబేదార్ తంగపండి మరణించినట్లు అధికారులు గుర్తించారు. వీరంతా పశ్చిమ బెంగాల్‌లోని బినగురి యూనిట్‌కు చెందినవారు.

పిల్లలను 'క్రమశిక్షణ'లో పెట్టేందుకు హక్కు

టీచర్లకు కల్పిస్తూ చైనా ప్రభుత్వం మార్గదర్శకాలు

బీజింగ్, సెప్టెంబర్ 5: దేశంలో 2035 నాటికి ఉపాధ్యాయ వృత్తిని గౌరవప్రదమైన, ప్రశంసాపూర్వకమైన వృత్తులలో ఒకదానిగా తీర్చిదిద్దాలని చైనా ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా ఈ వారం చైనా కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ, స్టేట్ కౌన్సిల్, చైనా క్యాబినెట్ కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. విద్యార్థులను 'క్రమశిక్షణ'లో ఉంచేందుకు ఉపాధ్యాయులకు హక్కు కల్పించారు. నిబంధనలు అతిక్రమించిన వారిని, తప్పుడు పనులు చేసిన వారిని ఎంతమాత్రం ఉపేక్షించరు. ఉల్లంఘనులు కఠిన క్రమశిక్షణా చర్యలతో పాటు న్యాయపరమైన విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుంది. 1.89 కోట్ల మంది టీచర్లతో చైనా ప్రపంచంలోనే అతి పెద్ద ఉపాధ్యాయ వ్యవస్థ కలిగి ఉంది. అయితే చైనా విద్యా విధానంపై కొన్ని విమర్శలు ఉన్నాయి. క్రమశిక్షణ పేరుతో విద్యార్థులను తరగతి ముగిసిన తర్వాత కూడా నిర్బంధించడం, తరగతులు జరుగుతున్న సమయంలో వారిని నుంచోపెట్టడం వంటి చర్యలను విద్యావంతులు తప్పుబడుతున్నారు.

వికీపీడియాని మూసివేయిస్తాం

ఢిల్లీ హైకోర్టు హెచ్చరిక

న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టు గురువారం వికీపీడియాకు కోర్టు ధిక్కార నేరం కింద నోటీసు జారీ చేసింది. ఆసియన్ న్యూస్ ఇంటర్నేషనల్ (ఏఎన్ఐ) పిటిషన్‌పై ఈ చర్య తీసుకుంది. ఏఎన్ఐ వాదన ప్రకారం, వికీపీడియాలోని ఏఎన్ఐ ఎంట్రీ పేజ్‌లో ముగ్గురు వ్యక్తులు ఎడిట్ చేశారు. ఈ మాటలు ఏఎన్ఐకి పరువు నష్టం కలిగించే విధంగా ఉన్నాయి. ఈ విధంగా ఎడిట్ చేసిన సబ్‌స్క్రైబర్ల సమాచారాన్ని వెల్లడించాలని హైకోర్టు గతంలో వికీపీడియాను ఆదేశించింది. కానీ వికీపీడియా ఆ ఆదేశాలను పాటించలేదని ఏఎన్ఐ మళ్లీ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ నవీన్ చావ్లా మాట్లాడుతూ, వికీపీడియా భారత దేశపు సంస్థ ఔనా? కాదా? అనేదానితో సంబంధం లేదని చెప్పారు. ''మీ వ్యాపార లావాదేవీలను భారత దేశంలో మూసివేయిస్తాం. వికీపీడియాను బ్లాక్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతాం. గతంలో కూడా మీరు ఇదే వాదన వినిపించారు. మీకు భారత్ అంటే ఇష్టం లేకపోతే, దయచేసి, ఇక్కడ పని చేయకండి'' అని హెచ్చరించారు.

కౌన్ బనేగా సీఎం?

- కర్ణాటక కాంగ్రెస్‌లో ముదురుతున్న కుర్చీలాట
- సీఎం పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న డీకే
- రేసులోకి సతీశ్ జార్కిహోళి.. ఢిల్లీలో చర్చలు
- హైకమాండ్ పరిశీలనలో ఖర్గే, పరమేశ్వర పేర్లు
- మంత్రులకు విందు ఇచ్చిన సీఎం సిద్ధరామయ్య
- కుర్చీ కాపాడుకునేందుకు చివరి ప్రయత్నాలు?

బెంగళూరు, సెప్టెంబర్ 5: కర్ణాటక కాంగ్రెస్‌లో కుర్చీలాట ముదురుతున్నది. ముడా, వాల్మీకి కుంభకోణాల ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు పదవీగండం పొంచి ఉంది. బయటకు కాంగ్రెస్ నేతలంతా ఆయనకు మద్దతు ప్రకటిస్తున్నప్పటికీ, సిద్ధరామయ్యను తప్పించాలని అంతర్గతంగా అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తున్నది. బీజేపీ సైతం సిద్ధరామయ్య రాజీనామా చేయాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నది. ఈ నేపథ్యంలో ఆయన కుర్చీ దిగితే వెంటనే అందులో కూర్చునేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, హోంమంత్రి జీ పరమేశ్వర, సీనియర్ మంత్రి సతీశ్ జార్కిహోళి సీఎం పదవి కోసం తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ అధిష్ఠానం మాత్రం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేరును సైతం పరిశీలిస్తున్నట్టు తెలుస్తున్నది. మరోవైపు సిద్ధరామయ్య తన క్యాబినెట్ మంత్రులకు విందు ఏర్పాటు చేశారు. సీఎం పీఠాన్ని కాపాడుకునేందుకు ఆయన చివరి ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది.

డీకే ఆశలు నెరవేరేనా?

గత ఏడాది జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తర్వాత సిద్ధరామయ్య, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ మధ్య సీఎం పదవి కోసం తీవ్ర పోటీ నెలకొన్నది. అధిష్ఠానంతో పాటు మెజారిటీ ఎమ్మెల్యేలు సిద్ధరామయ్య వైపే మొగ్గారు. అయితే, రెండున్నర ఏండ్ల తర్వాత డీకేకు సీఎం పదవి అప్పగించేలా ఒక అనధికార ఒప్పందం జరిగిందనే ప్రచారం ఉంది. ఇప్పుడు సిద్ధరామయ్య దిగిపోతే డీకే సీఎం కావడం ఖాయమని అంతా అనుకున్నారు. అయితే, అనూహ్యంగా రేసులోకి మల్లికార్జున ఖర్గే, సతీశ్ జార్కిహోళి, పరమేశ్వర వంటి నేతలు వచ్చారు. దీనికి తోడు సిద్ధరామయ్య వర్గం డీకేను వ్యతిరేకిస్తున్నది. దీంతో ఈసారైనా సీఎం కావాలనే డీకే ఆశలు నెరవేరుతాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది.



సమీకరణాలు బేరీజు వేస్తున్న హైకమాండ్

సిద్ధరామయ్యను తర్వాత ఎవరిని ముఖ్యమంత్రిని చేయాలనే అంశంలో కాంగ్రెస్ హైకమాండ్ సామాజికవర్గ సమీకరణాలను బేరీజు వేసుకుంటున్నట్టు తెలుస్తున్నది. బీసీ నాయకుడైన సిద్ధరామయ్యను తప్పిస్తే మరో బీసీ నేతకే అవకాశం ఇవ్వకపోతే బీసీలు దూరం అవుతారనే ఆందోళన హైకమాండ్‌కు ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటే బీసీ నాయకుడైన జార్కిహోళి పేరును పరిశీలించవచ్చని తెలుస్తున్నది. అధిష్ఠానంతో ఆయన చర్చలు జరుపుతున్నారు. సిద్ధరామయ్య సైతం జార్కిహోళి వైపే మొగ్గు చూపవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, దళితులకు సీఎం పదవి ఇవ్వాలనే ఆలోచన సైతం కాంగ్రెస్ అధిష్ఠానానికి ఉందని తెలుస్తున్నది. ఈ క్రమంలో ఖర్గే, పరమేశ్వర పేర్లను సైతం పరిశీలిస్తున్నది. ఖర్గేకు సైతం పలువురు ఎమ్మెల్యేల మద్దతు ఉంది. గతంలో సిద్ధరామయ్య, డీకే ఇద్దరే పోటీలో ఉన్నప్పుడే ఏకాభిప్రాయం సాధించేందుకు హైకమాండ్ నానా తంటాలు పడింది. ఈసారి నలుగురు పోటీలో ఉండటంతో సీఎం ఎంపిక నిర్ణయం కర్ణాటక కాంగ్రెస్‌లో సంక్షోభానికి దారితీసే అవకాశాలు లేకపోలేదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

మంత్రులకు సిద్ధరామయ్య విందు

ముడా కుంభకోణం, పదవీగండం నేపథ్యంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన క్యాబినెట్ మంత్రులకు ఇటీవల విందు ఏర్పాటు చేసినట్టు తెలుస్తున్నది. ముఖ్యమంత్రి పదవిని కాపాడుకునేందుకు ఆయన చివరి ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు మంత్రులతో చర్చలు జరిపినట్టు ప్రచారం జరుగుతున్నది. తాజాగా సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు సైతం ఆసక్తికరంగా మారాయి. 'వెన్నుపోటుదారులు ఎప్పుడూ ఉంటారు. అయితే, ప్రజల ఆశీస్సులు ఉన్నంత కాలం నన్ను ఎవరూ కదపలేరు' అని ఆయన వ్యాఖ్యానించడం పార్టీలో జరుగుతున్న పరిణామాలను సూచిస్తున్నది.

ఎదురుదాడికి 'సిద్ధ'ం

ముడా, వాల్మీకి, ఖర్గే ట్రస్టు వంటి కుంభకోణాలను తెరపైకి తెస్తూ తనను ఇబ్బంది పెడుతున్న బీజేపీపై ఎదురుదాడికి దిగాలని సిద్ధరామయ్య భావిస్తున్నారు. ఇందులోభాగంగా గత బీజేపీ ప్రభుత్వం చేసిన అక్రమాలు, పాత ఆరోపణలను తవ్వితీయాలని నిర్ణయించారు. కొవిడ్ నిర్వహణకు సంబంధించి రూ.7,200 కోట్ల అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై జస్టిస్ జాన్ మైఖేల్ డిసన్హ కమిషన్ ఇచ్చిన మధ్యంతరం నివేదిక, ఎస్సై నియామక అక్రమాలపై జస్టిస్ బీ వీరప్ప కమిషన్ ఇచ్చిన నివేదికలను బయటకు తీయాలని సిద్ధరామయ్య భావిస్తున్నారు. తద్వారా తనపై వస్తున్న ఆరోపణల తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నించనున్నట్టు సమాచారం.

ప్రైమరీ స్కూల్ టీచర్ పోస్టుకు బీఈడీ అర్హత కాదు: సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ ఉద్యోగానికి బీఈడీ డిగ్రీ సరైన అర్హత కాదని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. ప్రాథమిక విద్యలో డిప్లొమా ఉండటం ఈ ఉద్యోగానికి సరైన అర్హత అని చెప్పింది. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులుగా బీఈడీ డిగ్రీ హోల్డర్ల నియామకాలను రద్దు చేస్తూ ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఈ ఉద్యోగానికి బీఈడీ హోల్డర్స్ అర్హులని చెప్తూ చేర్చిన నిబంధనను అమలు చేయరాదని స్పష్టం చేసింది. బీఈడీ హోల్డర్స్‌కు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇవ్వడం చట్టవిరుద్ధమని, ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ఈ నియామకాలను రద్దు చేయడం సరైనదేనని వివరించింది.

వాయు కాలుష్యంతో పురుషుల్లో వంధ్యత్వం

న్యూఢిల్లీ: దీర్ఘకాలికంగా వాయుకాలుష్యం బారినపడిన పురుషుల్లో సంతాన లేమి వేధిస్తుందని తాజా అధ్యయనం తేల్చింది. 5,26,056 మంది పురుషులపై డెన్మార్క్‌లోని నార్డ్ యూనివర్సిటీ ఈ అధ్యయనం చేపట్టింది.

కమలా హ్యారిసే గెలుస్తారు!

యూఎస్ నోస్ట్రాడామస్ జోస్యం

న్యూయార్క్, సెప్టెంబర్ 5: అమెరికా అధ్యక్ష ఎన్నికల నోస్ట్రాడామస్‌గా పేరొందిన ఎన్నికల విశ్లేషకుడు అలన్ లిచట్మన్ ఈ సారి అమెరికా అధ్యక్ష ఎన్నికల విజేత ఎవరో ప్రకటించారు. డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిసే వైట్‌హౌస్ పీఠాన్ని దక్కించుకుంటారంటూ ఆయన జోస్యం చెప్పారు. 'అగ్రరాజ్య కాబోయే అధ్యక్షురాలు హారిస్' అంటూ వీడియోలో పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిగా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, డెమొక్రటిక్ పార్టీ నుంచి కమలా హ్యారిస్ పోటీలో ఉన్నారు. కాగా 'కీస్ టు వైట్ హౌస్' విధానంలో అధ్యక్షుడు ఎవరో గత 40 ఏండ్లుగా ఆయన కచ్చితంగా జోస్యం చెబుతూ వస్తున్నారు.

అగ్నివీర్ పథకంలో మార్పులు!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: విమర్శలు, వివాదాలకు దారితీసిన 'అగ్నివీర్ పథకం'పై మోదీ సర్కార్ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. అర్హతలు, పారితోషకాలతోపాటు, మరికొంత మంది అగ్నివీర్లను సర్వీస్‌లో కొనసాగించేలామార్పులు ఉండబోతున్నాయని రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. పథకం మరింత మెరుగుకు అవసరమైన సవరణలు చేస్తామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. '25శాతం మందికి ఫుల్‌టైమ్ సర్వీస్ ఇవ్వటం.. క్షేత్రస్థాయిలో ఉన్న డిమాండ్‌కు సరిపోదు. నాలుగేండ్ల శిక్షణ తర్వాత అగ్నివీర్లలో 50శాతం మందిని ఫుల్‌టైమ్ సర్వీస్‌కు ఎంపిక చేయాలని సైన్యం సిఫారసు చేసింది' అని రక్షణ శాఖ తెలిపింది. వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలు తీసుకున్న తర్వాత సైన్యం తన సిఫారసులను అందజేసినట్టు తెలిసింది.

పోలీసులు లంచం ఇవ్వజూపారు!

కోల్‌కతా హత్యాచార ఘటనపై వైద్యురాలి తల్లిదండ్రుల ఆరోపణ

కోల్‌కతా, సెప్టెంబర్ 5: కోల్‌కతా హత్యాచార ఘటనలో వైద్యురాలి తల్లిదండ్రులు తాజాగా సంచలన ఆరోపణలు చేశారు. కేసును నీరుగార్చేందుకు ప్రయత్నించారని మండిపడ్డారు. ఇందుకోసం తమకు డబ్బులు ఇచ్చే ప్రయత్నం చేశారని తాజాగా వెల్లడించారు. వైద్యురాలి హత్యాచారాన్ని నిరసిస్తూ బుధవారం రాత్రి కోల్‌కతా ఆర్‌జీ కర్ దవాఖాన వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. వేల సంఖ్యలో జనం క్యాండిల్స్‌తో వైద్యురాలి మృతికి నివాళి అర్పించారు. మరోవైపు, ట్రైనీ డాక్టర్ హత్యాచారం జరిగిన మర్నాడే అప్పటి ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ కీలక ఆదేశాలు జారీ చేసినట్లు బయటపడింది. ఆగస్టు 9న డాక్టర్‌పై దారుణం జరగగా, ఆగస్టు 10న ఘోష్ పీడబ్ల్యూడీకి ఓ లేఖ రాశారు. అన్ని డిపార్ట్‌మెంట్లలోని ఆన్ డ్యూటీ డాక్టర్ల గదుల్లో మరమ్మతులు, ఆధునికీకరణ, పునర్నిర్మాణ పనులను చేయాలని కోరారు.

సంక్షోభంలో ట్రూడో సర్కారు

న్యూఢిల్లీ: కెనడాలో జస్టిన్ ట్రూడో సర్కారు సంక్షోభంలో చిక్కుకున్నది. సిక్కు నేత జగ్మీత్ సింగ్ నేతృత్వంలోని న్యూ డెమొక్రాటిక్ పార్టీ (ఎన్‌డీపీ) ట్రూడో నేతృత్వంలోని లిబరల్ గవర్నమెంట్‌కు మద్దతు ఉపసంహరించుకోవడంతో రాజకీయ సంక్షోభం ఏర్పడింది. వచ్చే ఏడాది అక్టోబరులో జరిగే ఎన్నికల వరకు ట్రూడో నిలకడగా పరిపాలన చేయగలరా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కెనడియన్లపై ప్రభావం చూపుతున్న సమస్యలను పరిష్కరించడంలో ట్రూడో ప్రభుత్వం విఫలమైందని జగ్మీత్‌సింగ్ విమర్శించారు. కార్పొరేట్ దురాశపరులకు లొంగిపోతున్నారని, ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని దుయ్యబట్టారు.

కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు వాయిదా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: మద్యం పాలసీ కేసులో బెయిల్ కోసం ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ మరికొంత కాలం నిరీక్షించక తప్పేట్టు లేదు. సీబీఐ అరెస్టును సవాల్ చేస్తూ, బెయిల్ కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు తీర్పును వాయిదా వేసింది. గురువారం ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈడీ కేసులో జ్యుడిషియల్ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేయటాన్ని తప్పుబట్టింది. కోర్టు అనుమతి తీసుకోవాలి కదా.. అంటూ సీబీఐని మందలించింది. కేజ్రీవాల్ పిటిషన్లపై సెప్టెంబర్ 10న సుప్రీంకోర్టు తీర్పు వెలువరించే అవకాశముంది! సీబీఐ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసింది. అరెస్టును ఢిల్లీ హైకోర్టు సమర్థించగా, ఆయన సుప్రీంను ఆశ్రయించారు.

కోటాలో మరో నీట్ విద్యార్థి ఆత్మహత్య

కోటా: రాజస్థాన్‌లోని కోటాలో మరో నీట్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యూపీలోని మథుర జిల్లా బార్సనాకు చెందిన పరశురామ్ (21) బుధవారం తాను ఉంటున్న రూమ్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు జవహర్ నగర్ పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా పరశురామ్ తండ్రి మాట్లాడుతూ తన కుమారుడు మూడేండ్లుగా నీట్ కోసం కోటాలో శిక్షణ తీసుకుంటున్నాడన్నారు. గత ఏడాది పరీక్షలో 647 మార్కులు సాధించాడని, అయితే నీట్ వివాదం కారణంగా మనస్తాపం చెందాడని చెప్పారు.

నడిరోడ్డుపై లైంగిక దాడి

మధ్యప్రదేశ్‌లో దారుణం

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిన్‌లో దారుణం జరిగింది. ఓ మహిళకు మద్యం తాగించి నడిరోడ్డుపై లైంగిక దాడికి పాల్పడ్డాడు ఒక వ్యక్తి. బుధవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిందితుడు బాధిత మహిళను వివాహం చేసుకుంటానని నమ్మించి అత్యాచారానికి పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. లైంగిక దాడి తర్వాత ఈ విషయం బయటకు చెప్తే చంపేస్తానని బాధితురాలిని బెదిరించి నిందితుడు పారిపోయాడు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారడంతో పోలీసులు స్పందించి అతడిని అరెస్టు చేశారు.



పిల్లల మృతదేహాల్ని భుజాలపై మోసుకుంటూ..

15 కిలోమీటర్లు నడిచిన తల్లిదండ్రులు.. • మహారాష్ట్రలో ఘటన

ముంబై, సెప్టెంబర్ 5: పదేండ్ల లోపు ఇద్దరు మగ పిల్లలు. అనారోగ్యంతో దవాఖానలో చనిపోగా.. పుట్టెడు శోకంలో ఉన్న ఆ పిల్లల తల్లిదండ్రుల గోడు పట్టించుకునే నాథుడే లేడు. దవాఖాన సిబ్బంది కనీసం అంబులెన్స్ కూడా ఏర్పాటుచేయకపోవటంతో, పిల్లల మృతదేహాల్ని వారి తల్లిదండ్రులు భుజాలపై మోసుకెళ్లారు. గడ్చిరోలి నుంచి 15 కిలోమీటర్ల దూరంలోని పట్టిగావ్ గ్రామానికి వారు నడుచుకుంటూ వెళ్తున్న వీడియో ఒకటి వెలుగులోకి వచ్చింది. డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఇంచార్జ్ మంత్రిగా ఉన్న గడ్చిరోలిలో ఈ ఘటన చోటుచేసుకుందని విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

శాంతి చర్చలకు పుతిన్ పచ్చజెండా

భారత్ సహా మూడు దేశాలు మధ్యవర్తిత్వం చేయగలవని వెల్లడి

మాస్కో, సెప్టెంబర్ 5: ఉక్రెయిన్‌తో రెండేళ్లకు పైగా యుద్ధం సాగిస్తున్న రష్యా తాజాగా శాంతి చర్చలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉక్రెయిన్ సంక్షోభంపై తాము భారత్ సహా చైనా, బ్రెజిల్ దేశాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్టు ఆ దేశ అధ్యక్షుడు పుతిన్ గురువారం తెలిపారు. ఈ మూడు దేశాలు ఈ సంక్షోభ నివారణకు చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేస్తున్నాయని, మాస్కో-కీవ్ మధ్య శాంతియుత చర్చలకు అవి మధ్యవర్తిత్వం వహించగలవని పుతిన్ తాజా ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. వ్లాడివోస్టోక్‌లో జరిగిన ఈస్టర్న్ ఎకనమిక్ ఫోరమ్ (ఈఈఎఫ్) ప్లీనరీ సెషన్‌కు హాజరైన ఆయన మాట్లాడుతూ 'ప్రస్తుత సంక్షోభంపై చర్చలు జరపాలని ఒకవేళ ఉక్రెయిన్ కోరుకుంటే దానికి నేను సిద్ధమే' అని శాంతి చర్చలకు తన సమ్మతి తెలిపారు. కాగా, రెండు వారాల క్రితం భారత ప్రధాని నరేంద్ర మోదీ ఉక్రెయిన్‌లో పర్యటించి ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో చర్చలు జరిపిన అనంతరం పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు.

అప్పటిదాకా సైలెంట్‌గా ఉంటే మంచిది!

హసీనాకు బంగ్లా తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ యూనస్ హెచ్చరిక

ఢాకా: హింస ప్రజ్వరిల్లడంతో దేశం నుంచి పారిపోయి భారత్‌లో తలదాచుకున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ మహమ్మద్ యూనస్ హెచ్చరికలు జారీ చేశారు. దేశం నుంచి పారిపోయి ఇక్కడ తలదాచుకుంటూ ప్రకటనలు చేయడం పట్ల మండిపడ్డారు. భారత్ నుంచి ఆమె రాజకీయ వ్యాఖ్యలు చేయడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని, అది ఇరు దేశాలకు ఇబ్బంది కలిగిస్తుందని అన్నారు. ఆమెను తమకు అప్పగించాలని భారత్‌ను ఢాకా కోరేవరకు ఆమె మౌనంగా ఉండాలని హెచ్చరించారు. ఆయన పీటీఐకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించారు.

భారత్ ఆ ఆలోచనను విడనాడాలి

బంగ్లాలోని అవామీ లీగ్ పార్టీ తప్ప మిగతావన్నీ ఇస్లామిస్ట్ పార్టీలని, హసీనా లేకపోతే బంగ్లా మరో అఫ్గానిస్థాన్‌లా మారిపోతుందన్న ఆలోచనను భారత్ విడనాడాలని యూనస్ అన్నారు. హసీనా భారత్‌లో ఆశ్రయం పొందడంతో ఏ ఒక్కరూ సౌకర్యంగా లేరని, అందుకే తాము ఆమెను భారత్ నుంచి రప్పించడానికి ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు.

రైతులకు త్వరలో డిజిటల్ ఐడీలు

- ఆధార్ తరహాలో జారీ చేయనున్న కేంద్రం
- మూడేండ్లలో 11 కోట్ల మందికి మంజూరు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: దేశంలోని 11 కోట్ల మంది రైతులకు ఆధార్ తరహాలో డిజిటల్ ఐడీలు జారీచేయాలని కేంద్రం నిర్ణయించింది. రైతులను సాధికారులను చేసేందుకు వచ్చే మూడు ఆర్థిక సంవత్సరాలలో ఈ కార్డులను జారీచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. అగ్రిస్టాక్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అందజేసే సేవలు, పథకాలను క్రమబద్ధం చేసేందుకు డిజిటల్ ఐడీలను ఇవ్వనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆరు కోట్ల మందికి, వచ్చే ఆర్థిక సంవత్సరం మూడు కోట్ల మందికి, ఆ తరువాత ఏడాది రెండు కోట్లమందికి డిజిటల్ ఐడీలను జారీచేయనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రప్రభుత్వాలు/కేంద్రపాలిత ప్రాంతాలు ఈ ఐడీలను సృష్టించి, నిర్వహిస్తాయని పేర్కొంది. రైతుల భూమి రికార్డులు, వారి పశుసంపద, పంటల సాగు, వారికి లభించే సదుపాయాలకు ఐడీలను అనుసంధానం చేస్తారని వివరించింది. త్వరలో దేశవ్యాప్తంగా పంటల సర్వేను ప్రారంభించనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 400 జిల్లాల్లో, వచ్చే ఆర్థిక సంవత్సరంలో మిగిలిన జిల్లాల్లో డిజిటల్ సర్వే పూర్తిచేస్తామని పేర్కొంది.

ఇక 'ఇండియా' సైజ్‌లో దుస్తులు

త్వరలో మన శరీరాలకు తగ్గట్టు ప్రామాణిక కొలతల రూపకల్పన

- యూఎస్, యూకే సైజ్‌లకు చెల్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: భారత్‌లో త్వరలోనే 'ఇండియాసైజ్'లో దుస్తులు లభించనున్నాయి. ఇందుకోసం కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ కొత్త ప్రాజెక్టును చేపట్టనుంది. ఈ విషయాన్ని గురువారం ఢిల్లీలో కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ ప్రకటించారు. ఇప్పటివరకు భారత్‌లో దుస్తులు అన్నీ యూఎస్ లేదా యూకే సైజ్‌లలోనే లభిస్తున్నాయి. అక్కడి ప్రజల శరీరాలను ప్రామాణికంగా తీసుకొని రూపొందించిన కొలతలు ఇవి. ఈ దుస్తులు భారతీయులు ధరించేటప్పుడు కొన్నిసార్లు సరిగ్గా సరిపోవు. పాశ్చాత్యుల శరీర కొలతలు భారతీయులతో పోలిస్తే కొంత భిన్నంగా ఉండటమే ఇందుకు కారణం. ఈ సమస్యకు 'ఇండియా సైజ్' ప్రాజెక్టు పరిష్కారం చూపిస్తుందని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. భారతీయుల శరీరాలకు తగ్గట్టుగా కొత్త ప్రామాణిక కొలతలను రూపొందించనున్నట్టు ఆయన చెప్పారు. కాగా,దుస్తుల డిజైన్‌ల తయారీ కోసం టెక్స్‌టైల్స్ శాఖ, ఎన్ఐఎఫ్‌టీ కలిసి రూపొందించిన ఏఐ ఆధారిత 'విజన్‌నెక్ట్స్' పోర్టల్‌ను గురువారం గిరిరాజ్ సింగ్ ప్రారంభించారు.




రోబోలూ అబద్ధాలు ఆడతాయి!

న్యూఢిల్లీ: రోబోలు అబద్ధాలు ఆడగలవట. మనల్ని మోసం కూడా చేయగలవట. మనిషి మనుగడకే సవాల్ విసురుతున్న తాజా అధ్యయన వివరాలను అమెరికాకు చెందిన జార్జ్ మాసన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు వెల్లడించారు. కృత్రిమ మేధస్సు మరింత వృద్ధి చెందుతున్న తరుణంలో రోబోలు మనిషిలా ప్రవర్తిస్తాయని తెలిపారు. ప్రస్తుతం చాట్‌బాట్స్ కొన్ని సందర్భాల్లో మనిషిని తప్పుదోవ పట్టిస్తున్నాయని ఉదహరిస్తున్నారు. ఇలాంటి మోసపూరిత కార్యకలాపాల నుంచి మనం కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు.

45 నిమిషాల్లోనే డీఎన్‌ఏ టెస్టు



న్యూయార్క్, సెప్టెంబర్ 5: లైంగిక దాడి కేసుల విచారణలో కీలకమైన డీఎన్ఏ పరీక్షను కేవలం 45 నిమిషాల్లోనే జరిపే కొత్త ఫోరెన్సిక్ సాంకేతికతను పరిశోధకులు అభివృద్ధి చేశారు. దీని ద్వారా అధునాతన ల్యాబ్ సదుపాయం అవసరం లేకుండానే డీఎన్ఏ పరీక్షను చేయవచ్చని పరిశోధక బృందంలో ఒకరైన మహమ్మద్ ఎల్సాయెద్ తెలిపారు. లైంగిక దాడి జరిగినప్పుడు నిందితులను గుర్తించేందుకు, నేరం రుజువు చేసేందుకు డీఎన్ఏ పరీక్ష కీలకమైన ఆధారంగా ఉంటుంది. ఇందుకోసం ముందు బాధితుల శరీరం నుంచి డీఎన్ఏ నమూనాలను సేకరించి, ల్యాబ్‌కు పంపిస్తారు. ల్యాబ్‌లో నిపుణులు చాలా క్లిష్టమైన ప్రక్రియ ద్వారా బాధితుల, ముద్దాయి డీఎన్ఏ నమూనాలను వేరు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ముద్దాయి డీఎన్ఏను విశ్లేషించే వీలు ఉంటుంది. ఈ ప్రక్రియకు కొన్ని రోజుల సమయం పడుతుంది. తాము అభివృద్ధి చేసిన కొత్త సాంకేతికతతో కేవలం 45 నిమిషాల్లోనే డీఎన్ఏ నమూనాలను వేరు చేసి, పరీక్షించే వీలు ఉంటుందని మహమ్మద్ ఎల్సాయెద్ తెలిపారు. సేకరించిన శాంపిల్ నుంచి ఇద్దరు వ్యక్తుల డీఎన్ఏను తమ కొత్త సాంకేతికత ద్వారా డిజిటల్ మైక్రోఫ్లూయిడిక్స్‌ను ఉపయోగించి వేగంగా వేరు చేయవచ్చని చెప్పారు. ఇందుకు అధునాతన ల్యాబ్ అవసరం కూడా లేదని తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు 'అడ్వాన్స్‌డ్ సైన్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.



ఆపద వస్తే వయసు రివర్స్!

న్యూయార్క్: మనుషుల వయసును రివర్స్ చేయడానికి అనేక పరిశోధనలు జరుగుతున్నా ఫలితం మాత్రం శూన్యం. కానీ, ఓ సముద్ర జీవికి మాత్రం వయసును రివర్స్ చేసుకునే లక్షణాన్ని ప్రకృతే ఇచ్చినట్టు పరిశోధకులు గుర్తించారు. అట్లాంటిక్ కోంబ్ జెల్లీ సముద్ర జీవిలో ఈ అరుదైన లక్షణం ఉన్నట్టు తేల్చారు. దీనిని 'సీ వాల్నట్' అని కూడా పిలుస్తారు. గాయపడినప్పుడు, ఆహారం లభించడం కష్టమై ప్రాణానికే ముప్పు వాటిల్లినప్పుడు ఇవి వాటి శరీరాన్ని లార్వా దశకు మార్చగలవని పరిశోధకులు గుర్తించారు.

ప్రపంచంలోనే తొలి న్యూక్లియర్ క్లాక్

- అభివృద్ధి చేసిన అమెరికన్ శాస్త్రవేత్తలు
- ఇక మరింత కచ్చితత్వంతో సమయం



న్యూయార్క్, సెప్టెంబర్ 5: ప్రపంచంలోనే తొలి న్యూక్లియర్ క్లాక్‌ను అమెరికాకు చెందిన శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఈ గడియారం ద్వారా అత్యంత కచ్చితత్వంతో సమయాన్ని గుర్తించవచ్చు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో బౌల్డర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్టాండర్డ్స్ అండ్ టెక్నాలజీకి చెందిన శాస్త్రవేత్తలు కలిసి అభివృద్ధి చేసిన ఈ గడియారానికి సంబంధించిన వివరాలు 'నేచర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. పరమాణువు కేంద్రకం నుంచి వచ్చే సిగ్నల్స్ ద్వారా ఈ గడియారం పని చేస్తుంది. అధికారికంగా అంతర్జాతీయ సమయాన్ని చెప్పే ప్రస్తుత అటామిక్ గడియారాల కంటే ఈ న్యూక్లియర్ గడియారం మరింత కచ్చితత్వంతో సమయాన్ని చెప్తుంది. భవిష్యత్తులో అటామిక్ గడియారాలను న్యూక్లియర్ గడియారాలు భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. జీపీఎస్ వ్యవస్థలు మరింత కచ్చితత్వంతో పని చేయడానికి, ఇంటర్నెట్ వేగం పెరగడానికి, డిజిటల్ సమాచార వ్యవస్థల భద్రతకు, శాస్త్ర పరిశోధనలకు ఈ గడియారం కీలకంగా మారబోతున్నదని తెలిపారు.

“ హూలాలా.. అనేద్దామా

జిమ్‌లు, ఫిట్‌నెస్ సెంటర్లకు వెళ్లలేనివారు ‘హూలా హూప్’ వెంట పడుతున్నారు. ఇండ్లలోనే ‘హూలా’లా అంటూ.. ‘హూపింగ్’ చేస్తున్నారు. సరదాగా.. ఉల్లాసంగా వ్యాయామం చేస్తూ, శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆనందాన్నీ పొందుతున్నారు. ఇందుకోసం యూట్యూబ్‌తోపాటు సామాజిక మాధ్యమాల్లో ‘హూలా హూప్’ వీడియోలను తెగ చూసేస్తున్నారు. తమ ‘హూపింగ్’నూ సోషల్ మీడియాల్లో పోస్ట్ చేస్తూ, ఈ త్రోబ్యాక్ ఎక్సర్‌సైజ్‌పై అవగాహన కల్పిస్తున్నారు. ఈ ‘హూలా హూప్’ను నిన్న మొన్నటిదాకా పిల్లల ఆటగానే భావించినా, ఇప్పుడు మేలైన ఎక్సర్‌సైజ్‌గా గుర్తిస్తున్నారు. నవ్వుతూ, తుళ్లుతూ ఈ వ్యాయామం చేయడం వల్ల అలసట రాదు. అందుకోసమే ఎక్కువ సమయం ఈ ఎక్సర్‌సైజ్ చేసే అవకాశం ఉంటుంది.



ఇదే.. ‘హూలా హూప్’

తేలికగా ఉండే పెద్ద రింగు(హూప్)ను నడుముకు తగిలించుకొని, శరీరాన్ని గుండ్రంగా తిప్పడమే ‘హూలా హూప్’. ఈ రింగును కింద పడనీయకుండా, వీలైనంత ఎక్కువ సమయం నడుముతో తిప్పుతూ ఉండాలి. దీనివల్ల శరీరం మొత్తానికీ కావాల్సినంత వ్యాయామం దొరకడంతోపాటు ఏరోబిక్స్ చేసిన ఫలితం దక్కుతుంది.

ప్రయోజనాలు

- కనీసం 30 నిమిషాలు ‘హూలా హూప్’ చేస్తే 300 కేలరీలు ఖర్చవుతాయి.
- రోజూ కనీసం 20 నిమిషాలపాటు ఈ వ్యాయామం చేస్తే గుండెకు మంచిది.
- కాళ్లు, పిక్కలు, నడుము కండరాలు బిగుతుగా తయారవుతాయి. వెన్నుపూస బలపడుతుంది.
- ఈ ఎక్సర్‌సైజ్ వల్ల శరీరంలో విడుదలయ్యే ఎండార్ఫిన్లు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి.

గూగుల్ మెసేజెస్‌లో గ్రూప్ చాట్



నోటి మాట కన్నా.. ఒక టెక్ట్స్ మెసేజ్‌కే విలువ ఎక్కువ! అనిపిస్తుంది. నేటి డిజిటల్ లైఫ్‌లో కమ్యూనికేషన్ అంతా సందేశాల చుట్టూ తిరుగుతున్నది. ముఖ్యంగా మొబైల్ మాధ్యమంగా సాగే సందేశాల పరంపరలో ఎన్నో కార్యాలు నిర్విఘ్నంగా సాగిపోతున్నాయి. అందుకే వాట్సాప్‌లోనే కాకుండా ఆండ్రాయిడ్ ఫోన్లలో బిల్ట్ ఇన్‌గా ఉండే ‘మెసేజెస్’ నుంచి కూడా సందేశాలు పంపుతుంటాం. ఇంటర్నెట్ అందుబాటులో లేనప్పుడో, వాట్సాప్ చూస్తారో లేదో అన్న సందేహం వచ్చినప్పుడో ‘మెసేజెస్’ ఎంచుకుంటాం. ఈ నేపథ్యంలోనే గూగుల్ ‘మెసేజెస్’లో కొత్త అప్‌డేట్‌ని తీసుకొచ్చింది. అదే ‘సెర్చ్ ఫర్ గ్రూప్ చాట్స్’. అంటే.. ఒకే మెసేజ్‌ను ఎక్కువమందికి పంపేందుకు ‘స్టార్ట్ చాట్’లోని ‘క్రియేట్ గ్రూప్’ని వాడుతున్నాం. అంటే.. ఫ్యామిలీ ఒక గ్రూప్, ఫ్రెండ్స్ ఇంకొకటి.. ఇలా పలురకాల గ్రూపులు ఉండొచ్చు. అలాంటప్పుడు మీరు టైప్ చేసిన మెసేజ్ ఏ గ్రూపులో పంపాలో సులభంగా తెలుసుకునేందుకు ఓ అప్‌డేట్ వచ్చింది. దీంతో గతంలో మీరు పంపిన ‘గ్రూప్ చాట్స్’ అన్నీ లిస్ట్‌లో కనిపిస్తాయి. అలా మీ మెసేజ్ ఏ గ్రూపులో పంపాలనేది ఇట్టే సెలెక్ట్ చేసుకోవచ్చు. పదేపదే కాంటాక్ట్‌లను సెలెక్ట్ చేసుకుని గ్రూప్‌చాట్‌లో మెసేజ్‌లు పంపనవసరం లేదన్నమాట. గూగుల్ మెసేజెస్‌లోని ఈ సరికొత్త ఫీచర్లను వాడేందుకు యాప్‌ని ప్లే స్టోర్ నుంచి కొత్త వెర్షన్‌కి అప్‌డేట్ చేసుకుంటే సరి.

ఆమె పరుగు ముందు
పేదరికం ఓడిపోయింది..
మానసిక వైకల్యం తోకముడిచింది..



పల్లె పొలిమేర దాటిన ఆమె పరుగు.. రాష్ట్ర స్థాయిని ఏనాడో దాటింది.. జాతీయ స్థాయిలో పతకాలై వర్షించింది.. పారాలింపిక్స్‌లో దేశ పతాకను ఎగురవేసింది. పారిస్‌లో జరుగుతున్న పారాలింపిక్స్‌లో కంచు మోగించిన జీవాంజీ దీప్తిది అందరి లాంటి పరుగు కాదు. పతనం నుంచి పతాకస్థాయికి చేరుకున్న దీప్తి కథ ఇది..



రన్ దీప్తి రన్..

పల్లె దాటి పారిస్‌లో గెలిచి


దీప్తి సొంతూరు వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ. అసలు చిరునామా పేదరికం. తండ్రి యాదగిరి లారీ క్లీనర్. తల్లి ధనలక్ష్మి వ్యవసాయ కూలి. ఈ దంపతులకు తొలిచూలులో పుట్టిన ఆడబిడ్డే దీప్తి. కొన్నాళ్లయ్యాక కూతురు బుద్ధిమాంద్యంతో జన్మించిందని తెలిసింది. కుమిలి కుమిలి ఏడ్వడం తప్ప ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి ఆ తల్లిదండ్రులది. ఆకలిగా ఉన్నా చెప్పలేనంత అమాయకం ఆ చిట్టితల్లిది. అమ్మరాగానే ఎక్కడున్నా.. చిరుతలా పరుగెత్తుకొచ్చేది. ఆ వేగం అనితరం. దాన్ని గుర్తించే సాహసం కూడా చేయలేకపోయారు ఆమె తల్లిదండ్రులు. గ్రామంలోని ఎర్రబెల్లి రామ్మోహన్‌రావుకు చెందిన ఆర్‌డీఎఫ్ పాఠశాలలో చదివేది. ఆమె వేగానికి పాఠశాల ప్రాంగణం చిన్నబోయింది. ఇంటినుంచి బడికీ, బడి నుంచి ఇంటికీ ఉడుత పిల్లలా రయ్యిన దూసుకెళ్లేది. ఆమె పరుగులో ఏదో శక్తి ఉందని బడిలో బయటపడింది. రామ్మోహన్‌రావు సహకారంతో పోటీల్లో పాల్గొంటూ ఉండేది. జిల్లా స్థాయిలో దీప్తి ప్రదర్శన అంతర్జాతీయ అథ్లెటిక్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్ దృష్టిలో పడింది. ఇంకేముంది.. మనోవైకల్యాన్ని జయించే తారక మంత్రం ఆయనే దీప్తికి ఉపదేశించాడు. అదే ‘రన్ దీప్తి రన్..’.

గాయాలైనా జాన్తా నై..

నాణ్యమైన శిక్షణ అందిస్తే దీప్తి పరుగు అనేక మైలురాళ్లు దాటుతుందని రమేశ్ నమ్మకం. ఆ విశ్వాసంతోనే ఆమెను హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. వివిధ పోటీల్లో పాల్గొనేలా ఆమెను తీర్చిదిద్దారు. అన్నీ తానై అండగా నిలిచారు. గురువుగా ఆయన ఎంతచేసినా.. కుటుంబ ప్రోత్సాహం లేకపోతే దీప్తి ఊరుబాట పట్టాల్సి వచ్చేది. పరుగులో పతకాలు పండిస్తున్న కూతురు కోసం ఎంతకైనా ధైర్యం చేయాలనుకున్నాడు యాదగిరి. తనకున్న ఎకరం భూమి అమ్మేశాడు. కూతురుకు ఏ కష్టం రాకుండా చూసుకున్నాడు. మరోవైపు కఠిన శిక్షణలో దీప్తి రాటుదేలింది. ఒళ్లునొప్పులను కూడా గుర్తించలేనంత అమాయకత్వం ఆమెకు వరమే అయింది. శిక్షణ సమయంలో కింద పడ్డా, గాయాలైనా, కాళ్లు పట్టేసినా.. మరుసటి రోజుకు మళ్లీ మైదానంలో పరుగులు తీస్తూ కనిపించేది.

పతకాల వేట..

అథ్లెటిక్స్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచడంతో 2016లో పాఠశాల స్థాయిలో సాయ్ శిక్షణకు ఎంపికై, అక్కడే చదువుకుంది దీప్తి. అదే ఏడాది కరీంనగర్‌లో జరిగిన జూనియర్ సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100, 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం సాధించింది. తొర్రూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతూ పారాలింపిక్స్‌లో పతకమే లక్ష్యంగా సాధన చేసింది. 2017లో కేరళలో జరిగిన సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100, 200 మీటర్లలో పసిడి పతకం కైవసం చేసుకుంది. ఇలా జాతీయ స్థాయిలో పాల్గొన్న ప్రతి ఈవెంట్‌లో మెడల్ సాధిస్తూ... రోల్ మాడల్‌గా నిలిచింది. అంతర్జాతీయ స్థాయిలో హాంగ్‌కాంగ్‌లో జరిగిన ఏషియన్ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 200 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం గెలుచుకుంది. మిడ్లే రిలే పోటీల్లో రజతం, మొరాకోలో జరిగిన పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించి.. తన పరుగు ఆగేది కాదని చాటిచెప్పింది దీప్తి.



ప్రోత్సహిస్తే అద్భుతాలే..

ఇదే జోరులో 2022 సెప్టెంబర్‌లో వరల్డ్ పారా అథ్లెటిక్స్‌లో 400 మీటర్ల పోటీల్లో దీప్తి గోల్డ్ మెడల్ సాధించింది. అదే ఏడాది నవంబర్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్‌లో 200, 400 మీటర్లలో బంగారు పతకాలు గెలిచింది. ఇలా అంతర్జాతీయ ఈవెంట్లలోనూ దేదీప్యమానంగా వెలిగిపోయింది దీప్తి. 2024 మేలో జపాన్ వేదికగా జరిగిన వరల్డ్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 400 మీటర్లలో బంగారు పతకం సాధించింది. ఈ వేగాన్ని కొనసాగిస్తూ తాజా పారాలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచి శభాష్ అనిపించుకుంది. ఆమె ప్రతిభను మెచ్చుకుంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోపాటు రాష్ట్ర ప్రముఖులు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా దీప్తిని అభినందించారు. కటిక పేదరికంలో జన్మించిన దీప్తి పట్టుదలతో సాధన చేసి పతకాన్ని సాధించి దేశానికి పేరు తీసుకురావడం గర్వకారణమని కొనియాడారు. పారిస్ గడ్డపై తెలంగాణ ఉనికిని చాటిన ఈ పరుగుల రాణికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిస్తే.. మరిన్ని అద్భుతాలు ఆవిష్కృతం అవుతాయనడంలో సందేహం లేదు.

... మచ్చ సమ్మయ్య
బొమ్మెర రాజ్‌కుమార్

ఆహారంలో ఔషధాలు



స్ట్రాబెర్రీ: అత్యధిక స్థాయిలో యాంటిఆక్సిడెంట్లు లభించే పండ్లలో స్ట్రాబెర్రీలు ముందుంటాయి. ఇవి శరీరంలోకి ప్రవేశించే వ్యాధికారక బ్యాక్టీరియాను నాశనం చేస్తాయి. వీటిలోని పాలీఫినాల్ సమ్మేళనాలు.. ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. స్ట్రాబెర్రీల్లో సమృద్ధిగా దొరికే విటమిన్ సి మూలకాలు.. శరీరంలోని పోషక లోపాలను సవరిస్తాయి. వీటిని తరచుగా తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సినంత శక్తి లభించడంతోపాటు ఆక్సిజన్ స్థాయులూ పెరుగుతాయి.



మామిడి: రుచిలోనే కాదు.. మనిషికి ఆరోగ్యాన్ని ప్రసాదించడంలోనూ మామిడి పండు రారాజే! మామిడి పండ్లలో ‘బీటా కెరోటిన్’ అనే పదార్థం ఉంటుంది. రోగనిరోధక శక్తిని పెంచడంలో ఇది ఎంతో సాయపడుతుంది. ఇందులో ఉండే విటమిన్ ఎ, విటమిన్ సి.. శరీరానికి అనేక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి. వీటిని తినడం వల్ల శరీరంలో ఆక్సిజన్ లెవెల్స్ కూడా పెరుగుతాయి.

అవే జోల పాటలు

పిల్లల ఆలనాపాలనలో వారికి నిండైన నిద్ర ఉండేలా చూసుకోవడం ప్రధానం. చంటిపాపలు కంటినిండా పడుకుంటే బాగా ఎదుగుతారు. నాణ్యమైన నిద్ర పిల్లల్లో రోగ నిరోధక శక్తిని పెంచుతుందని నిపుణుల మాట. పిల్లలకు సరైన నిద్ర అందించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకుందాం..

అన్ని పనులూ షెడ్యూల్ ప్రకారమే చేసుకుంటాం. అలాగే పిల్లల నిద్రకూ పక్కాగా వేళలు పాటించాలి. ప్రతిరోజూ ఒకే సమయానికి వారిని నిద్రపుచ్చడం సరైన పద్ధతి.

జోల పాడటం వల్ల పిల్లలు త్వరగా నిద్రలోకి జారుకుంటారు. పాటలు పాడే అలవాటు లేకుంటే.. పిల్లలు నిద్రపోయే వేళకు శ్రావ్యమైన సంగీతం ప్లే చేయండి. మంచి కీర్తనలు, సితార్, వేణువు వంటి వాద్య సంగీతం వినిపించండి. వాళ్లు నిద్రపోగానే.. సంగీతం ఆపేయండి. అంతేకానీ, డ్రమ్స్ మోతలు ఉండే పాటలు పెట్టి ఆ చిట్టి బుర్రను కంగారు పెట్టకండి. పిల్లలు నిద్రలో ఉన్నప్పుడు.. మిక్సీ పెట్టడం, పెద్ద సౌండ్‌తో టీవీ పెట్టడం లాంటివి చేయకండి.



ఈ తరం పిల్లలకు సెల్‌ఫోనే కథలు చెప్పే సాధనంగా మారింది. పడుకునే ముందు వారికి సెల్‌ఫోన్ ఇచ్చేసి.. పేరెంట్స్ ఇంటి పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. ఛోటా భీమ్, లిటిల్ కృష్ణ తరహా కార్టూన్ సీరియల్స్ కాలక్షేపానికి చూడటం మంచిదే! కానీ, నిద్రకు ముందు అవి చూపించడం కరెక్ట్ కాదు!

పిల్లలు పడుకోవడానికి అరగంట ముందు తల్లిదండ్రుల్లో ఎవరైనా వారికి సమయం కేటాయించాలి. ఓ అరగంట నీతికథలు, పద్యాలు చెప్పడం అలవాటు చేసుకోవాలి. కథలు వినడం వల్ల పిల్లల్లో ఊహాశక్తి పెరుగుతుంది. ‘అనగనగా ఒక కాకి..’ అనగానే పిల్లలు కాకిని ఊహించుకుంటారు. ‘చెట్టు కొమ్మపై వాలింది’.. అనగానే చెట్టు మీద కాకి ఉన్నట్టుగా భావిస్తారు. ఇలా పిల్లల్లో ఊహాశక్తిని పెంచడంలో కథలు కీలక భూమిక పోషిస్తాయి.

పిల్లలను పడుకోబెట్టడానికి రెండు గంటల ముందే వారికి ఆహారం అందివ్వాలి. పసిపిల్లలైతే నలభై నిమిషాల ముందు పాలు పట్టాలి. దీనివల్ల పిల్లలకు గ్యాస్ సమస్యలు రావు. ఆహారం తీసుకున్న వెంటనే నిద్రిస్తే.. జీర్ణక్రియ సమస్యలు ఎదురవుతాయి.



ఎన్ని సౌందర్య ఉత్పత్తులు వాడినా, మరెన్ని ఆరోగ్య సూత్రాలు పాటించినా.. ముఖంపై నల్లటి మచ్చలు ఏర్పడుతుంటాయి. కొందరిలో ఈ సమస్య తక్కువగా ఉంటే.. మరికొందరిలో తీవ్రంగా ఉంటుంది. ముఖంపై కనిపించే మచ్చలు, ముడతలు వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. ఈ సమస్యకు మేలైన పరిష్కారం గువా షా! జపనీయులు వాడే ఈ బ్యూటీ స్టోన్‌తో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయట. గువా షాతో మసాజ్ చేయడం వల్ల అనేక లాభాలు ఉన్నాయని సౌందర్య నిపుణులు దీనిని సిఫారసు చేస్తున్నారు.

జపాన్ రాయితో చెక్కిన శిల్పంలా!

- గువా షా స్టోన్‌తో మృదువుగా మర్దనా చేయడం వల్ల ముఖంపై రక్తప్రసరణ మెరుగుపడుతుంది. దీంతో చర్మం టైట్‌గా మారి యవ్వనంగా కనిపిస్తారు. ఈ రాయితో రెగ్యులర్‌గా మసాజ్ చేసుకుంటే ముఖంపై ముడతలు తగ్గుతాయి.
- ఈ స్టోన్ మసాజ్‌తో చర్మంలో కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. ముఖంపై ఏర్పడిన వాపులు కూడా తగ్గుతాయి. చర్మంపై ఉన్న టాక్సిన్స్ దూరమవుతాయి.
- రాతితో మర్దనా చేయడంతో కండరాలపై ఒత్తిడి తగ్గుతుంది. చర్మం కాంతిమంతంగా ఆకర్షణీయంగా మారుతుంది. మొటిమలు, మచ్చలు తగ్గుతాయి.
- సరిపడినంత నిద్ర లేకపోవడం, ఒత్తిడి, మొబైల్ ఫోన్లను ఎక్కువగా చూడటం వల్ల కంటి కింద నల్లటి వలయాలు వస్తాయి. ఈ స్టోన్‌తో మర్దనా చేయడం వల్ల నల్లటి వలయాలు తగ్గుతాయి. అయితే, కళ్ల కింద చర్మం చాలా మృదువుగా ఉంటుంది. కాబట్టి మసాజ్ చేసే సమయంలో జాగ్రత్త తప్పనిసరి.



మసాజ్ ఇలా..

మీ చర్మానికి సరిపడే ఏదైనా సీరమ్‌ను ముందుగా ముఖానికి అప్లయ్ చేసుకోవాలి. తర్వాత శుభ్రంగా కడిగిన గువా షా స్టోన్‌తో మెల్లగా, మృదువుగా మసాజ్ చేయాలి. ముఖంలోని కింది భాగం నుంచి పైకి నిదానంగా రుద్దుతూ ఉండాలి.

చిన్ననాటి కల
తల్లయ్యాక నెరవేరిందిలా!

శారీరకంగా, మానసికంగా ఎంతో బలవంతులైతేనే ఇంగ్లిష్ చానెల్ ఈదాలని కలలుకంటారు. ఆ సాహసానికి పూనుకుంటారు. సముద్రంలో 33 కిలోమీటర్ల దూరం ఈదడం అంటే మాటలా? మహారాష్ట్రలోని నాసిక్‌లో నివసిస్తున్న 33 ఏండ్ల తన్వీ దేవ్‌రె ఇంగ్లిష్ చానెల్ ఈది అబ్బురపరిచింది. తన్వికి చిన్నప్పటి నుంచి స్విమ్మింగ్ అంటే ఇష్టం. పొద్దునే లేచి అలసిపోయేదాకా స్విమ్మింగ్ చేసిన తర్వాతే బడికి వెళ్లేది. బడి నుంచి వచ్చాక కూడా మళ్లీ ఈత కొలనులోనే కాలక్షేపం చేసేది. ఎంత ఈతకొట్టినా ఆనందం తప్ప అలసట అనిపించేది కాదు. తన్వి తొమ్మిదో తరగతిలో ఉండగా ‘ఇక ఈత చాలు.. చదువుపై దృష్టి పెట్టు’ అని ఆమె తల్లిదండ్రులు హుకుం జారీ చేశారు. ఇంకేముంది ఈతకు బై చెప్పింది. చదువు, ఉద్యోగం, సంసారం, పిల్లలు ఇలా వరుస బాధ్యతలతో ఆమె జీవితం క్షణం తీరిక లేకుండా మారిపోయింది. ఓరోజు కోల్పోయిన సంతోషాలు, దూరమైన ఈత కొలను ఆమెకు గుర్తుకొచ్చాయి. భర్తతో మాట్లాడుతూ ‘నాకు ఇంగ్లిష్ చానెల్‌ని ఈదాలన్నది చిన్నప్పటి కోరిక. ఇంగ్లిష్ చానెల్‌ని ఈదిన ఓ వ్యక్తి విజయగాథ పేపర్‌లో చదివిన తర్వాత నేనూ దానిని ఈదాలనుకున్నాను’ అని చెప్పింది. ‘ఇంగ్లండ్ నుంచి ఫ్రాన్స్‌కి ఈదడం ఆషామాషీ వ్యవహారం కాదు. 33 కిలోమీటర్లు ఈదాలంటే ఎంత సామర్థ్యం ఉండాలి!? అంత ఈజీ అనుకున్నావా!?’ అంటూ ఆశ్చర్యపోయాడు. తన్వి మాత్రం పట్టు వదల్లేదు. ఆయనా మెత్తబడ్డాడు. ప్రాక్టీస్ మొదలుపెట్టింది. తెల్లవారుజామున 3 గంటలకే నిద్రలేచేది. నాలుగయ్యేసరికి ఈత కొలనుకు వెళ్లేది. మొదటి రోజు 20 నిమిషాలు ఈతకొట్టింది. రోజులు గడిచే కొద్దీ స్విమ్మింగ్‌పూల్‌లో గడిపే సమయం పెరుగుతూ పోయింది. ఏకంగా ఏడెనిమిది గంటలపాటు ఈత కొలనులోనే గడిపే స్థాయికి చేరుకుంది. రెండేండ్లపాటు తన సాధన కొనసాగించింది తన్వి. శారీరక సామర్థ్యాన్ని పెంచుకొని తన లక్ష్యాన్ని ఈదగలనన్న నమ్మకాన్ని సాధించింది.





ఆ రోజు రానే వచ్చింది. ఇంగ్లిష్ చానెల్‌లో ఈతకు ఉపక్రమించింది. ప్రశాంతంగా ఈదసాగింది. ఇంతలో వాతావరణ పరిస్థితులు మారిపోయాయి. అలలు ఎగిసిపడటం మొదలైంది. కెరటాలు వెనక్కి నెట్టేయడం వల్ల ఫ్రాన్స్ తీరాన్ని చేరుకోవడానికి మరో పది కిలోమీటర్లు అదనంగా ఈదాల్సి వచ్చింది. ఇంగ్లిష్ చానెల్ వెడల్పు 33 కిలోమీటర్లు అయినా 42 కిలోమీటర్లూ ఈదడం ఆమెకు అనివార్యమైంది. 17 గంటల 42 నిమిషాలపాటు సుదీర్ఘంగా స్విమ్మింగ్ చేసి తీరాన్ని చేరి వారెవ్వా! అనిపించుకుంది తన్వి. కలలు కనడం సహజమే! కాలం దాటిపోయిందని వాటిని విస్మరిస్తారు చాలామంది. జీవితకాలంలో ఎప్పుడైనా వాటిని సాధించొచ్చని నిరూపించిన తన్వి దేవ్‌రె అందరికీ ఆదర్శం!

ప్రారంభ లాభాలు ఆవిరి

ముంబై, సెప్టెంబర్ 5: స్టాక్ మార్కెట్ల ప్రారంభ లాభాలు ఆవిరైపోయాయి. బ్లూచిప్ సంస్థల షేర్లు నష్టపోవడం, గ్లోబల్ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో చివర్లో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

ఇ-టెండరు కోరుతూ ప్రకటన (http://ireps.gov.in ద్వారా) PUB/0878

దిగువ పనుల కోసం సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, సికింద్రాబాద్ వారు సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండర్లు కోరుతున్నారు.

క్ర.సం.1. టెండరు కోరుతూ ప్రకటన నం. C/E.29/TRD/SC/28/2024-2025, పని పేరు: టెండరు నం. C/E.29/TRD/SC/28/2024-2025, తేది: 22-08-2024. (1) సికింద్రాబాద్ డివిజన్‌లోని WD-KZJ సెక్షన్‌లో TRD డిపోలలో మౌలిక సదుపాయాల పెంపుదల (2) సికింద్రాబాద్ డివిజన్‌లో BPQ-KI సెక్షన్‌లో TRD డిపోలలో మౌలిక సదుపాయాల పెంపుదల (3) సికింద్రాబాద్ డివిజన్‌లో KZJ వద్ద డివిజనల్ ట్రైనింగ్ సెంటర్‌లో మౌలిక సదుపాయల పెంపుదల. **వివరాలు: ప్రకటిత వ్యయం:** రూ. 42,68,084.39/- **పూర్తి చేయు కాలం:** 3 నెలలు, ముగింపు తేది: 27.09.2024న 15.00 గం.లు.

1) బిడ్ డాక్యుమెంటు మరియు ఇతర వివరాల కొరకు వెబ్‌సైట్ **http:// ireps.gov.in**కు లాగిన్ కాగలరు.
2) టెండరుదార్లు ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనవలెను మరియు మ్యాన్యువల్ ఆఫర్లు పరిశీలించబడవు.
3) టెండరు ఫారం ధర &బయానాను ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా మాత్రమే చెల్లించాల్సిందిగా కాగోరు టెండరుదారులందరు కోరబడుచున్నారు.
4) GSTIN ఐడెంటిఫికేషన్ నెం.లు పొందవల్సిందిగా మరియు తమ ఆఫర్లతో పాటు దాఖలు చేయవల్సిందిగా కాగోరు టెండరుదారులందరు కోరబడుచున్నారు.
5) టెండరు దాఖలుచేయు కాలవ్యవధి యొక్క ప్రారంభ తేదీ వరకు టెండరుదారు ఏదేని సవరణల (ఆన్‌లైన్‌పై మాత్రమే జారీ చెయ్యబడును) కొరకు గమనించగలరు.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ / TRD/సికింద్రాబాద్

ఇ-టెండరు ప్రకటన నం. GNT/E.12 & 13/TrD/2024-25 తేది: 04.09.2024 PUB/0879

దిగువ సంతకందారుచే 30-09-2024న **15.30 గంటల** వరకు క్రింది పనుల కోసం కాంట్రాక్టర్ల నుండి ఇ-టెండర్లు కోరబడుచున్నవి.

క్ర.సం. 01: టెండరు టైటిల్: GNT డివిజన్-2024-2025 సంవత్సరం కొరకు TRD వేలం ప్రణాళిక అంశాలు. టెండరు రిఫరెన్స్ నం. GNT/E.12/TrD/2024-25, తేది: 04.09.2024, **సుమారు విలువ రూ.:** రూ. 1,51,07,423/-, **బయానా రూ.** : రూ. 2,25,600/-. **టెండరు ఫారం ధర (తిరిగి చెల్లించబడదు) రూ.:** లేదు

క్ర.సం. 02: టెండరు టైటిల్: GNT డివిజన్ - TrD డిపోలలో మౌలిక సదుపాయాల పెంపుదల. టెండరు రిఫరెన్స్ నం. GNT/E.13/ TrD/2024-25, తేది: 04.09.2024, **సుమారు విలువ రూ.:** రూ. 30,84,503/-, **బయానా రూ.** : రూ. 61,700/-. **టెండరు ఫారం ధర (తిరిగి చెల్లించబడదు) రూ.:** లేదు

ఇ-బిడ్ల ఆన్‌లైన్ దాఖలుకు చివరి తేది మరియు సమయం: 30.09.2024న 15.30 గం.లవరకు

ఏదేని సవివరమైన సమాచారం కొరకు www.ireps.gov.in వెబ్‌సైట్‌కి 05.09.2024న లేదా అంతకంటే ముందుగా 30.09.2024న 15.030 గంటల వరకు లాగిన్ అవ్వండి. ఏదైనా తదుపరి సమాచారం/సవరణ ఇ-పోర్టల్ www.ireps.gov.in ద్వారా మాత్రమే తెలియజేయబడుతుంది.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ట్రాక్షన్, గుంటూరు

నం. NW/148/WIII/టెండరు ప్రకటన/2024-25 తేది: 05-09-2024 PUB/0882

టెండరు వివరాలు **www.ireps.gov.in** లో అప్‌లోడ్ చేయబడినవి

క్ర.సం. 1. **టెండరు నం.:** T-202425-3-050, **అథారిటీ:** Co-Ord **టెండరు విలువ:** రూ. 9,82,87,048.36, **బయానా:** రూ. 6,41,400.00, **పూర్తిచేయు కాలం:** పన్నెండు నెలలు, **పని వివరణ:** నాగర్‌సోల్ (NSL) గూడ్స్ షెడ్డు వద్ద అన్ని వాతావరణ COP, లైటింగ్ ఏర్పాట్లు, హమాల్ షెడ్డు, CGSR ఆఫీస్, CCTV మొదలైన వాటి యొక్క ఏర్పాట్లు. **టెండరు ఫారం ధర:** రూ. 0/-.

క్ర.సం. 2. **టెండరు నం.:** T-202425-3-050, **పని సారూప్య స్వభావం (50 లక్షల పైన వ్యయం కోసం):** ఏదైనా సివిల్ ఇంజినీరింగ్ పనులు (ట్రాక్ పనులు/జోనల్ పనులు మినహా) .

పై టెండరు ముగింపు తేది: 27-09-2024న **15.00 గంటలు.**

సీనియర్ డివిజనల్ ఇంజినీర్/కో-ఆర్డినేషన్/ నాందేడ్

టెండరు నం. M218-TPC-07 తేది: 04-09-2024 PUB/0883

డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్/ **RYPS**, దక్షిణ మధ్య రైల్వే, వ్యాగన్ వర్క్‌షాప్, గుంటుపల్లి-521241 వారు భారత రాష్ట్రపతి తరపున ఇ-టెండరు కోరుతున్నారు.

పని పేరు: 24 నెలల కాల వ్యవధి కోసం గుంటుపల్లి, వ్యాగన్ వర్క్‌షాప్ వద్ద వ్యాగన్ల యొక్క అన్ని రకాల ట్విన్ పైప్ ఎయిర్ బ్రేక్ సిస్టమ్ యొక్క పునర్నిర్మాణం.

పరిమాణం: టెండరు డాక్యుమెంట్‌లో తెలుపబడినది.

పూర్తిచేయు కాలం: 24 నెలలు

టెండరు విలువ: రూ.97,74,944.32/- (తొంభై ఏడు లక్షల డబ్బై నాలుగు వేల తొమ్మిది వందల నలభై నాలుగు రూపాయల ముప్పై రెండు పైసలు మాత్రమే.

బయానా: రూ. 1,95,500/- (ఒక లక్ష తొంభై ఐదు వేల ఐదు వందల రూపాయలు మాత్రమే.

టెండరు డాక్యుమెంట్ ధర: ఉచితంగా

ఆఫర్ చెల్లుబాటు: తెరిచిన తేదీ నుండి 60 రోజులు.

టెండరు రకం: IRGCC-2022 ద్వారా నిర్వహించబడే పనుల టెండర్

టెండరింగ్ విధానం: ఓపెన్ టెండర్- సింగిల్ ప్యాకెట్

బిడ్ ముగింపు తేది & సమయం: తేది: 30-09-2024న 15.00 గంటలు.

టెండరు డాక్యుమెంట్ మరియు సవరణ: వెబ్‌సైట్ http://www.ireps.gov.in దర్శించండి.

కరస్పాండెన్స్ కొరకు పోస్టల్ చిరునామా: చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్, వ్యాగన్ వర్క్‌షాప్, గుంటుపల్లి-521241.


డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ వ్యాగన్ వర్క్‌షాప్, గుంటుపల్లి
A1131

తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి.

1:1 బోనస్ షేర్లకు సై

ఆమోదించిన రిలయన్స్ బోర్డు • ఏడేండ్ల తర్వాత ఇప్పుడే

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: వాటాదారులకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) వినాయక చవితి పండుగ కానుకను అందించింది. 1:1 బోనస్ షేర్ల జారీకి ఆ సంస్థ బోర్డు గురువారం ఆమోదం తెలిపింది. ఈ మేరకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో రిలయన్స్ పేర్కొన్నది. ప్రస్తుతం షేర్‌హోల్డర్ల వద్ద ఉన్న రూ.10 విలువైన ప్రతీ ఫుల్ పెయిడ్-అప్ ఈక్విటీ షేర్‌కు సమాన విలువలో మరో ఫుల్లీ పెయిడ్-అప్ ఈక్విటీ షేర్‌ను ఉచితంగా ఇచ్చేందుకు తమ కంపెనీ బోర్డు సిఫార్సు చేసినట్టు బిలియనీర్ ముకేశ్ అంబానీ నేతృత్వంలోని ఆర్ఐఎల్ ప్రకటించింది. ప్రస్తుతం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ విలువ రూ.2,987.15 వద్ద ముగిసింది. బుధవారం ముగింపుతో పోల్చితే 1.41 శాతం దిగజారింది.



ఏడేండ్ల తర్వాత..

రిలయన్స్ ఇన్వెస్టర్లకు ఇలా 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు దక్కడం గడిచిన ఏడేండ్లలో ఇదే తొలిసారి. ఇంతకుముందు 2017 సెప్టెంబర్‌లో ఇలాగే 1:1 బోనస్ షేర్లను కంపెనీ ఇష్యూ చేసింది. నాడు కంపెనీ షేర్ ధర దాదాపు రూ.700లుగా ఉన్నది. అంతకు ముందు 2009-10లో వాటాదారులకు 1:1 బోనస్ షేర్లు దక్కాయి. అయితే తొలి బోనస్ 1980-81లో జారీ అయ్యింది. 3:5 నిష్పత్తిలో ఇచ్చారు. ఆ తర్వాత 1983-84లో 6:10తో ప్రకటించారు. 1:1 నిష్పత్తిలో మాత్రం తొలిసారి 1997-98లో జారీ చేశారు. మొత్తంగా రిలయన్స్ ఐపీవో దగ్గర్నుంచి ఇన్వెస్టర్లకు ఇది 6వ బోనస్. ప్రస్తుతం దేశీయ అతిపెద్ద కంపెనీగా రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఉన్న విషయం తెలిసిందే. నిజానికి ఇటీవల నిర్వహించిన కంపెనీ వార్షిక సాధారణ సమావేశంలోనే ఈ 1:1 బోనస్ షేర్ల జారీ ప్రకటన అధికారికంగా వెలువడింది. అయితే తాజాగా జరిగిన బోర్డు సమావేశంలో దానికి ఆమోదముద్ర పడింది. కాగా, ఈ బోనస్ షేర్ల జారీ కోసం రికార్డు తేదీని త్వరలో ప్రకటించనున్నారు. ఇదిలావుంటే కంపెనీ ఆథరైజ్డ్ షేర్ క్యాపిటల్‌ను రూ.15,000 కోట్ల నుంచి రూ.50,000 కోట్లకు పెంచుకోవడానికి కూడా కంపెనీ బోర్డు ఈ సందర్భంగా అనుమతిచ్చింది. దీంతో షేర్ హోల్డర్ల అనుమతిని సంస్థ కోరుతున్నది.



జియో వార్షికోత్సవ ఆఫర్లు

దేశీయ టెలికం రంగ దిగ్గజం రిలయన్స్ జియో.. 8వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం తమ కస్టమర్లకు పలు రిచార్జ్ ప్లాన్లపై ఆఫర్లను ప్రకటించింది. జియో.కామ్ వెబ్‌సైట్ వివరాల ప్రకారం ఈ నెల 5 నుంచి 10వ తేదీ మధ్య ఎవరైతే 3 నెలల ప్లాన్లు, ఏడాది ప్లాన్‌ను రిచార్జ్ చేసుకుంటారో వారికి రూ.700 విలువైన 3 ప్రయోజనాలను అందిస్తున్నట్టు తెలిపింది. వీటిలో 10 ఓటీటీలు, రూ.175 విలువైన 28 రోజుల వ్యాలిడిటీ గల 10జీబీ డాటా ప్యాక్, ఉచిత జొమాటో 3 నెలల గోల్డ్ మెంబర్‌షిప్ ఉన్నాయి. కాగా, రూ.899, రూ.999లతో ఉన్న త్రైమాసిక ప్లాన్లు.. రూ.3,599తో ఉన్న వార్షిక ప్లాన్లకే ఈ ప్రయోజనాలు వర్తిస్తాయి. త్రైమాసిక ప్లాన్లలో కస్టమర్లకు రోజూ 2జీబీ డాటా ఉంటుంది. ఇక రూ.899 ప్లాన్ గడువు 90 రోజులైతే.. రూ.999 ప్లాన్ కాలవ్యవధి 98 రోజులు. అలాగే రూ.3,599 ప్లాన్ గడువు 365 రోజులు. రోజూ 2.5జీబీ డాటాను వాడుకోవచ్చు. 2016 సెప్టెంబర్‌లో ఉచిత వాయిస్ కాల్స్, చౌక ధరలకే ఇంటర్నెట్ సేవలతో భారతీయ టెలికం రంగంలోకి జియో సంచలనాత్మక ప్రవేశం చేసిన విషయం తెలిసిందే. 2జీ, 3జీలను పక్కనబెట్టి 4జీతో పరిచయమైంది. ఈ క్రమంలోనే కేవలం 170 రోజుల్లోనే 10 కోట్ల కస్టమర్ల మార్కును జియో తాకింది. అంతేగాక జియోఫోన్ (ఇంటిలిజెంట్ స్మార్ట్‌ఫోన్), జియోభారత్ (అల్ట్రా-అఫర్డబుల్ 4జీ ఫోన్), జియో ఫైబర్, ఎయిర్‌ఫైబర్ (ఫిక్స్‌డ్ వైర్‌లెస్ బ్రాడ్‌బాండ్ ఆఫర్), పూర్తిస్థాయిలో 5జీ సర్వీసులనూ అందుబాటులోకి తెచ్చింది. ఇటీవలి వార్షిక వాటాదారుల సమావేశంలో జియో యూజర్ల కోసం 100జీబీదాకా ఉచిత క్లౌడ్ స్టోరేజీని కూడా ముకేశ్ అంబానీ ప్రకటించిన సంగతి విదితమే. ఏఐ సాంకేతికతతో వివిధ ఫీచర్లను కస్టమర్లకు అందిస్తున్నట్టూ పేర్కొన్నారు.

బుచ్ రాజీనామా చేయాలి

సెబీ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగుల నిరసనలు

ముంబై, సెప్టెంబర్ 5: క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఉద్యోగులు నిరసనల బాట పట్టారు. అవినీతి ఆరోపణల్ని ఎదుర్కొంటున్న సెబీ చీఫ్ మాధబీ పురి బుచ్ రాజీనామాను కోరుతూ ఇక్కడి బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోగల హెడ్ ఆఫీస్ ఎదుట పెద్ద ఎత్తున మౌన ప్రదర్శన ఇచ్చారు. బుచ్‌తోపాటు ఈ వ్యవహారంలో ఉన్న ఇతర అధికారుల కార్యాలయాల ముందూ నిరసనల్ని వ్యక్తం చేశారు. ఇందులో 200 మందికిపైగా పాల్గొన్నట్టు అంచనా. వీరిలో ఎవరూ మీడియా ముందు మాట్లాడలేదు. కానీ బుధవారం సెబీ విడుదల చేసి పత్రికా ప్రకటనను ఉపసంహరించుకోవాలని, సెబీ చీఫ్ రాజీనామా చేయాలని నినదించారు. సుమారు గంటన్నరపాటు ఈ నిరసనలు కొనసాగాయి. నిజానికి గతంలోనూ ఇదే తరహాలో సెబీ ప్రధాన కేంద్రం వద్ద ఆందోళనలు జరిగాయి. అయితే వాటికి, ఉద్యోగులకు ఎలాంటి సంబంధం లేదని అక్కడి ఉన్నతాధికారులు కొట్టిపారేశారు. ఆ నేపథ్యంలో తాజా ఉద్యోగుల నిరసన మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. అదానీ గ్రూప్ వ్యవహారంలో బుచ్ పాత్ర కూడా ఉందని, విదేశాల్లోని కొన్ని సంస్థల్లో ఆమెకు, ఆమె భర్తకు వాటాలున్నాయని అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ బయటపెట్టింది. అప్పట్నుంచి బుచ్ వార్తల్లో నిలుస్తున్నారు. ఈ క్రమంలోనే ఆగస్టు 6న కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు సెబీలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని, ఉన్నతాధికారుల తీరు అస్సలు బాగాలేదంటూ దాదాపు 500 మంది ఉద్యోగులు లేఖ రాశారు. దీనిపై మీడియాలో వార్తలు రావడంతో సెబీ ఓ పత్రికా ప్రకటనను విడుదల చేస్తూ అంతా ఉట్టిదేనంటూ కొట్టిపారేసింది. ఇది ఉద్యోగులకు మరింత ఆగ్రహాన్ని తెచ్చిపెట్టింది.

సహారా రూ.1,000 కోట్లు కట్టాలి

సహారా గ్రూప్.. ఓ ప్రత్యేక ఎస్క్రో ఖాతాలో 15 రోజుల్లోగా రూ.1,000 కోట్లను డిపాజిట్ చేయాలని సుప్రీం కోర్టు గురువారం ఆదేశించింది. అలాగే రూ.10,000 కోట్ల డిపాజిట్ కోసం ముంబైలోని వార్సోవా వద్దనున్న భూమి అభివృద్ధికి జాయింట్ వెంచర్ ఏర్పాటుకు అనుమతించింది.

ఈవీల సంస్థలకు రాయితీలు అవసరం లేదు

కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: విద్యుత్‌తో నడిచే వాహన తయారీ సంస్థలకు రాయితీలు ఇవ్వాల్సిన అవసరం లేదని కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టంచేశారు. ప్రస్తుతం కొనుగోలుదారులు సొంతంగా ఈవీలు లేదా సీఎన్‌జీ వాహనాలను ఎంచుకునే స్థాయికి చేరుకున్నారని బీఎన్‌ఈఎఫ్ సమ్మిట్‌లో చెప్పారు. ప్రారంభంలో ఈవీల తయారీదారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రత్యేకంగా రాయితీలు ప్రకటించినట్లు, ఆ తర్వాతి క్రమంలో వీటికి డిమాండ్ ఊపందుకున్నదని, దీంతో ఉత్పత్తిపై పెట్టే ఖర్చులు తగ్గుముఖం పట్టడంతో సంస్థలకు ఇచ్చే రాయితీలు అనవసరమని మంత్రి వ్యాఖ్యానించారు. పెట్రోల్, డీజిల్ వాహనాల కంటే ఎలక్ట్రిక్ వాహనాలపై విధిస్తున్న జీఎస్టీ తక్కువ స్థాయిలో ఉన్నదన్నారు. హైబ్రిడ్స్ వాహనాలతోపాటు పెట్రోల్, డీజిల్ వాహనాలపై 28 శాతం జీఎస్టీని వసూలు చేస్తుండగా, అదే ఎలక్ట్రిక్ వాహనాలపై 5 శాతం విధిస్తున్నారు.



ఫార్మా విలేజీల్లేవ్.. క్లస్టర్లే!

1,000-2,000 ఎకరాల్లో ఏర్పాటుకు ప్రభుత్వ యోచన
భూములు ఇచ్చేందుకు స్థానికులు ససేమిరా..

హైదరాబాద్, సెప్టెంబర్ 5(నమస్తే తెలంగాణ): ఫార్మాసిటీ స్థానంలోనే ఫార్మా క్లస్టర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. సుమారు 1,000 నుంచి 2,000 ఎకరాల స్థలంలో ఈ క్లస్టర్‌ను ఏర్పాటు చేసేయోచనలో సర్కార్ ఉన్నది. ఇందుకు సంబంధించి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. సుమారు రూ. లక్ష కోట్ల పెట్టుబడితో 10 ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తామని ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన బయోఏషియా-2024 సదస్సు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం విదితమే. ముందుగా వికారాబాద్, మెదక్, నల్గొండలలో ఈ విలేజ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు, ఒక్కో విలేజ్‌ను వెయ్యి నుంచి రెండు వేల ఎకరాల్లో ఉంటుందని ఆయన తెలిపారు. అయితే ఈ మూడు జిల్లాల్లో ఒకే చోట 1000ఎకరాల భూమి అందుబాటులో లేదని కలెక్టర్లు తేల్చిచెప్పడంతో రాష్ట్ర సర్కార్ దీనిపై పునరాలోచనలో పడినట్లు తెలుస్తున్నది. కానీ ఎలాగైన వికారాబాద్‌లో ల్యాండ్ పూలింగ్ పద్ధతిలోనైనా ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నది. అయితే, అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లడం ఆలస్యం కావడం, భూములు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇచ్చేదిలేదని స్థానికులు తేల్చిచెప్పడంతోపాటు వారిని చుట్టుముట్టి ఆందోళన నిర్వహించారు. అయినప్పటికీ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఫార్మాసిటీ కోసం గతంలో వచ్చిన దరఖాస్తులు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉండటంతో ఆయా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అవసరమైతే 2,000 ఎకరాల వరకైనా ఫార్మా క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలనుకుంటున్నారు. అయితే, గతంలో ప్రతిపాదిత ఫార్మాసిటీలో అన్ని రకాల ఔషధ పరిశ్రమల ఏర్పాటునకు వెసులుబాటు కల్పించాలని నిర్ణయించగా, తాజాగా ప్రతిపాదిత ఫార్మా క్లస్టర్‌లో కాలుష్యం కలిగించే బల్క్‌డ్రగ్ పరిశ్రమలను మినహాయించాలని నిర్ణయించారు. ఫార్మారంగంలో తెలంగాణ రాష్ట్రానికి, ముఖ్యంగా హైదరాబాద్‌కు ఉన్న ప్రత్యేకతను సుస్థిరం చేసే విధంగా గత బీఆర్‌ఎస్ సర్కారు రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో సుమారు 14,029ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటునకు ప్రతిపాదించినది తెలిసిందే. మొదటి దశలో 8,900ఎకరాల్లో ఔషధ పరిశ్రమల ఏర్పాటునకు అవసరమైన ప్రణాళికలను కూడా గత ప్రభుత్వం సిద్ధం చేసింది. ఫార్మాసిటీలో సుమారు రూ. 64,000 కోట్ల పెట్టుబడులు, తద్వారా 4.20 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనావేసింది.

మలబార్ గోల్డ్ 20 షోరూంలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్.. భారత్‌లో వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. వచ్చే నెలలో దేశవ్యాప్తంగా 20 షోరూంలను ప్రారంభించబోతున్నది. వీటిలో ఉత్తరప్రదేశ్‌లో మూడు, ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్‌లలో రెండేసి చొప్పున..ఒడిశా, తెలంగాణ, బెంగాల్, పంజాబ్‌లలో ఒక్క షోరూంను ప్రారంభించాలనుకుంటున్నట్లు మలబార్ గ్రూపు చైర్మన్ ఎంపీ అహ్మద్ తెలిపారు. దీంతోపాటు షార్జా, ఖతార్, సౌదీ అరేబియా, ఉత్తర అమెరికాల్లో నూతన షోరూంలు అందుబాటులోకి తీసుకురానున్నది.

మీషోలో 8.5 లక్షల ఉద్యోగాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: ప్రస్తుత పండుగ సీజన్‌లో మరో ఈ-కామర్స్ సంస్థ మీషో భారీ స్థాయిలో ఉద్యోగులను నియమించుకోవడానికి సిద్ధమైంది. విక్రయదారులు, లాజిస్టిక్ సేవల పరిధిలో 8.5 లక్షల మంది సీజనల్ సిబ్బందిని రిక్రూట్ చేసుకోనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. వీరిలో అత్యధిక మంది తృతీయ శ్రేణి పట్టణాల్లో ఈ నియామకాలు ఉంటాయని పేర్కొంది.



మెర్సిడెజ్ బెంజ్..మరో ఎలక్ట్రిక్ మాడల్‌ను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. మేబ్యాచ్ ఈక్యూస్ 680 ఎస్‌యూవీ ప్రారంభ ధర రూ.2.25 కోట్లుగా నిర్ణయించింది. ఈ ధరలు ముంబై షోరూంనకు సంబంధించినవి. 107.8 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్‌తో తయారైన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 611 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కేవలం 4.4 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ మాడల్ గంటకు 210 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కేవలం అరగంటలోనే 80 శాతం వరకు చార్జింగ్ కానున్నది.

జగన్‌కు ప్రాణహాని నిజమే


అందుకే ఆయనకు జెడ్ ప్లస్ భద్రత
హైకోర్టుకు సెక్యూరిటీ రివ్యూ కమిటీ నివేదిక

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): మాజీ సీఎం, ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రాణహాని ఉందని స్టేట్ సెక్యూరిటీ రివ్యూ కమిటీ అంగీకరించింది. అందుకే జెడ్ ప్లస్ భద్రతను కొనసాగించాలని సిఫారసు చేసినట్టు తెలిపింది. 2014లో కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎం పదవి నుంచి తప్పుకున్నాక ఆయనకు వై క్యాటగిరీ భద్రత ఉన్నదని హైకోర్టుకు వివరించింది. ఎమ్మెల్యేగా జగన్ 1+1 భద్రతకే అర్హులని ఎస్‌ఆర్సీ తేల్చింది. తన భద్రతను తగ్గించేశారని, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు ముందున్న తన భద్రతను కొనసాగించేలా ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలని కోరుతూ వైఎస్ జగన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనికి కౌంటర్ హైకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు రాష్ట్రస్థాయి సెక్యూరిటీ రివ్యూ కమిటీని గతంలో ఆదేశించింది. ఈ మేరకు ఎస్‌ఆర్సీ తరఫున ఐఎస్‌డబ్ల్యూ డీఐజీ, ఎస్పీఎస్ నచికేత్ విశ్వనాథ్ కౌంటర్ దాఖలు చేశారు. ఈ కేసులో తదుపరి విచారణను హైకోర్టు ఈ నెల 13కు వాయిదా వేసింది.

ఆర్టీసీలో విభజించు.. పాలించు!

- **నాడు డ్రైవర్లు.. నేడు కండక్టర్లకు వేతన బకాయిలు**
- **2013 బాండ్ల బకాయిలు విడుదలలో ఆర్టీసీ వింత వైఖరి**
- **యాజమాన్యం తీరుపై కార్మికుల విస్మయం**
- **కార్మికులను విభజించి పాలిస్తుందని ఆగ్రహం**
- **అందరి సమస్యలు పరిష్కరించాల్సిందే : ఆర్టీసీ జేఏసీ**

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఉద్యోగులపై యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరిపై ఆర్టీసీ జేఏసీ మండిపడుతున్నది. ఆర్‌పీఎస్ -2013 బాండ్ల బకాయిల చెల్లింపులో ఆర్టీసీ యాజమాన్యం అనుసరిస్తున్న పద్ధతిపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ కార్మికులకు యాజమాన్యం ఆర్‌పీఎస్ 2013 బాండ్లకు సంబంధించి రూ.280 కోట్ల బకాయి పడింది. వీటిలో రూ.80 కోట్లను కేవలం డ్రైవర్లకు మాత్రమే చెల్లించింది. మిగితా రూ.200 కోట్ల బాండ్ల బకాయిలను చెల్లించాలని ఆర్టీసీ జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆందోళనలకు సిద్ధమయ్యారు. ఆగస్టు 27న రాష్ట్రవ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలతో నిరసనలు చేపట్టారు. ఈ నెల 10న డిమాండ్స్ డేకి పిలుపునిచ్చారు. ఆర్టీసీ కార్మికులను శాంతింపచేసేందుకు గురువారం సుమారు 12వేల నుంచి 15 వేల మంది కండక్టర్లకు సుమారు రూ. 50కోట్ల నుంచి రూ. 80 కోట్ల బాండ్ల బకాయిలను యాజమాన్యం విడుదల చేసింది. దీనిపై ఆర్టీసీ జేఏసీ హర్షం వ్యక్తం చేస్తూనే..మిగితా కేటగిరి వాళ్లకు ఎప్పుడు చెల్లిస్తారని డిమాండ్ చేస్తున్నారు. ఆర్టీసీ కార్మికుల డిమాండ్స్ పూర్తిగా పరిష్కరించే వరకు ఉద్యమ కార్యాచరణను కొనసాగిస్తామని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఇదురు వెంకన్న స్పష్టం చేశారు. ఆర్టీసీ యాజమాన్య వైఖరి వలన బాండ్ డబ్బులు రాని వారిలో ప్రభుత్వంపైన వ్యతిరేకత పెరుగుతుందని చెప్పారు. వినాయక చవితి పండుగలోపు 2013 వేతన సవరణ బాండ్స్ బకాయి డబ్బులు చెల్లించాలని టీజీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కొమిరెడ్డి రాజిరెడ్డి ఆర్టీసి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.



వంద సమస్యల్లో ఒక్కటి పరిష్కారమా?

కార్మికుల సమస్యలు వంద ఉంటే ఒకటీ అర పరిష్కారమైతే ఎలా? ఆర్టీసీ యాజమాన్యం విభజించి పాలిస్తున్నది. ఈ విషయాన్ని కార్మికులు గుర్తించాలి. ట్రేడ్ యూనియన్లు లేకుండా చేసి కార్మికులను హింసిస్తున్నారు. ఆర్టీసీ ఎండీ ట్రేడ్ యూనియన్లను గుర్తించడం లేదు.

- యాదయ్య ఎస్‌డబ్ల్యూఎఫ్ ఐఎన్‌టీయూసీ ప్రతినిధి

కార్మికుల మధ్య విభేదాలు సృష్టించొద్దు : టీఎంయూ

అప్పుడు డ్రైవర్లు.. ఇప్పుడు కండక్టర్లకు బకాయిలు చెల్లించి కార్మికుల మధ్య విభేదాలు సృష్టించడం సరికాదని ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు పీ కమాలాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం థామస్‌రెడ్డి, కార్యనిర్వహణ అధ్యక్షుడు మర్రి నరేందర్ అన్నారు. సంస్థలో కేటగిరీల వారిగా చెల్లింపులు చేయడం వలన కార్మికులలో వేర్పాటువాదానికి దారితీస్తుందని హెచ్చరించారు. శ్రామిక శక్తి నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఎండీ ఇష్టారీతిగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని కార్మికులను ఆందోళనలో పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం, ప్రభుత్వ అధినేతలు ఆర్టీసీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని టీఎంయూ ప్రతినిధులు కోరుతున్నారు.

ఎస్‌సీఆర్ ఏజీఎంగా బాధ్యతలు స్వీకరించిన నీరజ్ అగర్వాల్

హైదరాబాద్, సెప్టెంబర్ 5(నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ అడిషనల్ జీఎంగా నీరజ్ అగర్వాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇండియన్ రైల్వేస్ సర్వీసెస్ ఇంజినీర్స్ 1987 బ్యాచ్‌కు చెందినవారు.

16 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): దసరా, దీపావళి తదితర పండుగల నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో మాల్దా నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ల మధ్య 16 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తున్నట్టు గురువారం రైల్వే అధికారులు తెలిపారు. అక్టోబర్ 8 నుంచి నవంబర్ 28 వరకు ఈ రైళ్ల రాకపోకలు సాగిస్తాయని వెల్లడించారు. విశాఖపట్నం-షిర్డీ, షాలీమార్-హైదరాబాద్, సికింద్రాబాద్, బెంగళూరు-దానాపూర్ రైల్వే స్టేషన్ల మధ్య నాలుగు ప్రత్యేక రైళ్లను ఈ నెల 4, 5 తేదీల్లో పునరుద్ధరించినట్టు తెలిపారు. న్యూఢిల్లీ-చెన్నై, గూడూరు-సికింద్రాబాద్, మణుగూరు-సికింద్రాబాద్ స్టేషన్ల మధ్య ఈనెల 5న పలు రైళ్లను రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు.

'కొలనుపాక'లో జైన తోరణం



హైదరాబాద్, సెప్టెంబర్ 5(నమస్తే తెలంగాణ): భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకలో అరుదైన జైన తోరణం వెలుగుచూసింది. ఇటీవల 36 మందితో కూడిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ ఆధ్వర్యంలో అక్కడ పర్యటించి, సోమేశ్వరాలయ ఆవరణలోని మ్యూజియంలో జైన తోరణాన్ని గుర్తించింది. 8, 9వ శతాబ్దాల్లో పాలించిన రాష్ట్రకూటులు దీనిని చెక్కించారని హరగోపాల్ పేర్కొన్నారు. తోరణం పైభాగంలో ధ్యానముద్రలో ముగ్గురు తీర్థంకరులు, యక్ష, యక్షిణులు, ఇరువైపులా తీగెలు, పూలు చెక్కి ఉన్నాయని తెలిపారు. ఇలాంటి తోరణమే రాజుగారి దర్వాజ (గేట్ వే ఆఫ్ కొలనుపాక) జైన దేవాలయం వెనుకవైపు ఉన్నదని పేర్కొన్నారు. వీటిని భద్రపరచాలని పురావస్తు అధికారులను కోరారు.

విజయవంతంగా అమలవుతున్న సఖి కేంద్రాలు

- **మహిళలకు కౌన్సెలింగ్, అత్యవసర వసతి**
- **కేసీఆర్ హయాంలో ఏర్పాటు**
- **ఏడేండ్లలోనే 65,460 కేసులు**



హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): మహిళలు, చిన్నారుల రక్షణ కోసం కేసీఆర్ హయాంలో ఏర్పాటైన సఖి కేంద్రాలు రాష్ట్రంలో మహిళలకు వరంగా మారాయి. పోలీసు శాఖతో కలిసి సఖి కేంద్రాలు తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. ఇందులో బాధితులకు ఉచిత కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు వారంలో ఐదు రోజులపాటు వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. 2017లో మహిళల రక్షణ కోసం 33 కొత్త జిల్లాల వారీగా ఏర్పాటు చేసిన వీటిలో ఇప్పటివరకు 65,460 కేసులు నమోదయ్యాయి. మహిళల విషయంలో కేసీఆర్ ముందు స్తు ఆలోచన చేయడం వల్లే రాష్ట్రవ్యాప్తంగా జిల్లాకొకటి చొప్పున సఖి కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. సఖి కేంద్రాల ఏర్పాటు ఘనత గత బీఆర్‌ఎస్ సర్కారుకే దక్కుతుందన్న అభిప్రాయాలు జోరుగా వినిపిస్తున్నాయి. సఖి కేంద్రాల్లో నమోదైన మొత్తం 65,460 కేసుల్లో గృహ హింస కింద 43,002 కేసులు, వరకట్నం వేధింపు కేసులు 3,049, పోక్సో కింద 2,278 ఇతర కేసులు నమోదైనట్టు అధికారులు వెల్లడించారు.

బ్రహ్మకుమారీస్‌తో ఒప్పందాన్ని వెనక్కి తీసుకోవాలి

- **సోషల్ వెల్ఫేర్ సెక్రటరీకి డీవైఎఫ్ఐ డిమాండ్**

హైదరాబాద్, సెప్టెంబర్5 (నమస్తే తెలంగాణ): ఎస్సీ గురుకుల విద్యాసంస్థల్లో మోటివేషన్ తరగతుల పేరుతో ఆధ్యాత్మిక భావజాలం కలిగిన బ్రహ్మకుమారీస్ సంస్థని తీసుకురావడాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలి డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జావీద్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ చేశారు. గురుకులాల విద్యార్థులకు తీవ్ర ఒత్తిడి పెంచేలా పనివేళలను మార్చి, ఇప్పుడు ఆ ఒత్తిడిని తట్టుకోవాలనే పేరుతో బ్రహ్మకుమారీస్ సంస్థను తీసుకువస్తున్నారని మండిపడ్డారు. శాస్త్రీయ విద్యతోనే విద్యా వ్యవస్థలో మార్పు సాధ్యమని తెలిపారు.

టీడీపీ ఎమ్మెల్యే రాసలీలలు?

- **సత్యవేడు ఎమ్మెల్యే అరాచకాలు**
- **పార్టీలో మహిళా కార్యకర్తకు ఆదిమూలం లైంగిక వేధింపులు**
- **అర్ధరాత్రి ఫోన్లు, మెసేజ్‌లతో బెదిరింపులు**
- **కుటుంబాన్ని చంపేస్తానని లైంగికదాడి**
- **పెన్ కెమెరాతో వీడియో విడుదల చేసిన బాధితురాలు**
- **హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో వివరాల వెల్లడి**
- **ఎమ్మెల్యేపై సస్పెన్షన్ విధిస్తూ పార్టీ అధిష్ఠానం నిర్ణయం**



హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం రాసలీలలు వెలుగులోకి వచ్చాయి. పార్టీలో పని చేసే మహిళా కార్యకర్త ఫోన్ నంబర్ తీసుకుని అర్ధరాత్రి ఫోన్లు, మెసేజ్‌లతో బెదిరించినట్టు బాధితురాలు హైదరాబాద్‌లో గురువారం మీడియా సమావేశంలో వెల్లడించింది. తిరుపతిలో హోటల్‌కు తీసుకెళ్లి లైంగిక దాడి చేసినట్టు చెప్పింది. ఎవరికైనా చెబితే కుటుంబాన్ని చంపేస్తానని బెదిరించినట్టు ఆరోపించింది. మూడుసార్లు లైంగిక దాడి జరుపడంతో పెన్ కెమెరా వినియోగించి వీడియో విడుదల చేసినట్టు చెప్పింది. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై లైంగిక దాడి ఆరోపణలు రావడంతో టీడీపీ అధిష్ఠానం వెంటనే స్పందించింది. బాధితురాలు మీడియా సమావేశం పెట్టిన కొన్ని గంటల్లోనే ఎమ్మెల్యే ఆదిమూలంను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావు నిర్ణయం తీసుకున్నారు. చిత్తూరు జిల్లా సత్యవేడు నియోజకవర్గంలో 2014లో కోనేటి ఆదిమూలం వైసీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2019లో ఎమ్మెల్యేగా గెలిచిన ఆదిమూలాన్ని 2024లో వైసీపీ అధిష్ఠానం తిరుపతి నుంచి పోటీ చేయాలని సూచించగా ఆయన అంగీకరించలేదు. దీంతో వైసీపీకి రాజీనామా చేసి సత్యవేడు నుంచి ఆదిమూలం ఎమ్మెల్యేగా గెలుపొందారు.

చందాదారులకు డిపాజిట్లు చెల్లించారా?

మార్గదర్శిపై పత్రికల్లో యాడ్స్ ఇవ్వండి: హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): మార్గదర్శి ఫైనాన్షియర్స్ యాజమాన్యం తమ చందాదారులందరికీ డిపాజిట్లతాలూకు నగదు తిరిగి చెల్లించిందో లేదో, ఎవరికైనా ఎగవేసిందో లేదో తెలుసుకునేందుకు వీలుగా తెలుగు, ఇంగ్లిష్, హిందీ పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. దీనిపై బాగా ప్రచారం జరిగేలా నోటీసులు జారీ చేయాలని తెలిపింది. ఇందుకు అయ్యే ఖర్చులను మార్గదర్శి వెచ్చించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్ రావు ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పత్రికల్లో వచ్చిన నోటీసుల కాపీలను తదుపరి విచారణ రోజు తమ ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి డిపాజిట్ల సేకరణ చట్ట వ్యతిరేకమంటూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను అక్టోబర్ ఒకటికి వాయిదా వేసింది.



కొడంగల్ నుంచి యాచారం మండలం మేడిపల్లికి వచ్చిన ఫార్మాసిటి బాధిత రైతులు

'కొడంగల్'లో ఫార్మాసిటీని ఒప్పుకోం

- ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం
- మేడిపల్లి వెళ్లిన దుద్యాల ఫార్మా బాధితులు
- అక్కడి ఉద్యమ స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని నిర్ణయం

యాచారం, సెప్టెంబర్ 5 : సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలో ఏర్పాటు చేయతలపెట్టిన ఫార్మాసిటీని అడ్డుకునేందుకు బాధిత రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే పలు దఫాలుగా ఆందోళనలు, నిరసనలు చేపట్టిన కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలం లగచర్ల, హకీంపేట, పోలేపల్లి, ఆర్బీతండా, పులిచర్లకుంట తండా, ఈర్లపల్లితండాకు చెందిన పలువురు రైతులు ఉద్యమాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించారు. గతంలో యాచారం మండలంలోని అక్కడి బాధిత రైతులు అడ్డుకున్న విధంగానే తాము ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. ఈ మేరకు గురువారం రైతులు యాచారం మండలంలోని మేడిపల్లి గ్రామానికి వెళ్లి అక్కడి ఫార్మాసిటీ బాధిత రైతులు, నాయకులతో సమావేశమయ్యారు. గతంలో యాచారం, కందుకూరు మండలాల్లో అప్పటి ప్రభుత్వం హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ పేరుతో ఏర్పాటుకు ప్రయత్నించగా.. వారు ఎంచుకున్న ఉద్యమ కార్యాచరణ, అడ్డుకున్న విధానం, నష్టపరిహారం, వ్యతిరేక ఉద్యమాలపై ఆరా తీశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మా సిటీ ఏర్పాటును అడ్డుకుంటామని స్పష్టంచేశారు. గోబ్యాక్ ఫార్మా అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పచ్చని పంట పొలాల్లో ఫార్మా విషం ఏంటని ప్రశ్నించారు. కొడంగల్‌లో ఫార్మాను అడ్డుకొని తీరుతామని స్పష్టం చేశారు. కొడంగల్ సెగ్మెంట్‌లో 1,375 ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తామని ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే.

• దేవుడా.. ఫార్మాసిటీని అడ్డుకోండి



మంచిగా పంటలు పండుతున్న తమ భూముల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేయకుండా అడ్డుకోవాలని దేవుడిని కోరుతూ భూబాధితులు గ్రామ దేవతలకు పూజలు చేశారు. గురువారం సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం డప్పూర్‌లో ఫార్మాసిటీ భూబాధితులు, గ్రామస్థులు కలిసి భాజాభజంత్రీల మధ్య ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కులమతాల కతీతంగా భూబాధితుల కుటుంబ సభ్యులు గ్రామ దేవతల ఆలయాలు, చర్చిలు, మసీదులు, దర్గాల్లో పూజలు, ప్రార్థనలు చేశారు. ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తే తమ బతుకులు ఆగమవుతాయని, ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా దీవించాలని మొక్కుకున్నారు. – న్యాల్‌కల్

• పాలబిల్లుల కోసం ధర్నా



పెండింగ్ పాల బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ పాడి రైతులు రోడ్డెక్కారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం మార్చాల గేట్ వద్ద కోదాడ–జడ్చర్ల ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా క్యాన్లలో ఉన్న పాలను రోడ్డుపై పారబోసి నిరసన తెలిపారు. విజయా డెయిరీకి పాలుపోస్తే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బిల్లులు చెల్లించకుండా మొండిగా వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. – కల్వకుర్తి

• కరెంట్ కోసం ఏఈ ఆఫీస్ ఎదుట నిరసన



విద్యుత్తు అధికారులు కరెంట్ సరఫరా నిలిపి వేయడంతో తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లోని సుభాష్‌నగర్ కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం వారు స్థానిక ఏఈ కార్యాలయం ఎదుట బైఠాయించారు. – భీమ్‌గల్

• బ్యాంకు అధికారుల తీరుపై రైతుల ఆందోళన



'రుణమాఫీ కోసం బ్యాంకుకు వెళ్తే వడ్డీ డబ్బులు కట్టించుకొని రసీదు ఇస్తలేరు.. క్రాప్ లోన్ రెన్యువల్ కోసం నెల రోజుల తర్వాత రమ్మంటున్నారు' అని బ్యాంకు అధికారుల తీరుపై మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం వారు మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లితోపాటు పలు గ్రామాల రైతులు నెల్లికుదురు ఎస్‌బీఐ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోన్ స్టేట్‌మెంట్, లోన్ వడ్డీ చెల్లించడానికి రోజుల తరబడి బ్యాంకు చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. – నెల్లికుదురు

ఈ గురుకులం మాకొద్దు!

నిర్వహణ వైఫల్యంతో ఖాళీ అవుతున్న గురుకులాలు

- బర్ల దొడ్డి కన్నా అధ్వానంగా హాస్టళ్లు
- టీసీలు తీసుకెళ్లిపోయిన ఏడుగురు విద్యార్థులు
- మిగిలినవారూ ఒక్కొక్కరుగా గుడ్‌బై!
- కందుకూరు గురుకులాన్ని సందర్శించిన మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డి
- నిర్వహణలోపంపై సర్కారును నిలదీత



వర్షం నీళ్లతో విద్యార్థులు పడుకునే గది

మహేశ్వరం, బడంగ్‌పేట, సెప్టెంబర్ 5: నిర్వహణ వైఫల్యంతో గురుకులాలన్నీ ఖాళీ అవుతున్నాయి. హాస్టళ్లలో సౌకర్యాలు కల్పించకపోవటం, నాసిరకం ఆహారం.. తదితర కారణాలతో విద్యార్థులు గురుకులాలకు గుడ్‌బై చెప్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని గురుకులాల్లో ఇవే పరిస్థితులు. సర్కారు నిర్వహణ లోపం వల్లే తమ పిల్లల టీసీలు తీసుకెళ్లిపోతున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు చెప్తున్నారు. ఇలాంటి గురుకులంలో ఉండలేమంటూ రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని నాదర్‌గుల్‌లో ఉన్న కందుకూరు గురుకులానికి చెందిన ఏడుగురు విద్యార్థులు టీసీలు తీసుకెళ్లిపోయారు. దీంతో పరిస్థితులు తెలుసుకొనేందుకు మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డి ఆ గురుకులాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పడుతున్న అవస్థలు చూసి ఆమె చలించిపోయారు. నిర్వహణ సరిగా లేక హాస్టల్ గదులు, క్లాస్ రూమ్‌లు దుర్గంధంతో నిండిపోయాయి. కొంతమంది విద్యార్థులు జ్వరంతో నేలపైనే పడుకోవటం చూసి ఆవేదన చెందారు.

ఇదేం హాస్టల్: సబితాఇంద్రారెడ్డి

'ఇదేం హాస్టల్.. గదుల్లో కిటికీలు, తలుపులు, ఫ్యాన్లు సక్రమంగా లేవు.. మరుగుదొడ్ల నుంచి పిల్లల గదుల్లోకి తీవ్ర దుర్గంధం.. వర్షం వస్తే గదుల్లో నీరు.. అక్కడే పిల్లలు ఉండాల్సిన దుస్థితి.. బర్ల దొడ్డికన్నా ఈ హాస్టల్ అధ్వానంగా ఉన్నది' అని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం కందుకూరు గురుకుల హాస్టల్‌ను సందర్శించిన ఆమె.. విద్యార్థుల దుర్భర పరిస్థితిని చూసి చలించిపోయారు. హాస్టల్ అంతా కలియదిరిగి మరుగుదొడ్లు, మంచినీటి ట్యాంకులను పరిశీలించారు. జ్వరంతో బాధపడుతున్న పిల్లలను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. 550 మంది విద్యార్థులు చదువుకునే హాస్టల్‌లో ఇన్ని సమస్యలు ఉంటే ఎందుకు పట్టించుకోవడం లేదని పాలకులను ప్రశ్నించారు. కనీసం తాగడానికి మంచినీళ్లు కూడ లేకపోతే ఎలా? అని నిలదీశారు. విద్యార్థులు చదువుకోవటానికి కనీసం బెంచీలు, టేబుళ్లు లేకపోతే ఎలా? అని ప్రశ్నించారు. హాస్టల్‌ను సందర్శించిన సందర్భంగా సబితకు విద్యార్థులు తమ సమస్యలు చెప్పుకున్నారు. తరగతి గదుల్లో కూడా దుర్గంధ వాసన వస్తున్నదని, దోమలు విపరీతంగా ఉన్నాయని తెలిపారు. అక్కడికొచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఎమ్మెల్యేలకు తమ పిల్లల ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెట్టారు. వెంటనే ఆమె ఉన్నతాధికారులకు ఫోన్ చేసి అక్కడి సమస్యలను వివరించారు. శుక్రవారమే వచ్చి ఫర్నిచర్ ఇతర సమస్యలను తీరుస్తామని ఎమ్మెల్యేకు అధికారులు తెలిపారు. బడంగ్‌పేట మున్సిపల్ కమిషనర్ రఘుకుమార్, ఏఈ వినీల్‌గౌడ్‌ను రప్పించి అవుట్‌లేట్ ఏర్పాటు చేయడానికి డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ ఏర్పాటు చేయించాలని ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో చైర్మన్ నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు సూర్ణగంటి అర్జున్, యాతం పవన్‌కుమార్, సుక్క శివకుమార్, కోఆప్షన్ జగన్‌మోహన్‌రెడ్డి, బడంగ్‌పేట బీఆర్‌ఎస్ నాయకులు రామిడి రాంరెడ్డి, బీమిడి జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనలో సర్కారు విఫలం

నాదర్‌గుల్‌లో ఉన్న గురుకులంలో 550 మంది విద్యార్థులు ఉన్నారు. జూనియర్ కళాశాల కూడా ఇదే భవనంలో ఉన్నది. సౌకర్యాలు కల్పించటంలో సర్కారు విఫలం కావటంతో.. విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్ ముందు ధర్నా చేసినా ఫలితం లేకపోయింది. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పరిస్థితి మారలేదు. వర్షాలతో గదుల్లోకి వర్షపు నీరు వచ్చి చేరుతున్నది. కనీస సమస్యలు కూడా పరిష్కరించకపోతే పిల్లలను ఎలా చదివించాలని పేరెంట్స్ కమిటీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. నాసిరకం భోజనం పెడుతున్నారని, బాలుర హాస్టల్‌లో డైనింగ్ లేక పిల్లలు నేలపైనే కూర్చొని తినాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని వెల్లడించారు.

రోడ్డెక్కిన గౌలిదొడ్డి గురుకుల విద్యార్థులు

- ఉపాధ్యాయుల దినోత్సవం రోజే నిరసన
- తరగతులు బహిష్కరించి ఆందోళన బాట

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 5: 'సీనియర్ ఫ్యాకల్టీలను మార్చొద్దు.. మా భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయొద్దు.. అని ఉపాధ్యాయుల దినోత్సవం రోజే గౌలిదొడ్డి గురుకుల కళాశాలల విద్యార్థులు రోడ్డెక్కారు. హైదరాబాద్ శేరిలింగంపల్లిలోని గౌలిదొడ్డి సాంఘిక, సంక్షేమ ఐఐటీ ఇంటర్ బాలుర కళాశాల విద్యార్థులు తరగతులను బహిష్కరించి, క్యాంపస్ గేటు ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళనను విరమించేది లేదని విద్యార్థులు తేల్చి చెప్పారు. గురుకుల విద్యాలయాల సెక్రటరీ ఈ విషయమై వెంటనే స్పందించాలని కోరారు. కొద్దిసేపటికే సమీపంలోని బాలికల గురుకుల విద్యార్థులు సైతం తరగతి గదుల నుంచి విద్యాలయం గేటు ముందు జర్నలిస్టు కాలనీ ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. పరీక్షల సమయం దగ్గరపడుతున్న వేళ కొత్తవారిని నియమించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ సమస్యలను పట్టించుకోకుండా గురుకుల విద్యాలయాల సెక్రటరీ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ విద్యార్థులను అణగతొక్కేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని తల్లిదండ్రులు ఆరోపించారు.

ఏఐ అంతర్జాతీయ కేంద్రంగా హైదరాబాద్

- ఫోర్త్ సిటీలో 200 ఎకరాల్లో ఏఐసిటీ ఏర్పాటు
- 26 సంస్థలతో ఒప్పందాలు



సమ్మిట్‌లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, వివిధ దేశాల ప్రతినిధులు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరాన్ని కృత్రిమ మేధస్సు(ఏఐ)కి అంతర్జాతీయ కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. అందులో భాగంగానే తమ ప్రభుత్వం కొత్తగా నిర్మిస్తున్న ఫోర్త్ సిటీలో ఏఐ కార్యకలాపాల కోసం 200 ఎకరాలను కేటాయించిందని చెప్పారు. హెచ్ఐసీసీలో గురువారం రాష్ట్ర ఐటీ శాఖ నిర్వహించిన ఏఐ గ్లోబల్ సమ్మిట్‌ను ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు వస్తున్న కొత్త టెక్నాలజీలతో సమాజంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని అన్నారు. తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ సైతం కొత్త ఆవిష్కరణలకు కేంద్రంగా మారిందని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ఏఐకి ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తించిన తమ ప్రభుత్వం ఏఐ కార్యకలాపాల కోసం ఫోర్త్ సిటీలో 200 ఎకరాల్లో ఏఐ సిటీని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. వ్యవసాయం, వైద్య, ఆరోగ్యం, విద్య, ప్రజా రవాణా వ్యవస్థల్లో ఏఐ వినియోగంపై ఇండస్ట్రీ నిపుణులతో కలిసి పనిచేస్తున్నామని చెప్పారు. ఏఐ సిటీ నిర్మాణం పూర్తయ్యే వరకు శంషాబాద్‌లోని ప్రపంచ వాణిజ్య కేంద్రంలో రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అన్ని సౌకర్యాలతో కూడి కార్యాలయ స్థలాన్ని ఏఐ ఆధారిత కంపెనీల కోసం అందుబాటులో ఉంచుతామని చెప్పారు. వివిధ సంస్థలతో 26 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. రెండ్రోజులు జరిగే సదస్సులో 50కి పైగా స్టార్టప్‌లతో ప్రదర్శన ఏర్పాటు చేశారు.

రైస్ మిల్లర్ల సంఘంలో చీలిక

రారైస్, బాయిల్డ్‌రైస్ మిల్లర్లుగా ఏర్పాటు

హైదరాబాద్, సెప్టెంబర్ 5(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ రెండుగా చీలిపోయింది. రారైస్, బాయిల్డ్ రైస్ మిల్లర్లుగా విడిపోయారు. ఇందులో భాగంగానే పాత అసోసియేషన్ నుంచి బయటకొచ్చిన రారైస్ మిల్లర్లు వేరుగా 'రాష్ట్ర రారైస్ మిల్లర్ల అసోసియేషన్'ను ఏర్పాటు చేసుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా వరంగల్‌కు చెందిన గణపతిరెడ్డిని ఎన్నుకున్నారు. పాత అసోసియేషన్‌లో కీలక పోస్టులన్నీ బాయిల్డ్ రైస్ మిల్లుల ఓనర్లే దక్కించుకునేవారని, తమకు అవకాశం ఇవ్వలేదని రారైస్ మిల్లర్లు ఆరోపిస్తున్నారు. తమ సమస్యలను తామే పరిష్కరించుకోవాలనే అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు.



హెచ్ఐసీసీ వేదికగా జరిగిన ఏఐ గ్లోబల్ సమ్మిట్‌లో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

ఏఐ గ్లోబల్ సమ్మిట్‌లో ఖాళీ కుర్చీలు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఏఐ గ్లోబల్ సమ్మిట్ ఆశించిన విజయం సాధించలేదనడానికి సదస్సులో కనిపించిన ఖాళీ కుర్చీలే నిదర్శనం. రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసుకున్నా, సదస్సు కోసం రూ.9.45 కోట్ల బడ్జెట్ కేటాయించినా.. కార్యక్రమానికి స్పందన కరువైంది. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)లో నిర్వహించిన సదస్సు ప్రధాన హాలులో ఏర్పాటుచేసిన కుర్చీల్లో 30 శాతం ఖాళీగానే కనిపించాయి. సీఎం రేవంత్, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు సభావేదికపై ఉన్నప్పుడే ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఐటీ రంగ ప్రముఖులు, ప్రపంచ దిగ్గజ కంపెనీలు పాల్గొంటాయని చెప్పినా, 4–5 ప్రముఖ కంపెనీల ప్రతినిధులే తప్ప, మిగతావాళ్లంతా స్టార్టప్ కంపెనీల ప్రతినిధులే వచ్చారు. ఇక ఐఅండ్‌పీఆర్ ప్రతినిధిగా ఉన్న డిప్యూటీ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్లు తమ పట్ల దురుసుగా ప్రవర్తించారని కొంతమంది జర్నలిస్టులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమం కవరేజ్‌కు ఆహ్వానించి.. మీడియా పట్ల దురుసుగా ప్రవర్తిస్తారా అంటూ విమర్శించారు.

మేడం ఎక్కడో ఆ మేనేజర్ అక్కడే!

- సోషల్ వెల్ఫేర్‌లో డిప్యుటేషన్‌పై ఎఫ్ఎం కిరణ్మయి
- టెస్కో, ఆయుష్‌లోనూ ఇదే సెక్రటరీ వద్ద విధులు
- అడ్డగోలుగా ఆరోపణలు.. కో ఆపరేటివ్ సొసైటీ విమర్శలు

హైదరాబాద్, సెప్టెంబర్5 (నమస్తే తెలంగాణ): సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీలో మరో అడ్డగోలు వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. సొసైటీ సెక్రటరీ విధులు నిర్వర్తించే చోటుకే ఓ అధికారిణి వాలిపోవడమే అందుకు కారణం. అందులో ఆంతర్యమేమిటని? సొసైటీ ఉన్నతాధికారులే కాదు, ఉద్యోగ, ఉపాధ్యాయవర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. సోషల్ వెల్ఫేర్ గురుకుల సొసైటీ ఫైనాన్స్ విభాగంలో అడిషనల్ సెక్రటరీగా కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్‌లో అడిషనల్ జాయింట్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ కిరణ్మయిని నియమిస్తూ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులను జారీచేసింది. సొసైటీ సెక్రటరీ అలుగు వర్షిణి ఎక్కడ పనిచేస్తే అక్కడికి ఈ అధికారి వాలిపోవడం గమనార్హం. సొసైటీ సెక్రటరీ వర్షిణి గతంలో ఆయుష్ విభాగంలో పనిచేయగా ఇదే కిరణ్మయి ఆమె వద్ద విధులు నిర్వర్తించారు. అనంతరం అక్కడి నుంచి చేనేత జౌళిశాఖకు వెళ్లగా అక్కడికి సైతం కిరణ్మయి డిప్యూటేషన్‌పై వెళ్లారు. ప్రస్తుతం సోషల్ వెల్ఫేర్ సెక్రటరీగా వర్షిణి విధులు నిర్వర్తిస్తుండగా, మళ్లీ ఇదే సొసైటీకి డిప్యుటేషన్‌పై అడిషనల్ సెక్రటరీగా రావడం కొసమెరుపు. ఇదే ఇప్పుడు ఉద్యోగ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గురుకుల సొసైటీ సెక్రటరీగా అలుగు వర్షిణి మే నెలాఖరులో బాధ్యతలు చేపట్టారు. ఆ వెంటనే నెలరోజులు తిరగకుండానే సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు సీనియర్ అడిషనల్ సెక్రటరీ అవసరమని, అందుకు డాక్టర్ కిరణ్మయిని నియమించాలని కోరుతూ ప్రభుత్వానికి ఆమె లేఖ పెట్టడం గమనార్హం. దానికి ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. మేడం ఎక్కడికి వెళ్తే కిరణ్మయి సైతం అక్కడికే వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఇద్దరి మధ్య అంతటి అనుబంధమేమిటోనని అనేక విధాలుగా చర్చించుకుంటున్నారు.

ఆరోపణలెన్ని వచ్చినా ఆగని డిప్యుటేషన్లు

సోషల్ వెల్ఫేర్ గురుకుల సొసైటీ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ సెక్రటరీగా డిప్యూటేషన్‌పై నియమితులైన డాక్టర్ కిరణ్మయిపై అనేక ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినా ఆమె డిప్యూటేషన్లు ఆగకపోవడం గమనార్హం. ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులే కాదు, చేనేత జౌళిశాఖ ఉద్యోగులు సైతం బాహాటంగానే పలు విమర్శలు చేశారు.

ఆమరణ దీక్షలకు దిగుతాం

- గురుకుల పార్ట్‌టైం, గెస్ట్ ఫ్యాకల్టీల స్పష్టీకరణ
- రెండో రోజూ సొసైటీ కార్యాలయం ఎదుట ధర్నా

హైదరాబాద్, సెప్టెంబర్5 (నమస్తే తెలంగాణ): అర్ధాంతరంగా తొలగించిన తమను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి, లేదంటే ఆమరణ దీక్షలకు దిగుతామని గురుకులాల నుంచి ఇటీవల తొలగింపునకు గురైన సిబ్బంది స్పష్టంచేశారు. ఈ మేరకు తమను విధుల్లోకి తీసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీల్లోని సీవోఈ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్), నాన్ సీవోఈలు, ప్రత్యేక గురుకులాలు, వొకేషనల్ గురుకులాల పార్ట్‌టైం, గెస్ట్ ఫ్యాకల్టీ, సబ్జెక్ట్ అసోసియేట్లు, ఫిజికల్ డైరెక్టర్లు రెండోరోజైన గురువారం సొసైటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సెక్రటరీ నిర్ణయంతో 6,500 మంది కుటుంబాలు రోడ్డున పడ్డాయని, 3 నెలలుగా వేతనాలు కూడా చెల్లించలేదని, ఇదేమని అడిగినందుకు కక్షగట్టి విధుల నుంచి తొలగించారని తెలిపారు. ఉదయం నుంచి నిరీక్షించినా ఏమాత్రం లెక్కచేయకుండా సెక్రటరీ, ఇతర అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

అగ్రికల్చర్ కాలేజీల్లో లెక్చరర్ పోస్టులు

ఈ నెల 13వరకు దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, సెప్టెంబర్5 (నమస్తే తెలంగాణ) : మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఎంజేపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలోని వనపర్తి, కరీంనగర్ అగ్రికల్చర్ మహిళా డిగ్రీ కళాశాలల్లో పలు అధ్యాపక పోస్టులను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు సొసైటీ కార్యదర్శి సైదులు గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. అగ్రానమీ 2, లైవ్‌స్టాక్, యానిమల్ హస్బెండరీ 2, జెనెటిక్స్, ప్లాంట్ బ్రీడింగ్ 2, ఎంటమాలజీ 2, అగ్రికల్చర్ ఎకనామిక్స్ 2, ప్లాంట్ పాథాలజీ 2, అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ 2 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు వెల్లడించారు. ఎమ్మెస్సీ అగ్రికల్చర్, పీహెచ్‌డీ చేసిన మహిళా అభ్యర్థులు అర్హులని, ఆసక్తి గలవారు ఈ నెల 13లోగా రెస్యూమ్, అకడమిక్ ప్రొఫైల్‌ను mjpkrnagbsc2022@gmail.comకు మెయిల్ చేయాలని, దరఖాస్తు చేసుకున్న వారికి డెమో/ఇంటర్వ్యూ నిర్వహించి సెలెక్ట్ చేయనున్నట్టు వెల్లడించారు. పూర్తి వివరాలకు 7680941504నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆరుగురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎదురుకాల్పులు
- మృతుల్లో అగ్రనేత లచ్చన్న దంపతులు
- జనజీవనంలోకి రావాలని డీజీపీ పిలుపు



ఘటనా స్థలానికి వెళ్తున్న భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

కరకగూడెం/కొత్తగూడెం క్రైం, సెప్టెంబర్ 5: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కరకగూడెం మండలం ఏజెన్సీ ప్రాంతం గురువారం తెల్లవారుజామున తుపాకీల మోతలతో ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పచ్చని చెట్లపై రక్తపు మరకలు చిందించింది. రఘునాథపాలెం, మోతే, తాటిగూడెం సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, గ్రేహౌండ్స్ బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు హతమయ్యారు. భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు కథనం ప్రకారం.. ఆ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో గ్రేహౌండ్స్ పోలీసులు గాలింపు చేపట్టారు. గ్రేహౌండ్స్ బలగాలను గమనించిన మావోయిస్టులు కాల్పులకు దిగారు. అప్రమత్తమైన గ్రేహౌండ్స్ బలగాలు ఎదురుకాల్పులకు దిగాయి. కాల్పుల విరమణ తర్వాత ఘటనా స్థలాన్ని అధీనంలోకి తీసుకున్న గ్రేహౌండ్స్ బలగాలు.. ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించాయి. మృతుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు ఉన్నారు. మావోయిస్టు పార్టీ అగ్రనేత, మణుగూరు ఏరియా కార్యదర్శి లచ్చన్న దంపతులు కూడా మృతి చెందారు. వీరిపై రివార్డులు ఉన్నట్టు ఎస్పీ తెలిపారు. ఘటనా స్థలం నుంచి ఏకే 47 తుపాకులు 2, ఎస్ఎల్ఆర్ 1, 303 రైఫిల్ 1, పిస్టల్ 1, మ్యాగజైన్‌తోపాటు లైవ్ రౌండ్లు, కిట్ బ్యాగులు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఎదురుకాల్పుల్లో ఇద్దరు గ్రేహౌండ్స్ పోలీసులకు తీవ్ర గాయాలు కావడంతో భద్రాచలం ఏరియా దవాఖానకు తరలించామని తెలిపారు. ఒక మావోయిస్టు పారిపోయినట్టు పేర్కొన్నారు.

ముగ్గురు మంత్రులదే బాధ్యత: ఆజాద్

రఘునాథపాలెం ఎన్‌కౌంటర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వంతోపాటు జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు బాధ్యత వహించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న హత్యలకు త్వరలోనే నెత్తుటి బాకీ తీర్చుకుంటామని హెచ్చరిస్తూ మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం–అల్లూరి సీతారామరాజు జిల్లా డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పేరుతో గురువారం లేఖ విడుదలైంది. పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు కామ్రేడ్లతోపాటు ఓ గ్రామస్థుడు చనిపోయినట్టు పేర్కొన్నారు. ఈ ఘటనలో రాయిగూడెం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం డివిజన్ కమిటీ సభ్యుడు లచ్చన్న, ఆయన సతీమణి తులసి అలియాస్ పూనెం లక్కీ, పాల్వంచ–మణుగూరు ఏరియా కమిటీ కమాండర్ రాము, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కోమటిపల్లికి చెందిన పార్టీ సభ్యురాలు కోసి, గంగాల్, పార్టీ సీనియర్ సభ్యుడు, బొట్టెంకు చెందిన దుర్గేశ్ అమరులయ్యారని తెలిపారు. ఈ నెల 9న బంద్‌కు పిలుపునిస్తున్నట్టు పేర్కొన్నారు.

జనంలోకి రండి: డీజీపీ పిలుపు

తెలంగాణకు చెందిన మావోయిస్టు కార్యకర్తలు, అధినాయకత్వం జనజీవన స్రవంతిలోకి రావాలని డీజీపీ జితేందర్ కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కర్కగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోతె గ్రామ సమీపంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు చనిపోయినట్టు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మావోయిస్టు కార్యకర్తలందరూ జనజీవన స్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. నిర్మాణాత్మక భాగస్వామ్యంతో తెలంగాణ ప్రభుత్వం కల్పించే పునరావాస పథకం ద్వారా ప్రయోజనం పొందాలని డీజీపీ కోరారు.

రెండు నెలల్లో 17 మంది హతం

రెండు నెలల వ్యవధిలో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లో జరిగిన ఎదురుకాల్పుల ఘటనల్లో 17 మంది మావోయిస్టులు హతమయ్యారు. గురువారం ఒక్కరోజే భద్రాది కొత్తగూడెం జిల్లాలో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఏడాది జూలై 26న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దామరతోగు–రంగాపురం మధ్యలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నల్లమూరి అశోక్ అలియాస్ విజేందర్ మృతి చెందాడు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడలో 9 మంది మావోయిస్టులు హతమైన ఘటన జరిగిన రెండు రోజుల్లోనే తెలంగాణలో మరో ఆరుగురు మావోయిస్టులను పోలీసు బలగాలు మట్టుబెట్టాయి. కేసీఆర్ ప్రభుత్వం మావోయిస్టుల కుటుంబాలకు సైతం రైతుబంధు, రైతుబీమా, లొంగిపోయిన వారికి రివార్డులు ఇచ్చి ప్రోత్సహించింది. దీంతో గడిచిన పదేండ్లలో 600 మందికి పైగా మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిశారు.